www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 6-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 270 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: విదియ రా.9:26 తదుపరి తదియ, నక్షత్రం: మృగశిర ఉ.8:49, ఆర్ద్ర తె.6:13, వర్జ్యం: సా.4:18-5:44, దుర్ముహూర్తం: ఉ.6:36-8:04, అమృతఘడియలు: రా.9:18-10:43, రాహుకాలం: ఉ.9:00-10:30, సూర్యోదయం: 6:36, సూర్యాస్తమయం: 5:36 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కలిసి సాగుదాం..



ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన భారత్-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో చర్చలు జరుపుతున్న ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇరు దేశాల మంత్రులు, అధికారులు

భారత ఇంధన అవసరాలన్నీ తీరుస్తాం

అంతరాయం లేకుండా చమురు సరఫరా చేస్తాం

- కూడంకుళం అణువిద్యుత్ ప్లాంటుకు సహకరిస్తాం
- ప్రధాని మోదీతో భేటీలో రష్యా అధ్యక్షుడు పుతిన్ హామీలు
- ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో 23వ శిఖరాగ్ర సమావేశం
- భారత్, రష్యా మధ్య ఐదేళ్ల వ్యవధికి ఆర్థిక ఒప్పందం
- 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ డాలర్లకు
- ఆరోగ్యం, ఆహార భద్రత, షిప్పింగ్ తదితర 16 ఒప్పందాలు
- ఉక్రెయిన్‌తో శాంతియుత ముగింపు.. మోదీ సూచన
- భారత్‌- రష్యా స్నేహం ఒడిదుడుకులను తట్టుకొని ధ్రువతారగా నిలిచిందని వెల్లడి
- చర్చల తర్వాత మోదీ-పుతిన్ మీడియా సమావేశం
- రాష్ట్రపతి భవన్‌లో విందు.. స్వదేశానికి బయల్దేరిన పుతిన్
- విందుకు శశిథరూర్.. రాహుల్, ఖర్గేలకు అందని ఆహ్వానం

న్యూఢిల్లీ, డిసెంబరు 5: భారత్‌కు రష్యా నమ్మకమైన ఇంధన సరఫరాదారుగా ఇకముందు కూడా కొనసాగుతుందని ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హామీ ఇచ్చారు. అంతరాయం లేకుండా భారత్‌కు చమురు, గ్యాస్, బొగ్గు వంటి అవసరమైన అన్నిరకాల ఇంధనాలనూ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భారత పర్యటనకు వచ్చిన పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో చర్చలు జరిపారు. భారత్-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న ఇద్దరు నేతలూ రెండు దేశాల మధ్య ఆర్థిక, ఇంధన సహకారంతోపాటు అనేక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఉగ్రవాదంపై సంయుక్తంగా పోరాటం చేయాలని నిర్ణయించారు. భారత్-రష్యా బిజినెస్ ఫోరం సమావేశంలో పాల్గొన్నారు. ఇద్దరు నేతలూ సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొని పలు అంశాలు వెల్లడించారు. భారత ఉత్పత్తులకు రష్యా మార్కెట్‌ను మరింతగా తెరుస్తామని ఈ సందర్భంగా పుతిన్ ప్రకటించారు. తమిళనాడులోని కూడంకుళం అణువిద్యుత్ ప్లాంటులో నిర్మాణంలో ఉన్న నాలుగు యూనిట్లను త్వరలోనే వినియోగంలోకి తెచ్చేందుకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. 6,000 మెగావాట్ల సామర్థ్యంగల

మిగతా 2వ పేజీలో...

ఏ దేశమూ ఒంటరి కాదు

- రష్యాతో వాణిజ్యం వద్దని అమెరికా, యూరప్ ఒత్తిళ్లు
- అయినప్పటికీ భారత్‌లో వ్లాదిమిర్ పుతిన్ పర్యటన
- ఇది ప్రపంచానికి స్పష్టమైన సందేశం పంపింది
- చైనా మీడియాలో కథనాలు

2

పుతిన్‌కు భగవద్గీత

- రష్యన్ భాషలోకి అనువదించిన గ్రంథాన్ని బహూకరించిన మోదీ
- పాలరాతి చదరంగం కూడా..

మీ కలలకు మా రెక్కలు



ఆవిష్కర్తలుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు.. వచ్చే ఏడాది సదస్సు



పార్వతీపురం మన్యం జిల్లా భామిని మోడల్ స్కూల్‌లో జరిగిన పీటీఎంలో పాల్గొన్న చంద్రబాబు, లోకేశ్

- మంచి ఆలోచనలకు అవార్డులు
- ఉన్నత విద్యకు కొత్త పథకం 'కలలకు రెక్కలు'
- విదేశీ విద్యకు పావలా వడ్డీకి రుణాలు
- ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు
- ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం
- విద్యారంగంలో లోకేశ్ మార్పులు
- మూడేళ్లలో విప్లవాత్మక ఫలితాలు
- గతంలో విద్యారంగంపై రాజకీయ నీడ
- మెగా పీటీఎంలో చంద్రబాబు వెల్లడి
- బడిని బాగుచేద్దాం.. లోకేశ్ పిలుపు

పండగలా పీటీఎం.. 74 లక్షల మంది హాజరు

పార్వతీపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తయారుచేసేందుకు వచ్చే ఏడాది విద్యార్థి ఆవిష్కర్తల భాగస్వామ్య సదస్సు (స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్ట్‌నర్‌షిప్ సమిట్-ఎస్‌ఐపీఎస్)ను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీనికి పారిశ్రామికవేత్తలను కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. పిల్లల ఆలోచనలు బాగుంటే వారి ప్రతిభను గుర్తించి రివార్డులు అందిస్తామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం(పీటీఎం)లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా

మిగతా 13వ పేజీలో...

చదువు.. బలమైన ఆయుధం

లక్ష మంది మెదళ్లను కదిలించే శక్తినిస్తుంది: డిప్యూటీ సీఎం పవన్

13



చిలకలూరిపేట మెగా పీటీఎంలో విద్యార్థులతో పవన్



విజయవాడలోని గవర్నర్ నివాసం రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చిన దృశ్యం

ఫోన్ లొకేషన్ ఎల్లప్పుడూ ఆన్!


- కొత్త నిబంధన అమలుపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు
- గోప్యతకు భంగం
- యాపిల్, గూగుల్, శాంసంగ్ నుంచి వ్యతిరేకత

2

దేవదేవుడ్నే దోచేశారు!

గత పాలనలో తిరుమలలో ఎన్నో అక్రమాలు

ఒక్కొక్కటిగా పగులుతున్న పాపాలపుట్ట



- ఇప్పటికే పరకామణి, కల్తీ నెయ్యిపై విచారణ
- ఇంకా టీటీడీలో ఎన్నో అవినీతి ఆరోపణలు
- ఎన్నికలకు ఏడాది ముందు 3 వేల కోట్లతో హడావిడిగా పనులు.. కోట్లలో కమీషన్లు
- మార్కెటింగ్ విభాగంలో భారీ అవినీతి
- రూ.400 శాలువా 1,334కు కొనుగోలు
- శ్రీవాణి ట్రస్టు నిధులు దుర్వినియోగం
- శ్రీవారి తులాభారంలోనూ అక్రమాలు
- అన్నిటిపైనా దృష్టిపెట్టిన ప్రస్తుత పాలకమండలి
- ప్రక్షాళన దిశగా టీటీడీ అడుగులు

(తిరుమల-ఆంధ్రజ్యోతి) గత వైసీపీ ప్రభుత్వ హయాంలో... తిరుమలలో పరకామణి చోరీ కేసు, కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారం మాత్రమే కాదు, ఎన్నో అక్రమాలు జరిగాయి. టీటీడీ నిధులను పెద్దఎత్తున దుర్వినియోగం చేసి, కమీషన్ల రూపంలో కోట్లాది రూపాయలు కొట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.350-400 విలువ చేసే శాలువాలను ఏకంగా రూ.1,334కు కొనుగోలు చేయడం అవినీతికి పరాకాష్ఠ. అడ్డగోలుగా

మిగతా 12వ పేజీలో...



జోగి-జనార్దన్ 'లిక్కర్' బంధం!

- ములకలచెరువు నకిలీ మద్యం కేసులో 540 పేజీలతో ప్రాథమిక చార్జ్‌షీట్
- తంబళ్లపల్లె కోర్టులో దాఖలు చేసిన ఎక్సైజ్ పోలీసులు
- జోగి రమేశ్, జనార్దన్‌రావుల సంబంధాల ప్రస్తావన
- జోగి, అద్దేపల్లి సోదరుల కస్టడీకి రెడీ!

రాయచోటి/ములకలచెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఎక్సైజ్ పోలీసులు 540 పేజీలతో ప్రాథమిక చార్జ్‌షీట్ సమర్పించారు. గురువారం సాయంత్రం తంబళ్లపల్లె

మిగతా 12వ పేజీలో...

కావాలనే సంక్షోభం?

ఉద్యోగులు రాసిన లేఖతో ఇండిగో యాజమాన్యంపై సందేహాలు

- సంక్షోభానికి కారకులు బాగానే ఉన్నారు
- ఫ్రంట్‌లైన్ ఉద్యోగులేమో ప్రయాణికుల ఆగ్రహాన్ని ఎదుర్కొంటున్నారు
- డీజీసీఏ నిబంధనలు అమల్లోకి రాగానే విమాన సర్వీసులు రద్దవడమేంటి?
- ఉద్యోగుల బాధ్యత లేదని ప్రకటించాలి
- లేఖలో ఇండిగో సిబ్బంది డిమాండ్
- డీజీసీఏ నిబంధనల అమలుకు వ్యవధి ఇచ్చినా ఏర్పాట్లు చేసుకోని ఇండిగో!
- దర్యాప్తునకు ఆదేశించిన కేంద్రం
- ఫిబ్రవరి 10 దాకా ఇండిగోకు తాత్కాలికంగా నిబంధనల సడలింపు
- 15 రోజులకోసారి సమీక్ష
- తప్పంతా ఇండిగోదే.. చర్యలు తప్పవు
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- తాజాగా 589 ఇండిగో సర్వీసుల రద్దు



చెన్నై ఎయిర్‌పోర్టులో ఇండిగో ఎయిర్‌లైన్స్ కౌంటర్ వద్ద ప్రయాణికుల పడిగాపులు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: దేశంలోనే అతిపెద్ద పౌర విమానయాన సంస్థ ఇండిగోలో సంక్షోభం కావాలనే సృష్టించారా? డీజీసీఏ నిబంధనల అమలుకు సమయం ఉన్నప్పటికీ తగిన ఏర్పాట్లు చేసుకోకుండా తాత్సారం చేశారా? నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత గందరగోళం సృష్టిస్తున్నారా? ఉద్దేశపూర్వకంగానే విమాన

మిగతా 11వ పేజీలో...

'మ్యాచ్‌ఫిక్సింగ్' గుత్తాధిపత్యం వల్లే..

- ఇండిగో సంక్షోభంపై రాహుల్
- పార్టీ, ప్రభుత్వం, వ్యాపారాల్ని ఇద్దరే నడిపితే ఇలాగే ఉంటుంది: ఖేరా

కొత్త జంట వర్చువల్ రిసెప్షన్

విమానం రద్దుతో వింత పరిస్థితి

ఏళ్ల తరబడి ఒకేచోట విధులా!

- నాయకుల హోదాలో కొందరు, స్పౌజ్ కారణంతో మరికొందరు.. బదిలీల చట్ట నిబంధనలు ఇవ్వండి
- ప్రభుత్వ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- లోతైన విచారణ జరుపుతామని వెల్లడి

12



రుణాలు మరింత చవక

- గృహ, వాహన రుణాలపై తగ్గనున్న ఈఎంఐల భారం.. రెపో రేటు 0.25% తగ్గింపు
- 5.25 శాతానికి రెపో.. జీడీపీ వృద్ధి అంచనా 6.8 నుంచి 7.3 శాతానికి
- ఓఎంవోతో రూ.లక్ష కోట్ల ప్రభుత్వ బాండ్ల కొనుగోలు.. రూ.45,000 కోట్ల డాలర్/రూపీ మార్పిడి వేలం.. ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలు

10



జమిలికి అసెంబ్లీల ఆమోదం అవసరం లేదు!

- జేపీసీ సభ్యులకు స్పష్టంచేసిన లా కమిషన్
- వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే జేపీసీ నివేదిక

2

దేవుడి నిధులు ఆలయానివే

» నష్టాల్లోని బ్యాంకులను ఆదుకోవడానికి వాటిని వాడరాదు

» బ్యాంకులకు అవి ఆదాయ వనరు కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: భగవంతుడికి చెందాల్సిన ఆలయ నిధులను, నష్టాల్లో ఉన్న సహకార బ్యాంకులను కాపాడేందుకు వాడరాదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. దీనిపై కేరళ హైకోర్టు తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల బెంచ్ ధ్రువీకరిస్తూ, ఆ రాష్ట్రానికి చెందిన సహకార బ్యాంకుల పిటిషన్‌ను తిరస్కరించింది. కాలపరిమితి తీరిన తర్వాత కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లను క్లియర్ చేయడానికి నిరాకరించడంతో ఈ సహకార బ్యాంకులకు వ్యతిరేకంగా తిరునెల్లి దేవస్థానం కేరళ హైకోర్టుకు వెళ్లింది. ఆలయ దేవస్థానం డిపాజిట్లను రెండు నెలల్లో తిరిగి ఇచ్చేయాలంటూ ఆ బ్యాంకులను హైకోర్టు ఆదేశించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆ ఐదు బ్యాంకులకుగాను, మనంతవాడి కో ఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, తిరునెల్లి సర్వీస్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ అనే రెండు బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అయితే, హైకోర్టు నిర్ణయాన్నే సీజే బెంచ్ సమర్థించింది. "బ్యాంకులను రక్షించడానికి ఆలయ నిధులను వాడాలంటారా" అని సీజే ప్రశ్నించారు. ఆలయ నిధులు భగవంతుడికి చెందినవని, వాటిని కేవలం ఆలయ అవసరాల కోసమే వినియోగించాలని స్పష్టం చేశారు. సహకార బ్యాంకుల మనుగడకు, వాటి ఆదాయానికి ఈ నిధులు వనరు కారాదని తేల్చిచెప్పారు. రెండు నెలల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ నిధులను తిరిగి ఇచ్చేయాలన్న హైకోర్టు తీర్పును సవరించడానికి నిరాకరించారు.

రాజ్‌ఘాట్‌ను సందర్శించిన పుతిన్

న్యూఢిల్లీ, డిసెంబరు 5: రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం ఉదయం మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్‌ను సందర్శించి నివాళులు అర్పించారు. అక్కడ ఉన్న సందర్శకుల పుస్తకంలో మహాత్ముని సేవలను ప్రస్తుతిస్తూ రష్యన్ భాషలో రాశారు. మహాత్ముడు శాంతి, సత్యం, అహింస ద్వారా ఈ భూగోళానికి ఎనలేని సేవలు చేశారని పేర్కొన్నారు. ఆయన బోధనల అవసరం నేటి ప్రపంచానికి ఎంతో ఉందని అభిప్రాయపడ్డారు. రష్యా వాటిని పాటిస్తోందని తెలిపారు. రష్యా ప్రభుత్వ టీవీ చానెల్ 'ఆర్‌టీ ఇండియా'ను పుతిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలీవుడ్ లెజెండ్ రాజ్ కపూర్‌ను గుర్తు చేశారు. బాలీవుడ్ సినిమాలు, రాజ్ కపూర్‌కు రష్యాలో ఎంతో ఆదరణ ఉండేదని చెప్పారు. అప్పటికీ ఇప్పటికీ భారత్ ఎంతో మారింది, కానీ రెండు దేశాల మధ్య సంబంధాలు మారలేదు, మరింత దృఢమయ్యాయని ప్రశంసించారు. రాజ్ కపూర్‌పై పాట రాసిన రష్యా గాయకుడు, నటుడు వ్లాదిమిర్ వైసోట్స్కీని కూడా గుర్తు చేశారు. ఆ పాటలోని కొన్ని పదాలను ప్రస్తావించారు.

విజయ్‌తో తమిళనాడు కాంగ్రెస్ నేత భేటీ!

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డీఎంకేతో ఎంత స్నేహంగా ఉన్నా అధికారంలో భాగస్వామ్యం ఇవ్వకపోవడం పట్ల కాంగ్రెస్ అసంతృప్తిగా ఉందా?.. అందుకే వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను ప్రముఖ సినీ నటుడు విజయ్‌తో కలిసి ఎదుర్కోవాలని భావిస్తోందా?.. అవుననే అంటున్నాయి తమిళ రాజకీయవర్గాలు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు 40 స్థానాలు కావాలంటూ గత బుధవారం టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ గిరీష్ శోడంకర్ డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌ను కోరారు. అయితే, ఆ భేటీ జరిగిన 48 గంటల్లోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సన్నిహితునిగా పేరుగాంచిన ప్రవీణ్ చక్రవర్తి టీవీకే అధినేత విజయ్‌తో రహస్యంగా భేటీ కావడం తమిళ రాజకీయాల్లో కలకలం రేపుతోంది. శుక్రవారం స్థానిక పట్టినబాక్కంలోని టీవీకే కార్యాలయానికి వెళ్లిన ప్రవీణ్ చక్రవర్తి.. విజయ్‌తో గంటకు పైగా భేటీ అయినట్లు సమాచారం. కాంగ్రెస్ బృందం డీఎంకేతో చర్చలు జరుపుతుండగానే.. ప్రవీణ్ చక్రవర్తి విజయ్‌తో భేటీ కావడం గమనార్హం. ఇదిలా ఉండగా కాంగ్రెస్ అడిగినన్ని స్థానాలు ఇచ్చేందుకు స్టాలిన్ సుముఖంగా లేరు. కాంగ్రెస్‌కు 20-25 శాసనసభ స్థానాలు మాత్రం ఇవ్వాలని స్టాలిన్ భావిస్తున్నట్లు సమాచారం.

వలసదారుల వర్క్ పర్మిట్ల కాలవ్యవధి కుదింపు

» ఐదేళ్ల నుంచి 18 నెలలకు తగ్గింపు: యూఎస్‌సీఐఎస్

న్యూఢిల్లీ, డిసెంబరు 5: శరణార్థులు, వలసదారులకు ట్రంప్ యంత్రాంగం మరో షాక్ ఇచ్చింది. వీరికి ఇచ్చే వర్క్ పర్మిట్ల కాల వ్యవధిని ఐదేళ్ల నుంచి 18 నెలలకు తగ్గించింది. భద్రతాపరమైన కారణాలతోనే ఈ మేరకు నిబంధనలు సవరించినట్లు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) గురువారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో అమెరికాలో పనిచేయాలనుకొనేవారు ప్రజా భద్రతకు ముప్పు కలిగించకుండా, అమెరికన్ వ్యతిరేక భావజాలాన్ని ప్రోత్సహించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొనే అవకాశం ఉంటుందని పేర్కొంది. సవరించిన నిబంధనల ప్రకారం.. శరణార్థులు, ఆశ్రయం కోరేవారు, గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న వారికి ఐదేళ్లకు బదులుగా 18నెలలకు పరిమితం చేసిన ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్(ఈఏడీ) మంజూరు చేస్తారు. అదే విధంగా టెంపరరీ ప్రొటెక్టెడ్ స్టేటస్ (టీపీఎస్) కలిగినవారు, పెరోల్‌దారులు, టీపీఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారికి ఏడాది, అంతకంటే తక్కువ సమయానికి వర్క్ పర్మిట్ ఇస్తారు.

ఎక్స్‌పై ఈయూ రూ.1,257 కోట్ల జరిమానా

లండన్, డిసెంబరు 5: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'పై యూరోపియన్ యూనియన్ (ఈయూ) భారీ జరిమానా విధించింది. తమ కూటమి డిజిటల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను, ఎక్స్‌పై ఏకంగా 120 మిలియన్ యూరోల (సుమారు రూ.1,257 కోట్లు) ఫైన్ వేసినట్లు ఈయూ నియంత్రణాధికారులు శుక్రవారం ప్రకటించారు. ఎక్స్‌లోని కొన్ని పద్ధతులు వినియోగదారులను మోసాలకు గురిచేస్తున్నాయని యూరోపియన్ కమిషన్ తమ రెండేళ్ల దర్యాప్తులో తేల్చింది. యూరోపియన్ వినియోగదారులను సోషల్ మీడియాలోని మోసపూరిత కంటెంట్ నుంచి రక్షించడం కోసం రూపొందించిన 'డిజిటల్ సర్వీసెస్ యాక్ట్' (డీఎస్ఏ) పారదర్శకతను ఎక్స్ మూడు కీలకమైన అంశాలలో ఉల్లంఘించిందని పేర్కొంది. గతంలో ప్రముఖులకు మాత్రమే ఇచ్చే బ్లూ చెక్‌మార్క్‌లను మస్క్ కొనుగోలు తర్వాత, నెలకు కొంత డబ్బు చెల్లించిన ప్రతి ఒక్కరికి ఇవ్వడం మొదలుపెట్టిందని తెలిపింది. దీనివల్ల అసలు ఖాతాదారులెవరు? నకిలీ ఖాతాలు ఏవి? అని తెలుసుకోవడం వినియోగదారులకు కష్టమవుతోందన్న కమిషన్, దీన్ని మోసపూరిత పద్ధతిగా పేర్కొంది.

రోడ్డు ప్రమాదాల్లో గత ఏడాది 1.77 లక్షల మంది దుర్మరణం: గడ్కరీ

న్యూఢిల్లీ, డిసెంబరు 5: దేశంలో గత ఏడాది 1,77,177 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. సగటున రోజుకు 485 మంది ప్రాణాలు కోల్పోయారు. మునుపటి సంవత్సరంతో పోల్చితే మరణాలు 2.3 శాతం మేర పెరిగాయి. మొత్తం 4,80,583 ప్రమాదాలు జరిగాయి. ఈ వివరాలను శుక్రవారం కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో లిఖితపూర్వకంగా వెల్లడించారు. రోడ్ల ప్రమాదాల మృతులు, క్షతగాత్రుల సంఖ్యను 2030 నాటికి సగానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. 2023లో మొత్తం 4,80,583 ప్రమాదాలు జరగగా, 1,72,890 మంది ప్రాణాలు కోల్పోయినట్టు, 4,62,825 మంది గాయపడ్డట్టు వివరించారు. ప్రపంచ రోడ్డు గణాంకాల ప్రకారం చైనాలో ప్రతి లక్ష మందికి 4.3 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తుండగా, అమెరికాలో 12.76 మంది, భారత్‌లో 11.89 మంది చనిపోతున్నట్టు తెలిపారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో డీకేకు నోటీసులు

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వివరాలు సమర్పించాలని కోరుతూ కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆయన సోదరుడు మాజీ ఎంపీ డీకే సురేశ్‌కు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై అక్టోబరు 3న దాఖలైన నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి శివకుమార్ వద్ద కీలక సమాచారం ఉందని భావిస్తూ ఆర్థిక నేరాల విభాగం నోటీసులో పేర్కొంది. వ్యక్తిగత సమాచారం, కాంగ్రెస్‌తో సంబంధాలు, నేషనల్ హెరాల్డ్ పత్రికకు విరాళాలు ఎలా ఇచ్చారనే అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈనెల 19వ తేదీలోపు హాజరు కావాలనీ, లేదంటే సమాచారం ఇవ్వాలని సూచించారు.

భారత ఇంధన అవసరాలన్నీ తీరుస్తాం

శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో విందు సందర్భంగా మాట్లాడుతున్న రష్యా అధ్యక్షుడు పుతిన్



(మొదటి పేజీ తరువాయి)

ఈ పవర్ ప్లాంటులో 2013లో ఒకటి, 2016లో మరొక యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాయి. మరో నాలుగు నిర్మాణంలో ఉన్నాయి. ఇంధనేతర అణు సాంకేతికత అభివృద్ధిలో (ఔషధ, వ్యవసాయ రంగాల వంటివి) భారత్‌కు సహకారం అందిస్తామని పుతిన్ తెలిపారు. గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్న పుతిన్‌కు మోదీ విమానాశ్రయానికి వెళ్లి స్వాగతం పలకగా, శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్ వద్ద భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారికంగా పుతిన్‌కు స్వాగతం పలికారు. భారత త్రివిధ దళాలు గౌరవ వందనం సమర్పించాయి. శుక్రవారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో విందులో పాల్గొన్న అనంతరం పుతిన్ స్వదేశానికి తిరిగి వెళ్లారు. "కలిసి సాగుదాం.. కలిసి ఎదుగుదాం" అన్న చెప్తూ ఆయన తన భారత పర్యటనను ముగించారు.

ధ్రువతారగా నిలిచిన స్నేహం

భారత్- రష్యా మధ్య 80 ఏళ్ల స్నేహం కాలపరీక్షకు తట్టుకొని నిలిచిందని మోదీ అన్నారు. 'గత 8 దశాబ్దాల్లో ప్రపంచం ఎన్నో ఎత్తుపల్లాలను చూసింది. ఎన్నో మానవతా సంక్షోభాలు, సమస్యలు వచ్చాయి. వీటన్నింటినీ తట్టుకొని భారత్-రష్యా స్నేహం ధ్రువతారలా స్థిరంగా నిలబడింది. ఈ పునాదిని మరింత బలోపేతం చేసేందుకు మేము అన్ని అంశాలపై చర్చలు జరిపాం. ఆర్థిక సహకారాన్ని మరోస్థాయికి తీసుకెళ్లటమే రెండుదేశాల ఉమ్మడి లక్ష్యం. ఇందుకోసం 2030 వరకు కొనసాగే ఆర్థిక సహకార ప్రణాళికపై సంతకాలు చేశాం. ఈ ప్రణాళిక రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను విస్తృతం చేయటంతోపాటు సుస్థిరం చేస్తుంది' అని సంయుక్త మీడియా సమావేశంలో మోదీ తెలిపారు. భారత్- రష్యా సంబంధాల్లో ఇంధన భద్రత చాలా కీలకమైందని చెప్పారు. ఈ విషయంలో రెండువైపులా ప్రయోజనం ఉండే విధానాన్ని అవలంభిస్తామని వెల్లడించారు. అరుదైన ఖనిజాల విషయంలో ఈ రెండు దేశాల మధ్య సహకారం ప్రపంచ సప్లై చైన్‌కు భద్రత కల్పిస్తుందని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపునకు భారత్ సహకారం అందిస్తుందని మోదీ ప్రకటించారు. 'అంతర్జాతీయ ఘర్షణల విషయంలో భారత్ తటస్థ విధానం అనుసరించబోదు' అని స్పష్టం చేశారు.

ఐదేళ్ల ఆర్థిక ప్రణాళిక

భారత్-రష్యా మధ్య వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుతం ఉన్న 64 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం వచ్చే ఐదేళ్ల కాలానికి సంబంధించి ఆర్థిక సహకార ప్రణాళికపై సంతకాలు చేశారు. డాలర్‌కు బదులుగా సొంత కరెన్సీలోనే లావాదేవీలు నిర్వహించేందుకు తగిన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. భారత్ త్వరలో రష్యా పౌరుల కోసం 30 రోజుల వ్యవధిగల ఉచిత ఈ- టూరిస్ట్ వీసాలను, 30 రోజుల గ్రూప్ టూరిస్ట్ వీసాలను జారీచేసేందుకు సమావేశంలో ఒప్పందం కుదిరింది. మరోవైపు, భారత్- యూరేషియన్ ఎకనమిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభమైనట్లు మోదీ ప్రకటించారు. రష్యాలో 1.2 బిలియన్ డాలర్లతో 20 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో గ్రీన్‌ఫీల్డ్ యూరియా ప్లాంటు ఏర్పాటుచేసేందుకు భారత్‌కు చెందిన ఆర్‌సీఎఫ్, ఐపీఎల్, ఎన్ఎఫ్ఎల్ సంస్థలు సంయుక్తంగా రష్యా కంపెనీ ఉరాల్‌చెమ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

పుతిన్‌తో విందుకు థరూర్

» రాహుల్, ఖర్గేలకు అందని ఆహ్వానం

పుతిన్‌కు రాష్ట్రపతి ముర్ము ఇచ్చిన విందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేలకు ఆహ్వానం అందలేదు. అదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ అయిన శశిథరూర్‌కు మాత్రం పిలుపువచ్చింది. విదేశాల అధినేతలు భారత్‌కు వచ్చినప్పుడు వారు ప్రతిపక్ష నేతను కలవకుండా మోదీ ప్రభుత్వం అడ్డుకుంటోందని రాహుల్ గాంధీ ఆరోపణలు చేసిన మరునాడే ఇలా జరగడం గమనార్హం. ఆపరేషన్ సిందూర్ అనంతరం వివిధ దేశాలకు కేంద్రం పంపిన బృందాల్లో శశిథరూర్ ఉన్న సంగతి తెలిసిందే.


రేంజ్ రోవర్, మెర్సిడెస్‌ను కాదని.. మోదీ, పుతిన్ ఫార్చునర్‌లో వెళ్లారెందుకు?

ప్రధాని మోదీ అధికారిక వాహనాలైన రేంజ్‌రోవర్, మెర్సిడెస్ మేబ్యాచ్ ఎస్650 వంటి కార్లు ఓవైపు.. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేక వాహనం 'ఆరస్ సెనాట్' లైమోజిన్ కారు మరోవైపు.. అవన్నీ భద్రతాపరంగా ప్రత్యేకంగా రూపుదిద్దినవే. కానీ వాటిని కాదని పుతిన్, మోదీ ఇద్దరూ సాధారణ తెలుపు రంగు టొయోటా ఫార్చునర్ కారులో పాలెం విమానాశ్రయం నుంచి ప్రధాని నివాసానికి వెళ్లారు. దీనివెనుక యూరోపియన్ దేశాలకు పరోక్ష సంకేతం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేంజ్ రోవర్ కారు తయారీ సంస్థ ప్రస్తుతం మన టాటాల చేతుల్లోనే ఉన్నా అది ప్రధానంగా బ్రిటన్‌కు చెందినది. ఇక మెర్సిడెస్ సంస్థ జర్మనీకి చెందినది. ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో ఆ రెండు దేశాలూ రష్యాపై ఆంక్షలు విధించడం గమనార్హం. ఈ క్రమంలోనే జపాన్‌కు చెందిన టొయోటా సంస్థ ఫార్చునర్ వాహనాన్ని ఎంపిక చేసుకున్నట్టు చెబుతున్నారు. ఇరు దేశాల రక్షణ మంత్రులు రాజ్‌నాథ్, బెలోసోవ్ నేషనల్ వార్ మెమోరియల్ వద్ద నివాళులు అర్పించేందుకు తెలుపు రంగు ఫార్చునర్ కారులోనే కలిసి వెళ్లడం గమనార్హం.

నిజాం కట్టించిన 'హైదరాబాద్ హౌస్'

భారత్-రష్యా వార్షిక సదస్సులో భాగంగా ఢిల్లీలో ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయి చర్చించిన హైదరాబాద్ హౌస్‌కు ఎంతో చరిత్ర ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం హైదరాబాద్ సంస్థానాన్ని పాలిస్తున్న ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు.. ఢిల్లీకి వచ్చి వెళ్లినప్పుడు, బ్రిటిష్ అధికారులతో చర్చల కోసం ఓ భవనం అవసరం పడింది. ప్రపంచంలో అత్యంత ధనికుడిగా పేరున్న నిజాం.. తన వైభవాన్ని తలపించేలా ఉండాలని ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో 'హైదరాబాద్ హౌస్'ను కట్టించారు. అప్పటి ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ ఎడ్విన్ ల్యూటెన్స్ మొఘల్, రోమన్ శైలిలను, ఆధునికతను జోడించి.. సీతాకోకచిలుక ఆకారంలో ఈ భవన సముదాయానికి రూపకల్పన చేశారు. అప్పటి వైస్రాయ్ హౌస్ (ప్రస్తుత రాష్ట్రపతి భవన్) తరహాలో పెద్ద డోమ్ ఏర్పాటు చేశారు. మొత్తం 36 గదులు, బర్మా టేకుతో కూడిన విలాసవంతమైన ఫర్నీచర్, పర్షియా కార్పెట్లు, 500 మంది భోజనం చేయగల డైనింగ్ హాల్, విశాలమైన లాన్లు వంటి ఏర్పాట్లెన్నో ఇందులో ఉన్నాయి. అప్పట్లోనే ఈ భవనానికి రూ.50 లక్షలు ఖర్చయింది. అంటే ఇప్పుడు సుమారు రూ.378 కోట్లు.

లోకం తీరు



ఏ దేశమూ ఒంటరి కాదు

» పుతిన్ భారత పర్యటనపై చైనా

న్యూఢిల్లీ, డిసెంబరు 5: భారత్‌లో పుతిన్ పర్యటనను చైనా మీడియా విపరీతంగా ప్రశంసించింది. రష్యాపై అమెరికా, యూరోపియన్ దేశాల ఆంక్షలు, భారత్‌పై అడ్డగోలు టారిఫ్‌లు, రష్యాతో వాణిజ్యాన్ని తగ్గించాలన్న తీవ్ర ఒత్తిడులు కొనసాగుతున్న సమయంలో.. పుతిన్ భారత పర్యటన ప్రపంచానికి స్పష్టమైన సందేశం పంపిందని పేర్కొంది. భారత్, రష్యాల్లో ఏ దేశమూ ఒంటరికాదని ఈ పర్యటన తేల్చిచెప్పిందని వ్యాఖ్యానించింది. దీనిపై చైనాకు చెందిన గ్లోబల్ టైమ్స్ సహా పలు పత్రికలు కథనాలు ప్రచురించాయి. ఇక భారత్-రష్యా మధ్య బంధం అత్యంత వ్యూహాత్మకమైనదని.. బయటి ఒత్తిళ్లకు, జోక్యానికి ప్రభావితమయ్యేది కాదని చైనా విదేశాంగ వ్యవహారాల యూనివర్సిటీ ప్రొఫెసర్ లీ హైడాంగ్ పేర్కొన్నారు.



పుతిన్‌కు రష్యన్ భగవద్గీత

పుతిన్‌కు ప్రధాని మోదీ చిరస్మరణీయంగా ఉండే పలు బహుమతులు అందజేశారు. దేశ సంస్కృతికి ప్రతిబింబాలుగా, భారత-రష్యా స్నేహానికి గుర్తులుగా వాటిని బహూకరించారు. విశేషంగా రష్యన్ భాషలోకి అనువదించిన భగవద్గీత గ్రంథాన్ని స్వయంగా ఆయనకు అందజేశారు. ఇదే కాకుండా దేశంలోని నలుమూలలకు చెందిన వస్తువులను బహుమతులుగా ఇచ్చారు. అస్సాంకు చెందిన 'బ్లాక్ టీ' పొడిని అందజేశారు. దీనికి తోడుగా పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో తయారు చేసిన వెండి టీ కప్పుల సెట్‌ను ఇచ్చారు. 'రెడ్ గోల్డ్'గా పిలుచుకునే కశ్మీరీ కుంకుమ పువ్వును కానుకగా మోదీ పుతిన్‌కు అందజేశారు.

జమిలికి అసెంబ్లీల ఆమోదం అవసరం లేదు!

» జేపీసీ సభ్యులకు స్పష్టం చేసిన లా కమిషన్

» వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే జేపీసీ నివేదిక



జమిలిపై నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తున్న కోవింద్(ఫైల్)

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'ఒక దేశం- ఒకేసారి ఎన్నికలు' లక్ష్యంతో దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రవేశపెడుతున్న బిల్లులకు రాష్ట్రాల శాసనసభల ఆమోదం అవసరం లేదని లా కమిషన్.. సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి తెలిపింది. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగంలోని మౌలిక స్వరూపాన్ని మార్చేందుకు ఏమీ ప్రయత్నించడం లేదని పేర్కొంది. సమాఖ్య నిర్మాణానికి భంగకరమయ్యేలా రాజ్యాంగ నిబంధనల్నీ మార్చడం లేదని స్పష్టం చేసింది. ఈ బిల్లులకు సంబంధించి ఇప్పటికే పలు వర్గాలతో చర్చించిన జేపీసీ.. గురువారం లా కమిషన్‌తో కూడా విస్తృత చర్చలు జరిపింది. మరో రెండు నెలల్లో మరింత మంది నిపుణులు, సంస్థలతో చర్చలు జరిపిన తర్వాత నివేదికను రూపొందించి వచ్చే బడ్జెట్ సమావేశాలలోపు సమర్పించనుంది. ఈ నివేదికను బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. కాగా, రాజ్యాంగంలోని 368వ అధికరణ కింద జమిలి ఎన్నికల నిర్వహణకు రాష్ట్రాల ఆమోదం అవసరం లేదని 23వ లా కమిషన్ చైర్మన్ జస్టిస్ దినేశ్ మహేశ్వరి.. జేపీసీ సభ్యులకు వివరించారు. ఈ రాజ్యాంగ సవరణకు కనీసం 50 శాతం అసెంబ్లీలు ఆమోదించాల్సిన అవసరమేదీ లేదన్నారు. జమిలి ఎన్నికల కోసం ప్రవేశపెట్టే ప్రతిపాదనలన్నీ రాజ్యాంగ పరిమితుల్లోనే ఉన్నాయని, లోక్‌సభ, శాసనసభల ఎన్నికల షెడ్యూలును ఒకే తేదీల్లో నిర్ణయించడం వల్ల ప్రజల ఓటు హక్కుకేమీ నష్టం వాటిల్లదన్నారు.

కాలపరిమితిపై ఆందోళన వద్దు..

లోక్‌సభ, శాసనసభల కాలపరిమితికి సంబంధించి ఆందోళన కూడా అవసరం లేదని జేపీసీ సభ్యులకు లా కమిషన్ తెలిపింది. రాష్ట్ర శాసనసభల ఎన్నికలకు సంబంధించి కూడా చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకే ఉందని తెలిపింది. అందువల్ల ఈ మేరకు బిల్లులు చేసే అధికారం పార్లమెంట్‌కే ఉంటుందని స్పష్టం చేసింది. 82ఏ(3), 82ఏ(5) క్లాజుల కింద ఎన్నికల కమిషన్‌కు విస్తృత అధికారాలు కల్పించడంపై వచ్చిన సందేహాలను కమిషన్ నివృత్తి చేసింది. రాజ్యాంగంలోని 324 అధికరణ కింద ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు విస్తృత అధికారాలున్నాయని, ఇప్పటికే ఉన్న కమిషన్ అధికారాలను సంబంధిత క్లాజులు మరింత స్పష్టీకరిస్తాయని వివరించింది. అయితే తమ ప్రశ్నలకు లా కమిషన్ సభ్యులు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేకపోయారని ప్రతిపక్ష సభ్యుడొకరు అన్నారు. ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో వేర్వేరుగా ఓటు వేసే అవకాశాలు ఉండకపోవచ్చునని, దీంతో ఓటు వేసిన తర్వాత సమీక్షించుకునే అవకాశం ఉండదని తాము చెప్పినట్లు తెలిపారు.

పాన్ మసాలా యూనిట్లపై సెస్

» బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 5: పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్ విధింపునకు అవకాశం కలిగించే బిల్లుకు శుక్రవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ రూపంలో వసూలయ్యే సొమ్మును జాతీయ భద్రత, ప్రజారోగ్యం కోసం వినియోగించనున్నారు. హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు-2025ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సభలో ప్రవేశపెట్టారు. జాతీయ భద్రత, ప్రజారోగ్య సేవల బలోపేతానికి అదనపు నిధులు అవసరం కావడంతో దీన్ని విధిస్తున్నట్టు చెప్పారు. పాన్ మసాలా తయారీ యంత్రాలపై సెస్ విధించనున్నట్టు తెలిపారు. పాన్ మసాలపై ప్రస్తుతం 40 శాతం జీఎస్టీ ఉందని, అది కొనసాగుతుందని చెప్పారు.

ఫోన్ లొకేషన్ ఎల్లప్పుడూ ఆన్!

» కొత్త నిబంధనపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: మెరుగైన నిఘా వ్యవస్థ కోసం ఫోన్ లొకేషన్ ఎల్లప్పుడూ ఆన్‌లోనే ఉండేలా కొత్త నిబంధన తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. మొబైల్ తయారీ సంస్థలు ఫోన్ లొకేషన్‌ను ఎప్పుడూ ట్రాక్ చేసే వ్యవస్థను ప్రారంభించాలన్న టెలికాం శాఖ ప్రతిపాదనలపై కేంద్రం సమీక్షిస్తోంది. కానీ, దీనివల్ల వినియోగదారుల గోప్యతకు భంగం వాటిల్లే అవకాశం ఉండడంతో యాపిల్, గూగుల్, శాంసంగ్ వంటి మొబైల్ తయారీ కంపెనీలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. కేసుల దర్యాప్తులో భాగంగా టెలికాం సంస్థలను చట్టపరంగా కోరుతున్నప్పటికీ.. అవి ఫలానా ప్రాంతాన్ని సూచిస్తున్నాయి తప్ప కచ్చితమైన లొకేషన్‌ను మాత్రం అందించడం లేదు. ఈ సమస్య పట్ల కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. ఇటీవల ఒక అంతర్గత సమావేశానికి సంబంధించి ఐటీ మంత్రిత్వ శాఖకు పంపిన ఈమెయిల్ ప్రకారం.. స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలు ఉపగ్రహ సిగ్నల్స్, సెల్యూలర్ డేటాను ఉపయోగించే ఏ-జీపీఎస్ (అసిస్టెడ్-గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) టెక్నాలజీని యాక్టివేట్ చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే.. వినియోగదారుల కచ్చితమైన లొకేషన్‌ను అందిస్తామని సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. దీని ప్రకారం స్మార్ట్ ఫోన్లలో లొకేషన్ సర్వీసులను ఎల్లప్పుడూ ఆన్‌లోనే ఉంచాల్సి ఉంటుంది. వినియోగదారులు వాటిని ఆఫ్ చేయడానికి వీలుండదు. అయితే వినియోగదారుల గోప్యత దృష్ట్యా యాపిల్, గూగుల్, శాంసంగ్ వంటి కంపెనీలు దీన్ని వ్యతిరేకిస్తూ ఈ ఏడాది జూలైలో కేంద్రానికి లేఖ రాశాయి. సంచార్ సాథీ యాప్‌పై కేంద్రం వెనక్కు తగ్గడంతో ప్రస్తుతానికైతే దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

అద్దెకు భర్త కావాలి

» పురుషుల జనాభా తగ్గిపోవడంతో లాత్వియా మహిళల అవస్థ

» ఇంటి పనుల్లో చేదోడు కోసం భర్తను అద్దెకు తెచ్చుకుంటున్న స్త్రీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: ఉత్తర ఐరోపాలోని లాత్వియా దేశంలో పురుషులకు డిమాండ్ పెరిగిపోయింది. పెళ్లి చేసుకునేందుకు, ఇంటి పనుల్లో సాయం చేసేందుకు భాగస్వామి దొరక్క మగ తోడు కోసం ఆ దేశ మహిళలు నానాపాట్లు పడుతున్నారు. గత్యంతరం లేక ఇంటి పనుల్లో తమకు చేదోడువాదుడోగా ఉండేందుకు భర్తలను గంటలు, రోజులు లెక్కన అద్దెకు తెచ్చుకుంటున్నారు. లింగ నిష్పత్తిలో తేడా భారీగా పెరిగిపోవడం వల్లే ఆ దేశంలో ఈ వింత పరిస్థితి నెలకొందని 'ది న్యూయార్క్ పోస్ట్' ఓ కథనాన్ని ప్రచురించింది. లాత్వియాలో పురుషుల జనాభా కంటే మహిళల జనాభా 15.5 శాతం అధికంగా ఉంది. ప్రతీ వంద మంది పురుషులకు 115 మంది స్త్రీలు ఉన్నారు. అదే 65 ఏళ్లు అంతకంటే పైబడిన వారి విషయంలోనైతే పురుషుల కంటే స్త్రీలు రెండు రెట్లు అధికంగా ఉన్నారు. దీంతో తమ రోజువారీ జీవితంలో మగాళ్లే లేకుండా పోయారని, పని ప్రదేశంలో ఎటు చూసినా మహిళలే కనిపిస్తున్నారని ఆ దేశ స్త్రీలు వాపోతున్నారు. దేశంలో మగవారి కొరత వల్ల భాగస్వామి కోసం విదేశాలను ఆశ్రయించాల్సి వస్తుందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి పనుల్లో చేదోడు కోసం లాత్వియా మహిళలు భర్తలను అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా భర్తను బుక్ చేసుకొని వచ్చిన వారితో కలిసి ఇంటి పనులను పూర్తి చేసుకుంటున్నారు. లాత్వియా లింగ నిష్పత్తిలో భారీ తేడా రావడానికి పురుషుల ఆయుర్దాయం తగ్గిపోవడమే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ధూమపానం అలవాటు, ఊబకాయం వంటి అనారోగ్య సమస్యలే లాత్వియాలో పురుషుల సంఖ్య తగ్గిపోవడానికి ప్రధాన కారణాలని చెబుతున్నారు.



ప్రియురాలు కేట్ పెర్రీతో కలిసి ట్రుడో జపాన్ పర్యటన

న్యూఢిల్లీ, డిసెంబరు 5: కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రుడో తన ప్రియురాలు, అమెరికా పాప్‌స్టార్ కేట్‌పెర్రీతో కలిసి జపాన్ పర్యటనకు వెళ్లారు. అక్కడ జపాన్ మాజీ ప్రధాని కిషిదా ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ట్రుడో, పెర్రీ కలిసి విందుకు వచ్చిన విషయాన్ని కిషిదా స్వయంగా వెల్లడించారు. "ట్రుడో తన భాగస్వామితో కలిసి జపాన్‌ను సందర్శించారు. నేను ఇచ్చిన విందులో పాల్గొన్నారు" అంటూ వారి ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ పోస్టు ట్రుడో రీపోస్టు చేశారు. ట్రుడో, కేట్ పెర్రీ డేటింగ్‌లో ఉన్నట్లు చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. అనేక కార్యక్రమాలకు వాళ్లు కలిసి వెళ్లారు. తాజాగా కిషిదా కేట్ పెర్రీని ట్రుడో 'భాగస్వామి' అని పేర్కొనడంతో అది నిజమేనని తేలింది.

బంగారం కొంటే లాభాలంటూ 'బిస్కెట్'

» కస్టమర్లతో కొనిపించి తన వద్ద పెట్టుకున్న వ్యాపారి

» రూ.40 కోట్ల పసిడితో పరార్.. బళ్లారిలో ఘటన

బళ్లారి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆయనో బంగారం వ్యాపారి.. సాయి కమల్ జువెలర్స్ పేరిట బళ్లారిలో ఎన్నో ఏళ్లుగా గోల్డ్ షాపు నిర్వహిస్తున్నాడు. బంగారం ధరలు రోజురోజుకీ పెరుగుతుండడంతో.. కొని పెట్టుకుంటే మంచి లాభాలు వస్తాయని చెబితే ఆయన కస్టమర్లలో చాలామంది బంగారం బిస్కెట్లు కొనుగోలు చేసి ఆయనకు అప్పగించారు. కానీ, ఆయన రూ.40 కోట్ల విలువైన బంగారంతో పరారయ్యాడు. బళ్లారిలోని సాయి కమల్ జువెలర్స్ యజమాని జగదీష్ గుప్తా ఇంటికి, బళ్లారిలోని బెంగళూరు రోడ్డులో ఉన్న బంగారం షాపునకు 15 రోజులుగా తాళం వేసి ఉంది. దీంతో ఆయన వద్ద బంగారం బిస్కెట్లు ఉంచిన 200 మంది బాధితులు లబోదిబోమంటున్నారు. వారు తెలిపిన సమాచారం ప్రకారం.. బళ్లారిలో జగదీష్ గుప్తాతోపాటు అతని సోదరులు కూడా ఏళ్లుగా బంగారం వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో షాపునకు వచ్చిన కస్టమర్లకు జగదీష్ గుప్తా.. బంగారం ధర రోజురోజుకీ పెరుగుతోందనీ, కొని పెట్టుకోవాలని సూచించేవాడు. దీంతో చాలామంది బంగారం బిస్కెట్లు కొనుగోలు చేశారు. వాటిని ఇంట్లో పెట్టుకుంటే లాభం రాదనీ, తన వద్ద ఉంచితే ఆభరణాలు చేసి షాపులో ఉంచుతానని చెప్పారు. మీకు వడ్డీ వేసి ఇస్తానని నమ్మబలికాడు. దీంతో బళ్లారిలో ఉండే ప్రముఖులతో పాటు సమీప ప్రాంతాలవారు సైతం బంగారం కొని జగదీష్ వద్ద ఉంచారు. ఇలా దాదాపు 200 మంది బంగారం ఆయన వద్ద ఉంచారు. దాని విలువ రూ.40 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. బళ్లారికి చెందిన ఓ ప్రముఖుడు రూ.3 కోట్ల విలువైన బంగారం బిస్కెట్లు జగదీష్ వద్ద ఉంచినట్లు తెలుస్తోంది.

జనవరి 2 నుంచి 8 వరకు

తిరుమలకు వచ్చే అందరికీ వైకుంఠ ద్వార దర్శనం

- అంతా ఆన్‌లైన్ కేటాయింపులన్నది నిజం కాదు
- స్పష్టం చేసిన టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్




తిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'వైకుంఠద్వార దర్శనాలన్నీ ఆన్‌లైన్‌లోనే ఇస్తున్నారని కొందరు భక్తులు అపోహ పడుతున్నారు. ఇది నిజం కాదు. తొలి మూడు రోజులకు మాత్రమే ఈ-డిప్‌లో దర్శనాలు కేటాయించాం. మిగిలిన ఏడు రోజులూ తిరుమలకు నేరుగా వచ్చే భక్తులందరికీ క్యూలైన్ ద్వారానే వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తాం' అని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్పష్టం చేశారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ముందుగా భక్తులకు ఆయన ఈ వివరణ ఇచ్చారు. వైకుంఠ ద్వారాలు తెరచి ఉంచే పది రోజుల్లో స్వామివారి కైంకర్యాలకుపోను 182 గంటల దర్శన సమయం ఉండగా, ఇందులో సామాన్య భక్తులకే 164.15 గంటలు కేటాయించామని చెప్పారు. ఈ పది రోజుల్లో 7.70 లక్షల మందికి దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు ఎలాంటి టికెట్లు, టోకెన్లు లేకపోయినా నేరుగా తిరుమలకు వచ్చి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా వైకుంఠద్వార దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. ఈ పదిరోజులూ తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీ ఉండదని.. ప్రత్యేక దర్శనాలు, వీఐపీ బ్రేక్‌కు సిఫారసులను రద్దు చేశామన్నారు. ఇక, డయల్‌యువర్ ఈవో కార్యక్రమంలో దాదాపు 23 మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఫోన్ చేసి ఈవోతో మాట్లాడారు. ఇందులో అధికంగా, తిరుమలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఆన్‌లైన్‌లో కాక నేరుగానే దర్శనం చేయించాలనే విజ్ఞప్తులు వచ్చాయి.

అసంతృప్త భక్తులకు సందేశాలు

ఇలా ఉండగా తొలి మూడు రోజుల వైకుంఠ దర్శనాలకు 25.72 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 1.76 లక్షల మందికే టీటీడీ టోకెన్లు జారీ చేసింది. మిగిలిన భక్తులకు ఏ సమాచారం రాకపోవడంతో వారంతా అసంతృప్తితో ఉన్నారని టీటీడీ దృష్టికి వచ్చింది. దీంతో జనవరి 2 నుంచి 8 వరకూ నేరుగా తిరుమలకు వచ్చి వైకుంఠద్వార దర్శనం చేసుకోవచ్చని సందేశాలు పంపాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆదేశించారు. ఈ విధంగా 9.55 లక్షల యూజర్స్‌కి ఈమెయిల్, మొబైల్ నంబర్లకు మెజెస్‌లు పంపనున్నారు.

అందుబాటులోకి శ్రీవారి బంగారు డాలర్లు



తిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా కొరత ఉన్న శ్రీవారు, అమ్మవార్ల బంగారు డాలర్లను టీటీడీ భక్తులకు తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చింది. వారం రోజులకు పైగా విక్రయ కేంద్రం వద్ద నోస్టాక్ బోర్డు పెట్టారు. భక్తుల నుంచి విమర్శలు రావడంతో ఆగమేఘాలపై బంగారు డాలర్లను కౌంటర్‌లో అందుబాటులో ఉంచి విక్రయాలు మొదలుపెట్టారు. ప్రస్తుతం శ్రీవారు, అమ్మవారి బొమ్మలున్న బంగారు డాలర్లను 2, 5, 10 గ్రాముల్లో విక్రయిస్తున్నారు.

రూ.300 టికెట్లు కోటా 21 నిమిషాల్లోనే పూర్తి

- 1.10 గంటల్లో ముగిసిన శ్రీవాణి టికెట్ల బుకింగ్

తిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాల కోసం టీటీడీ శుక్రవారం ఆన్‌లైన్‌లో విడుదల చేసిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి టికెట్ల కోసం భక్తులు పోటీపడ్డారు. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ విడుదల చేసింది. రోజుకు 15 వేల చొప్పున ఏడు రోజులకు 1,05,000 టికెట్లను విడుదల చేయగా కేవలం 21 నిమిషాల్లోనే బుక్ అయిపోయాయి. ఇక, రోజుకు 1,500 చొప్పున ఉదయం 10 గంటలకు విడుదల చేసిన శ్రీవాణి టికెట్లు గంటా పది నిమిషాల్లోనే పూర్తయ్యాయి.

త్వరలో రాష్ట్రంలో 75 చెత్తశుద్ధి కేంద్రాలు

- ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



ఆలయం ముందు పట్టాభిరామ్

తిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డంప్ యార్డ్ అన్నదే లేకుండా పనిచేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యమని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన 90 లక్షల టన్నుల చెత్తను ప్రాసెస్ చేసి తొలగించేందుకు త్వరలోనే 75 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఏరోజు చెత్త ఆరోజే ప్రాసెస్ అయ్యేలా ఈ ప్లాంట్లు పనిచేస్తాయన్నారు. మరో 6 వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు కూడా నిర్మించబోతున్నామని, తిరుమల కొండపై పేరుకుపోయిన చెత్తను కూడా ఇదే తరహాలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తొలగిస్తున్నారని చెప్పారు.

కస్టమర్ల ఆధార్ నంబర్లతో సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు

- పలు ప్రాంతాల్లో పది మంది అరెస్టు

ఎండాడ (విశాఖపట్నం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కస్టమర్లను మోసం చేసి, వారి ఆధార్ నంబర్లతో సిమ్ కార్డులు తీసుకుని, సైబర్ నేరగాళ్లకు అందిస్తున్న పది మందిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) ఏజెంట్లు తమ వద్దకు సిమ్ కార్డుల కోసం వచ్చిన వారి నుంచి ఐరిస్, ఆధార్ కార్డుల నకళ్లు తీసుకుంటారు. ఐరిస్ సరిగా పడలేదంటూ మరోసారి తీసుకుని, వారు వెళ్లిపోయిన తరువాత మరో సిమ్‌ను యాక్టివేట్ చేసేవారు. వాటిని సైబర్ నేరగాళ్లకు అందిస్తున్న విషయం పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. ఈ నేపథ్యంలో నిడదవోలుకు చెందిన ఇద్దరు వొడాఫోన్ డిస్ట్రిబ్యూటర్లతో పాటు కృష్ణా జిల్లా పెడన ప్రాంతానికి చెందిన ఎయిర్‌టెల్ డిస్ట్రిబ్యూటర్, నలుగురు ఏజెంట్లు, గుంటూరు జిల్లా చెరుకుపల్లిలో నకిలీ జియో సిమ్ కార్డులను యాక్టివేట్ చేస్తున్న మరో ముగ్గురిని అరెస్టు చేసి, శుక్రవారం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

బూర్జువా పార్టీలతో రాజకీయ ప్రయాణంతో నష్టం

- క్షేత్రస్థాయిలో క్యాడర్ తగ్గింది: సీపీఐ ఈశ్వరయ్య

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో సీపీఐకు క్యాడర్ తగ్గుతున్న మాట అంగీకరిస్తున్నాం. ఇది కచ్చితంగా వాస్తవం. దాన్నుంచి బయటపడడానికి, పునాది స్థాయిని పెంచడానికి స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజా పోరాటాలు నిర్వహించే ప్రక్రియ ప్రారంభిస్తున్నాం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా రాజకీయపరమైన అంశాలు కూడా బలం తగ్గుదలకు ఒక ప్రధాన కారణం. ప్రత్యామ్నాయ రాజకీయ విధానం వైపు వెళ్లడానికే జనవరి 18న తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం వేదికగా జరిగే బహిరంగ సభ, అక్కడే జరిగే జాతీయ కార్యవర్గం కౌన్సిల్ సమావేశాల్లో ఒక నిర్ణయం తీసుకుంటాం. భావ సారూప్య పార్టీలన్నింటితో విశాలమైన ఐక్యవేదిక ఏర్పాటు చేస్తున్నాం' అని ఈశ్వరయ్య పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సుప్రీం' ప్రశ్న

పార్లమెంటు సమావేశాలు మొదలైన రోజున 'ఈ శీతాకాల సుందర ప్రకృతిని ఆస్వాదించండి' అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యను బ్యానర్లమీద ప్రదర్శిస్తూ గురువారం విపక్షాలు ఢిల్లీ కాలుష్యంపై పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ముఖానికి నల్లటిమాస్కులు పెట్టుకొని, ప్లకార్డులు చేతబట్టి, కాలుష్యంతో దేశ రాజధానిలో పసికందులు మరణిస్తున్నారని, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారని, ఈ అంశంపై పార్లమెంట్లో చర్చ జరగాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం తెలివిగా తప్పించుకుంటోందని కాంగ్రెస్ ఆరోపణ. ఇది రాజకీయాంశం కాదు, ప్రభుత్వం చర్చకు సిద్ధపడితే చర్చలకు మా మద్దతు ఉంటుందని అది హామీ ఇస్తోంది. చర్చకు సిద్ధపడితే, విఫలమైనామని ఒప్పుకున్నట్టేనని ప్రభుత్వం అనుకోవడం సహజం. సవ్యంగా మాట్లాడుకోగలిగే అంశాలనే సభలోపల కలుషితం చేస్తున్న ఈ పార్టీలు, ఢిల్లీ పౌరులను పట్టిపీడిస్తున్న వాయు కాలుష్యం గురించి హుందాగా, సయోధ్యతో చర్చ చేసి, పరిష్కారాలను ప్రతిపాదిస్తాయని నమ్మడం మరీ కష్టం.

ఇండియాగేట్ ఏదీ అంటూ దాని చుట్టుపక్కల ప్రాంతాలన్నీ పొగ మంచు, కాలుష్యంతో సతమతమవుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిస్తున్నాయి. ఢిల్లీ వాసులారా, మీరు ఈ రోజు పదిహేను సిగరెట్లు కాల్చినంత కాలుష్యాన్ని భరిస్తున్నారంటూ కొన్ని వెబ్సైట్లు ఏవేవో లెక్కలుగట్టి జనాన్ని మరింత భయపెడుతున్నాయి. దేశ రాజధానిని డేంజర్ జోన్గా మార్చేసిన కాలుష్యం మీద సభలో నిజంగానే చర్చ జరిగినా, అది రాజకీయాలకు అతీతంగా సాగుతుందనుకోలేం. ఇది మీ పాపమే, మీ చేతగానితనమే అని పరస్పరం విమర్శించుకోవడానికే పార్టీలు పరిమితమవుతాయి. తప్పు తోసేయడం మీద ఉన్న శ్రద్ధ పరిష్కారంలో కనబడదు. సుప్రీంకోర్టు నాలుగు రోజుల క్రితం ఇటువంటి తీరుతెన్నుల గురించే కఠినంగా వ్యాఖ్యానించింది. పొరుగు రాష్ట్రాల్లో రైతులు పంటవ్యర్థాలు తగలబెట్టడమే రాజధాని కాలుష్యానికి కారణమని కేంద్రం అన్నందుకు ఆగ్రహించింది. కాలుష్యం పెరిగిన ప్రతిసారీ నెపం రైతుల మీదకు నెట్టివేసే ధోరణి మార్చుకోమని హితవు చెప్పింది. ప్రధాన కాలుష్య కారకాల లెక్కతేల్చమంటూ కమిషన్ ఫర్ ఎయిర్క్వాలిటీ మేనేజ్మెంట్కు ఆదేశాలు ఇవ్వడంతోపాటు, రైతు పక్షాన కోర్టు చేసిన ఆ వ్యాఖ్యలు మెచ్చదగినవి. కరోనాకాలంలో ఢిల్లీ ఆకాశవీధులు అంత స్వచ్ఛంగా, నీలంగా ఎలా కనిపించాయంటూ కేంద్రాన్ని కోర్టు ప్రశ్నించింది. కరోనా కాలంలో వ్యర్థాల దహనం సాగేసేవంగా ఎక్కువగా ఉన్నప్పటికీ, గాలి నాణ్యతకు లోటురాలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ గుర్తుచేశారు. పొరుగు రాష్ట్రాల రైతులే ఈ కాలుష్యానికి ప్రధాన కారకులంటూ తప్పు పూర్తిగా వారిమీదకు నెట్టేసే ప్రయత్నాన్ని ఆయన అడ్డుకున్నారు. వాహనాల రాకపోకలన్నీ ఆగిపోయి, నిర్మాణాలు నిలిచిపోయి, పరిశ్రమలు పనిచేయని లాక్డౌన్ కాలంలో, ఎప్పటిలాగానే తన పని మౌనంగా చేసుకుపోయిన ఒకే ఒక్కడు రైతు. మిగతా సమాజం ఆగినా, ఆయన కదిలాడు కనుకనే అన్నానికి లోటులేకపోయింది. కాలుష్యానికి కారణమవుతున్న రైతును శిక్షించాల్సిందేనంటూ గత ఏడాది ఇదే కోర్టు వ్యాఖ్యానించినదానికి పూర్తిభిన్నంగా, అసలు కాలుష్యకారకాల మీదకు దృష్టిమరల్చి, రైతును రాజకీయం చేయవద్దన్న విస్పష్ట సందేశం ఇచ్చారు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి.

పంటవ్యర్థాలను రైతులు తరతరాలుగా తగలబెడుతూనే ఉన్నారు. నిజానికి గత నాలుగేళ్లలో దాని స్థాయి, విస్తృతి ప్రభుత్వాల జోక్యం కారణంగా బాగా తగ్గినట్టు విశ్లేషణలు వెలువడ్డాయి. అయినా, రైతునే బూచిగా చూపే ప్రయత్నం అలాగే సాగుతోంది. ఆ ప్రక్రియ కాలుష్యాన్ని కలిగించడం లేదని కోర్టు కూడా అనడం లేదు. దాని ప్రభావం పరిమితమని, ఒక పెద్ద సమస్యకు ఒక్క రైతును బలిపశువు చేయకూడదని చెప్పడమే ప్రధాన న్యాయమూర్తి ఉద్దేశం. శీతాకాలం మాత్రమే ఆలోచించి, నాలుగు చర్యలు చేపట్టితో వదిలివేయగలిగే సమస్య కాదిది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ (సీఎస్ఈ) వంటి చాలా సంస్థలు ఢిల్లీ కాలుష్యానికి స్థానిక అంశాలే కారణమని, వాహన, నిర్మాణ రంగాలు తొలిస్థానాల్లో ఉన్నాయని స్పష్టంగా చెబుతున్నాయి. కాలుష్య నియంత్రణ చర్యలను నెలకు రెండుసార్లు సమీక్షిస్తానని, కొత్త ఆలోచనలను స్వాగతిస్తానని అంటున్న ప్రధాన న్యాయమూర్తి ఈ విషానికి ఏ విరుగుడు కనిపెడతారో చూడాలి.

పార్లమెంటులో తగ్గిపోతున్న చర్చలు



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆయన మాటలలోని వ్యంగ్యాన్ని నేను అర్థం చేసుకున్నాను. నిజానికి ఎవరికైనా అవగతమవుతుంది. పార్లమెంటరీ సమావేశాలు ప్రారంభమవడానికి ముందు ఆనవాయితీగా నిర్వహించే అఖిలపక్ష సమావేశంలో ఉభయ సభల్లో చర్చలకు, చట్టాల నిర్మాణానికి సహకరించాలని ప్రతిపక్షాలకు ప్రభుత్వాధినేతలు విజ్ఞప్తి చేయడం పరిపాటి. ఆ ప్రకారమే డిసెంబర్ 1, 2025న ప్రధానమంత్రి శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యే ముందు పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ సందేశంలో 'సత్ఫలితాలను సాధించే నిర్మాణాత్మక చర్చలు వేదికగా పార్లమెంటు భాసించాలే కానీ, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నాటకీయ ప్రదర్శనలకు తావు కాకూడదని' నొక్కి చెప్పారు. పార్లమెంటు సమస్త సభ్యులు, ప్రత్యేకించి ఒకటి రెండు పార్టీల సభ్యులనుద్దేశించి ఆయన ఈ విజ్ఞప్తి చేశారు.

శీతాకాల సమావేశాల ఆరంభానికి ఇదొక అశుభ సూచనమేనని చెప్పాలి. మోదీ వ్యాఖ్యలను మరింత వివరంగా ఉటంకించవలసిన అవసరమున్నది: 'దురదృష్టవశాత్తు ఎన్నికలలో తమ ఓటమిని జీర్ణించుకోలేని పార్టీలు ఒకటి రెండు ఉన్నాయి. బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడి చాలా రోజులు అయిందని, పరాజితులు తమ పరాభవ బాధ నుంచి కోలుకొని ఉంటారని నేను భావించాను. అయితే తాజాగా ఆ పార్టీల ప్రకటనలు విన్న తరువాత బిహార్ ఓటమి వారిని ఇప్పటికీ కలిచివేస్తోందని అవగతమయింది... నినాదాలు చేసేందుకు దేశంలో చాలా ప్రదేశాలు ఉన్నాయి. మీరు ఇప్పటికే ఓడిపోయిన చోట పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మీరు భవిష్యత్తులో ఓడిపోనున్న రాష్ట్రాలలో కూడా మీరు పెద్ద పెట్టున నినాదాలు చేయవచ్చు. అయితే ఇక్కడ, పార్లమెంటులో నినాదాలకు కాకుండా విధానాలపైన చర్చలకు ప్రాధాన్యమివ్వాలి'. ప్రాంతీయ పార్టీల్లోను కూడా మోదీ వ్యంగ్య విమర్శనాస్త్రాలను సంధించారు. 'కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్నది. అక్కడ సుదీర్ఘ కాలంగా అధికారంలో ఉన్న నాయకులు ప్రజల మధ్యకు వెళ్లలేకున్నారు. అయితే వారు పార్లమెంటుకు వచ్చి తమ ఆగ్రహాన్ని ఇక్కడ వ్యక్తం చేస్తున్నారు'.

పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతూ ప్రతిసారీ తాము దేనికీ భయపడమని, దేనినీ గోప్యంగా ఉంచవలసిన అవసరం తమకు లేదని, పార్లమెంటులో ఏ అంశంమీదనైనా చర్చించడానికి సంసిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ఉద్ఘోషిస్తుంది. అయితే ఈ నిర్బంధ స్వేచ్ఛకు ఒక అవరోధం ఉన్నది. అది 'నియమాలకు లోబడి చర్చ జరపాలనే' షరతు.

పార్లమెంటరీ కార్యక్రమాల నిర్వహణకు ఒక స్పష్టమైన, కచ్చితమైన నియమావళి ఉన్నది. ఆ నియమాలకు భాష్యం చెప్పడం, వాటిని అనువర్తింపచేయడమనేది ఆయా పార్లమెంటరీ రాజకీయ పక్షాల నాయకులతో సంప్రదించి సభాపతులు (లోక్సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్) తరచు ఆయా పార్లమెంటరీ పక్షాల నాయకులను సంప్రదించి తీసుకునే నిర్ణయాల మేరకు ఉంటుంది.



దేశ సమస్యలపై సమగ్ర అవగాహనతో, సామాన్య పౌరుల శ్రేయస్సే లక్ష్యంగా చర్చలు జరిగే పార్లమెంటు, ప్రజాస్వామ్యాన్ని శక్తిమంతం చేస్తుందనే సత్యాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశ్వసించడం లేదు. సంభాషణలు, సంవాదాలు, సాధికార చర్చలను మోదీ సర్కార్ వ్యతిరేకిస్తోంది.

బిల్లులు, బడ్జెట్ ప్రవేశపెట్టడం ప్రభుత్వ అజెండా. ప్రశ్నోత్తరాల సమయం (క్వశ్చన్ అవర్)లో చర్చ అనుమతించరు. ప్రతిపక్షాల అభ్యర్థన మేరకు నిజమైన, స్వేచ్ఛాయుత చర్చ వాయిదా తీర్మానం ద్వారా మాత్రమే జరుగుతుంది. లేదా స్వల్ప వ్యవధి చర్చ ద్వారానో లేక సావధాన తీర్మానం ద్వారానో జరుగుతుంది. ఇవి సువ్యవస్థితమైన, మొదటి నుంచి అనుసరిస్తున్న పార్లమెంటరీ పద్ధతులు, సంప్రదాయాలు.

వాయిదా తీర్మానాన్ని, కొన్ని కారణాల వల్ల, ప్రభుత్వానికి అభిశంసనగా పరిగణిస్తున్నారు. దీనికి సంబంధించిన నియమం స్పష్టంగా ఉన్నది. లోక్సభ కార్యక్రమాల నియమావళిలో 57వ నియమం ఇలా ఉన్నది: భారత ప్రభుత్వ బాధ్యతతో ముడివడి ఉన్న, ఇటీవల సంభవించిన నిర్దిష్ట సంఘటనలపై వాయిదా తీర్మానం ద్వారా చర్చకు తొలుత నోటీసు ఇవ్వాలి. రాజ్యసభలో తక్షణ ప్రాధాన్యమున్న వ్యవహారంపై చర్చకు ముందుగా నిర్ణయించిన సభా కార్యక్రమాలను నిలిపివేసేందుకు ఎగువ సభ కార్యక్రమ నియమావళిలోని 267వ నియమం అనుమతిస్తుంది. స్వల్ప వ్యవధి చర్చ లోక్సభలో నియమం 193 ప్రకారం, రాజ్యసభలో నియమం 176 ప్రకారం జరుగుతుంది. తక్షణ ప్రజా ప్రాధాన్యమున్న అంశాలపై స్వల్ప వ్యవధి చర్చ జరుగుతుంది. సావధాన తీర్మాన నోటీసు చాలా నిరపాయకరమైనది. తక్షణ ప్రజా ప్రాధాన్యమున్న అంశాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు లోక్సభ కార్యక్రమాల నియమాళిలో 197వ నియమం, రాజ్యసభ కార్యక్రమాల నియమావళిలో 180వ నియమం సభ్యులను అనుమతిస్తుంది. సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చిన విషయమై మంత్రి ప్రకటన చేయవలసి ఉంటుంది.

సరే, నరేంద్ర మోదీ ప్రభుత్వం పదకొండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన తరువాత పార్లమెంటరీ చర్చలు ఎలా జరుగుతున్నాయో చూద్దాం. ప్రతిపక్షాలకు ప్రతి ద్వారమూ, ప్రతి గవాక్షమూ క్రమంగా మూసుకుపోయాయని నిశ్చయంగా చెప్పక తప్పదు. మోదీ సర్కార్ అంతకంతకూ మొండిగా వ్యవహరిస్తుండడంతో పార్లమెంటరీ చర్చల పరిస్థితి దిగజారిపోయింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం మొదటి పర్యాయం అధికారంలోకి వచ్చినప్పుడు వాయిదా తీర్మానం ద్వారా చర్చకు భయపడింది. అటువంటి తీర్మానం ద్వారా చర్చవల్ల తన ప్రతిష్ఠకు కళంకం ఏర్పడుతుందని భావించడమే అందుకు కారణం. స్వల్ప వ్యవధి చర్చలు లేదా సావధాన తీర్మానం నోటీసులకు అభ్యంతరం చెప్పలేదు. అయితే ద్వితీయ పర్యాయం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రెండు రకాల చర్చల పట్ల కూడా మోదీ సర్కార్ అసహనం ప్రదర్శించింది. ద్వారం మూసివేసినా, కిటికీలను తెరిచే ఉంచింది. మూడోసారి కనీస మెజారిటీ కంటే తక్కువ సీట్లు మాత్రమే సాధించుకుని, మిత్రపక్షాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన తరువాత గవాక్షాలను సైతం మూసివేసింది. దీన్నెలా అర్థం చేసుకోవాలి? చర్చకు యోగ్యమైన తక్షణ ప్రజా ప్రాధాన్యమున్న సంఘటనలు, పరిణామాలు ఏవీ సంభవించలేదని భావించాలా?

విషాదమేమిటంటే లోక్సభలో కంటే రాజ్యసభలో చర్చలు చాలా తక్కువగా జరుగుతున్నాయి. అసలు జరగని సందర్భాలు కూడా ఉన్నాయి. నాటి సభాపతే అందుకు కారణమని పలువురు సభ్యులు భావిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్లో రాజ్యసభకు కొత్త ఛైర్మన్ ఎన్నికయ్యారు. రాజ్యసభ ఛైర్మన్ విధులు, బాధ్యతలు ఆయనకు కొత్త కనుక వాటి నిర్వహణ పద్ధతులు, మెళకువలను సమగ్రంగా అవగాహన చేసుకునే దశలో ఉన్నారు. అంతేకాకుండా కొత్త ఛైర్మన్ అధ్యక్షత వహిస్తున్న ఈ శీతాకాల సమావేశాల కాల పరిధి చాలా తక్కువ కనుక ఆయన సభా నిర్వహణ సామర్థ్యంపై అప్పుడే ఒక అభిప్రాయానికి రావడం సాధ్యం కాదు.

పార్లమెంటరీ చర్చల ప్రమాణాలు అంతకంతకూ పడిపోతున్న దృష్ట్యా ఒక వాస్తవాన్ని నిక్కచ్చిగా చెప్పదలుచుకున్నాను. దేశ సమస్యలపై సమగ్ర అవగాహనతో, సామాన్య పౌరుల శ్రేయస్సే లక్ష్యంగా చర్చలు జరిగే పార్లమెంటు, ప్రజాస్వామ్యాన్ని శక్తిమంతం చేస్తుందనే సత్యాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశ్వసించడం లేదు. సంభాషణలు, సంవాదాలు, సాధికార చర్చలను మోదీ సర్కార్ వ్యతిరేకిస్తోంది. శీతాకాల సమావేశాలు ఆరంభమవడానికి ముందు ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలలోని వ్యంగ్యాన్ని విస్మరించలేము.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కాంగ్రెస్ కలహ కర్ణాటకం!

తనను తాను ఓడించుకోవడంలోను, తనకు తాను నష్టం కలిగించుకోవడంలోను పోటీపెడితే స్వర్ణ పతకం దక్కేది కాంగ్రెస్ పార్టీకే అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. కర్ణాటక కాంగ్రెస్లోని 'అంతర్నాటకం' ఇప్పటికే అనేక వారాలుగా మీడియా సాక్షిగా ఎడతెగకుండా ప్రదర్శితమవుతోంది. 'కౌన్ బనేగా ముఖ్యమంత్రి' అనే కాంగ్రెస్ తాజా రాజకీయ నాటకమది. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ పదవిని ఆశిస్తున్న డీకే శివకుమార్ (డీకేఎస్) మధ్య ఇటీవల జరిగిన ఉదయం ఉపాహార సమావేశంలో మెనూతో పాటు ప్రతి చిన్న విశేషాన్నీ మీడియా సవివరంగా నివేదించింది, విశ్లేషించింది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఒకరు, కైవసం చేసుకునేందుకు మరొకరు కలహించుకుంటుండగా, ఎటూ పాలుపోని పార్టీ హై కమాండ్ ఆ ఉభయులనూ సంయమనపరచలేకపోతోంది. గందరగోళం, నియంత్రణ రాహిత్యం పెరిగిపోతోంది. ఈ శోచనీయ పరిస్థితులకు బాధ్యులు ఎవరు?



గతించిన మంచి రోజులలో అయితే ఆ ఇరువురికీ కాంగ్రెస్ సముచిత ప్రాధాన్యమివ్వగలిగి ఉండేది. అయితే అటువంటి సానుకూల పరిస్థితులు ఇప్పుడు బొత్తిగా లేవు. భారతదేశ పురాతన రాజకీయపక్షం ఇప్పుడు శక్తిహీనమైపోయింది. అధికార వైభవం గతించిన చరిత్రగా ఉన్నది. పార్టీలో నాయకుల మధ్య ఘర్షణలను సామరస్యపూర్వకంగా పరిష్కరించగల రాజకీయ నైపుణ్యాలు దాదాపుగా నిర్వీర్యమైపోయాయి. నాయకత్వ తగాదాలకు పరిష్కారంగా ముఖ్యమంత్రి పదవిలో, పోటీదారులను ఒకరి తరువాత మరొకరిని నియమించే పద్ధతిని అనుసరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. నిర్మొహమాటంగా చెప్పాలంటే అదొక విడ్డూరమైన ఆలోచన. ఆచరణ యోగ్యం కానిది. కనుకనే అది పనిచేయలేదు. ముఖ్యమంత్రిగా నియమితుడైన నేత రెండున్నర సంవత్సరాల పాటు కొనసాగి, ఆ తరువాత మిగతా రెండున్నర సంవత్సరాలకుగాను ఆ పదవిని తన ప్రత్యర్థి లేదా మరొకరికి అప్పగిస్తాడా? ఈ దేశంలో ఏ నాయకుడూ స్వచ్ఛందంగా సీఎం పదవిని వదులుకోడు, అందునా ఈ కాలంలో. సిద్ధరామయ్య రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న తరువాత, ఆ పదవిలో నియమిస్తామని శివకుమార్కు కాంగ్రెస్ జాతీయ నాయకత్వం నిజంగా హామీ ఇచ్చి ఉంటే, అది, విఫలమైన పద్ధతిని మళ్లీ అనుసరించడమే అవుతుంది. ఉపయుక్తమైన ఆలోచనేనా ఇది? గతంలో రాజస్థాన్లోనూ, ఛత్తీస్గఢ్లోనూ ఈ పద్ధతిని అనుసరించేందుకు జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పార్టీలో అంతర్గత కలహాలు పెరిగిపోయాయి. ఫలితంగా ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పరాజయం పాలయ్యాయి. మరి కర్ణాటకలో ఇప్పుడు ఆ పద్ధతి ఎందుకు పనిచేస్తుంది?

సమస్యేమిటంటే కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ బాగుకు కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి పార్టీ 'హై కమాండ్' సుముఖంగా లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోగల తెగువ, సత్తా దానికి లేదని చెప్పడమే సత్యమవుతుంది. 2024 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ 'పునరుద్ధరణ' లేదూ, మరింత కచ్చితంగా చెప్పాలంటే బతికి బట్టకట్టిన పరిస్థితి కారణంగా రాహుల్గాంధీ నాయకత్వం పట్ల సద్భావం పెరిగింది. ముఖ్యంగా సొంత పార్టీ నేతల నుంచి గౌరవాదరాలను ఆయన తిరుగులేకుండా సముపార్జించుకున్నారు. భారత రాజ్యాంగ ప్రతిని ఎత్తిచూపుతూ జాతి నిర్మాణానికి అది నిర్దేశించిన విధివిధానాలను వివరిస్తూ బీజేపీ మహాశక్తిని ఆయన సమర్థంగా ఎదుర్కొన్నారు. ప్రత్యర్థులు పరిహసించినప్పటికీ కాంగ్రెస్లో ఆయన స్థానం మరింత సుదృఢమయింది. సంఘ్ పరివార్పై రాజీలేని పోరాటం చేసిన కారణంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయన నాయకత్వాన్ని ఎటువంటి ఆక్షేపణలు లేకుండా అంగీకరించాయి. కాంగ్రెస్కు తిరుగులేని నాయకుడుగా ఆయన ఆవిర్భవించారు. మరి పార్టీపై మరింత పట్టు సాధించేందుకు ఆయన పూనుకున్నారా? పార్టీ కార్యకలాపాలు అన్నిటినీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారా? పార్టీ సమస్త వ్యవహారాలనూ స్వయంగా చక్కబెడుతున్నారా? లేదు. అదే సమస్య. పార్టీ సంస్థాగత వ్యవహారాలను చాలావరకు తన విధేయులకు, మరీ ముఖ్యంగా కేసీ వేణుగోపాల్కు అప్పగించారు. వేణుగోపాల్ ఇప్పుడు కాంగ్రెస్ 'వ్యవస్థ'లో రెండో అత్యంత శక్తిమంతుడైన వ్యక్తి.

మరి పార్టీ కూడా పునశ్శక్తిమంతమయిందా? 2024లో సమకూరిన చెప్పుకోదగ్గ విజయాలు వ్యర్థమయ్యాయి. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ చతికిలపడింది.. మహారాష్ట్రలో మహిళలకు నగదు బదిలీల ద్వారా భారతీయ జనతా పార్టీ జయపతాక ఎగురవేసింది. ఢిల్లీ, బిహార్లలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ప్రయత్నాలు ఎల్లప్పుడూ ప్రారంభం కానివే సుమా! పరాజయం తరువాత పరాజయం పాలవుతూ కూడా కఠినమైన, వివేకవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు కాంగ్రెస్ మరింతగా సంకోచిస్తోంది. 'రాజకీయాలలో కొన్నిసార్లు, ఏ నిర్ణయాన్నీ తీసుకోకపోవడమే అత్యుత్తమ నిర్ణయం' అన్న పీవీ నరసింహారావు సుభాషితాన్ని ఔదలదాల్చింది కాబోలు!



■ రాజ్దీప్ సర్దేశాయి

కాంగ్రెస్ హై కమాండ్కు గతంలో ఒక వ్యవస్థగా లేదా ఒక వ్యక్తిగా గుర్తింపు ఉండేది. ఇప్పుడు పరిస్థితి అలా లేదు. కాంగ్రెస్ వ్యవహారాలలో హై కమాండ్ అనే పదానికి కాలం చెల్లిపోయినట్టుగా కనిపిస్తోంది. ఎందుకంటే పార్టీ వ్యవహారాలను సమర్థంగా నిర్దేశించగల 'అత్యున్నత' నేత ఎవరో తెలియదు; నియంత్రించగల వ్యవస్థ ఉనికిలో లేదన్నది స్పష్టం. మరి కాంగ్రెస్ 'హై కమాండ్' ఎవరు? సోనియా గాంధీ ఇంకెంత మాత్రం కాదు. ఆమె ఆ అత్యున్నత బాధ్యతల నుంచి దాదాపుగా వైదొలిగారు; పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం కాదు. సహచరులకు సమస్యలు సృష్టించడానికి ఆయన ఇష్టపడరు. అంతేగాక మార్పులకు చొరవ చూపే నేత కూడా కాదు; ప్రియాంకగాంధీ వాద్రా అంతకంటే కాదు. పార్టీలో ఏ నిర్దిష్ట బాధ్యతనూ ఆమెకు అప్పగించలేదు కదా. ఇక రాహుల్. కీలకమైన నిర్ణయాలు తీసుకోగల అధికారమున్న ఏకైక కాంగ్రెస్ నాయకుడు ఆయన మాత్రమే. కాంగ్రెస్ భావజాల యోధుడుగా మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నప్పటికీ పార్టీ వ్యవహారాలలో కార్యదక్షుడుగా ఆయనను ఎవరూ భావించడం లేదు. మరి కాంగ్రెస్కు ఇప్పుడు అత్యవసరమైనది ఘటనాఘటన సమర్థుడైన నేత కాదూ?

కర్ణాటకలో కాంగ్రెస్ ఎదుర్కొంటున్న క్లిష్ట సమస్యకు మళ్లీ వద్దాం. సులువైన, సరళమైన పరిష్కారాలు ఏవీ ఇక్కడ లేవు. సిద్ధరామయ్యకు మెజారిటీ శాసన సభ్యుల మద్దతు ఉన్నది. పైగా ఆయన ఓబీసీ నాయకుడు. మరి వెనుకబడిన వర్గాల సాధికారతకై, వారి జనసంఖ్యకు సమస్థాయిలో అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామని హామీపడుతున్న కాంగ్రెస్ పార్టీకి ఓబీసీ ముఖ్యమంత్రి చాలా ప్రతిష్ఠాత్మకమైన బలం, సందేహం లేదు. శివకుమార్ వయసు 63 సంవత్సరాలు. సిద్ధరామయ్య కంటే 14 సంవత్సరాలు చిన్నవాడు. ప్రత్యర్థి కంటే అమితంగా శక్తి సామర్థ్యాలు ఉన్న నేత. సిద్ధరామయ్య వచ్చే ఏడాది ప్రథమార్థంలో కర్ణాటకలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రిగా అద్వితీయ ప్రతిష్ఠా సంపన్నుడు అవనున్నారు. సిద్ధరామయ్య స్థానంలో శివకుమార్ ముఖ్యమంత్రి అయితే అది ఒక విధంగా పార్టీ నాయకత్వంలో తరం మార్పు అవుతుంది. గతంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్ నాయకత్వాల్లో తరం మార్పు భావనకు లభించిన అవకాశాన్ని కాంగ్రెస్ జారవిడుచుకున్నది. ఫలితంగా ప్రజల తిరస్కరణకు గురయింది. కర్ణాటకలో మరొకసారి అటువంటి అవకాశం వచ్చింది. సిద్ధరామయ్య తేలిగ్గా ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగి వెళ్లిపోయే వ్యక్తి కాదు. ఎట్టి పరిస్థితులలోనూ అధికారాన్ని నిలుపుకునేందుకే ఆయన తప్పక ప్రయత్నిస్తారు.

> **2027లో సిద్ధరామయ్య ఎటువంటి అవాంతరాలకు తావివ్వకుండా అధికారాన్ని శివకుమార్కు అప్పగిస్తారనే ఊహాగానాలు విస్తృతంగా వినవస్తున్నాయి. ఈ తాత్కాలిక సంధి ఎంతకాలం నిలుస్తుంది? గుజరాత్లో మంత్రులందరినీ రాత్రికి రాత్రే రాజీనామా చేయాలని ఆదేశించి, వెన్వెంటనే కొత్త మంత్రివర్గాన్ని తీసుకురావడంలో బీజేపీ సఫలమయింది. అటువంటి అద్భుతం కాంగ్రెస్లో సంభవించేందుకు ఆస్కారం లేనేలేదు.**

2027లో సిద్ధరామయ్య ఎటువంటి అవాంతరాలకు తావు లేకుండా అధికారాన్ని శివకుమార్కు అప్పగిస్తారనే ఊహాగానాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఈ తాత్కాలిక సంధి ఎంతకాలం నిలుస్తుంది? గుజరాత్లో మంత్రులు అందరినీ రాత్రికి రాత్రే రాజీనామా చేయాలని ఆదేశించి, వెన్వెంటనే కొత్త మంత్రివర్గాన్ని తీసుకురావడంలో భారతీయ జనతా పార్టీ సఫలమయింది. ఇదెలా సాధ్యమయింది? భారత రాజకీయాలలో నిజమైన 'హై కమాండ్' 7 లోక్ కల్యాణ్ మార్గ్, 6ఎ కృష్ణ మీనన్ మార్గ్లో ఉన్నది. బీజేపీలో ప్రధాన నిర్ణయాలు అన్నిటినీ ఆ రెండు నెలవులలో తీసుకోవడం జరుగుతోంది. బీజేపీ అధికారంలో ఉన్న పలు రాష్ట్రాలలో కూడా అధికారం కోసం వెంపర్లాటలు, గుంజాటనలూ ఉన్నాయి. గోవాలో అవి మరీ ఎక్కువగా ఉన్నాయి. అయినా ఏ ఒక్క నాయకుడూ బహిరంగంగా ప్రభుత్వం మార్పు గురించి మాట్లాడడానికి సాహసించలేదు. సాహసిస్తే సంభవించేదేమిటో అందరికీ బాగా తెలుసు. కాంగ్రెస్లో పరిస్థితి పూర్తిగా భిన్నమైనది. అధికారాన్ని ఆకాంక్షిస్తున్న వ్యక్తులు, వర్గాలు ప్రత్యర్థులతో బహిరంగంగా వాద ప్రతివాదాలు చేస్తారు. జాతీయ నాయకత్వం తమపై చర్య తీసుకోగలదనే సంకోచం ఏ ఒక్కరికీ ఉండదు గాక ఉండదు. హై కమాండ్ ప్రాబల్యం లోపించినా లేదా బలహీనపడినా జరిగేదేమిటో కర్ణాటకలో కాంగ్రెస్ వ్యవహారాలు స్పష్టం చేస్తున్నాయి. అక్కడ నాయకులు అందరూ తమ స్వీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నారు. పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదు. అధికారాన్ని స్వాయత్తం చేసుకునేందుకే ఆరాటపడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బలవంతుడు మాత్రమే నెగ్గుతాడు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

వెండితెరపై తెలుగువెన్నెల

నడకలోనే నవ్వులు పూయించే నటనామయి, భావాలే మాటలుగా పలికించే మహానటి. ఒక్కో నవ్వు వెనుక వెయ్యి కష్టాలున్నా ఆమె చిరునవ్వే నిత్యవసంతం. కన్నీటి చుక్కకే జీవం పంచిన ఆ కళామయి పేరు పలికితే తెలుగుతెరపైన వెలుగురేఖ వికసిస్తుంది. ఆవిడే మహానటి సావిత్రి. ఆమె ప్రతి భావం ఒక నటశాస్త్ర గ్రంథం. ప్రతి పాత్ర ఒక దర్శనం. విమర్శకులు 'నటి' అంటారు గానీ ప్రేక్షక దేవుళ్లు ఆత్మీయంగా 'అమ్మ' అన్నారు.

సావిత్రి తెలుగు చిత్రసీమ పుటల్లోనే కాదు, తెలుగు మనసుల్లోనూ శాశ్వతంగా వెలిగే అక్షరం. దక్షిణాదిలో ప్రేక్షకాభిమానం పొందిన నటీమణులు ఎందరో ఉన్నప్పటికీ, 'మహానటి' గౌరవానికి సావిత్రి మాత్రమే ప్రతీక. సత్యజిత్ రే వంటి ప్రపంచ ప్రసిద్ధ దర్శకుడే అలా కీర్తించటం ఆమె కళాభినయానికి అతిపెద్ద ముద్ర.



నవరసాలను అలవోకగా పండించి, ఏ పాత్రలోనైనా జీవించి, కళ్లతోనే హావభావాలను పలికించిన సావిత్రి ఒక అద్భుత నటశిఖరం. ఆమె సినిమాలు ఆ తరాన్నే కాదు, ఈ తరం వారినీ మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. ఆ మధ్య వచ్చిన 'మహానటి' సినిమా అందుకున్న అపార ప్రజాదరణ, ఆమె మహత్తర వ్యక్తిత్వానికి నేటి యువతరం అందించిన వందనం. ఆమె పోషించిన ప్రతి పాత్రలోనూ ఆమె ఆత్మ నిలిచేది. ఆ పాత్ర సావిత్రి తప్ప మరెవరూ చేయలేరని అనిపించే విధంగా తెరపై ఆమె మెరిసేది. సావిత్రి నటించిన చిత్రాలన్నింటినీ ఒక్కసారి జ్ఞాపకం చేసుకుంటే ఆ వైవిధ్యం మన కళ్లముందు కదలాడుతుంది. 'దేవదాసు'లో పార్వతే గుర్తొస్తుంది. 'మాయాబజార్'లో శశిరేఖే కనిపిస్తుంది. ఆ మహానటి మనకు దొరకటం తెలుగుజాతి అదృష్టం.

1971లో పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ ఆయనకు ఘన సన్మానం నిర్వహించి, ఒక భారీ పూలదండ అర్పించారు. అది పాకిస్థాన్ దురాక్రమణను దేశం ఎదుర్కొంటున్న వేళ కనుక, ఆ పూలదండను దేశరక్షణ నిధుల కోసం వేలం పాటకు పెట్టారు. అక్కడ సుప్రసిద్ధ అగ్రనటులు, నిర్మాతలు ఎందరో ఉన్నప్పటికీ, ఆ వేలానికి మొదటగా ముందుకు వచ్చినది సావిత్రిగారే. ఆకస్మికంగా ఆమెను ప్రోత్సహిస్తూ ఆ వేలం పాటలో పాల్గొన్న మరో మహానటుడు ఎం.జి. రామచంద్రన్. వేలం పాటను పెంచుకుంటూ పదిహేను వేలవరకూ ఆయన తీసుకెళ్లారు. చివరకు ఆ పూలదండను గెలుచుకుంది సావిత్రి గారే. ఎం.జి.ఆర్. లాంటి మహానటుడితో పోటీపడి గెలవడం ఒక విశిష్ట ఘనత. అయినా, ఆమె 'ఇది దేశరక్షణ విషయం కనుక మీతో పోటీపడ్డాను. తప్పయితే మన్నించండి' అని ఎం.జి.ఆర్.తో వినమ్రంగా అన్నారు. దానికి ప్రతిగా ఎం.జి.ఆర్. ఆమెను ప్రశంసిస్తూ, "అమ్మా! తప్పేమీ లేదు. ఎవరూ ముందుకు రాలేదు. నువ్వు ఎలా వేలం పాడుతావో నాకు తెలుసు. ఇది దేశం కోసం ఇచ్చే డబ్బు కనుక నేను పాట పెంచాను" అన్నారు. సావిత్రి దాతృత్వానికీ, దేశభక్తికీ, ఆమె అమోఘమైన వ్యక్తిత్వానికీ శాశ్వత సాక్ష్యం ఈ ఘటన. తెలుగు తెరకు మహానటి అయితే, జీవనవేదికపై ఆమెది మహా మనసు.


నాటి ప్రధానమంత్రి లాల్బహదూర్ శాస్త్రి హైదరాబాదుకు వచ్చినప్పుడు, దక్షిణాది చలన చిత్ర పరిశ్రమకు చెందిన నటీనటులందరినీ కలిసి దేశరక్షణ నిధికి సహాయం కోరారు. చాలామంది తమవంతు సాయం చెక్కుల రూపంలో అందించారు. సావిత్రి మాత్రం ఆ రోజు ఆమె ఒంటినిండా వేసుకున్న బంగారు నగలన్నింటినీ తీసి ప్రధాని చేతిలో పెట్టారు. ఆ నిశ్శబ్ద క్షణం– ఆమె దాతృత్వాన్ని, ఆమెలోని దేశభక్తిని కూడా అక్షరాలుగా చెక్కింది. సావిత్రి మనసున్న మనిషి. రాయలసీమ క్షామ నివారణకు, తుఫాన్ల బాధితులకు, విద్యాసంస్థలకు, అనేక సేవాసంస్థలకు స్వయంగా వెళ్లి సహాయం అందించేది. 1975 నాటి ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆవిడను ప్రత్యక్షంగా దర్శించే అదృష్టం నాకు దక్కింది. మా నాన్న మండలి వెంకట కృష్ణారావుగారు, జలగం వెంగళరావుగారు కలిసి ఆమెకు ఘన సన్మానం చేసినప్పుడు, ఆ ఆరాధ్య నటీమణి నవ్వు, భాషణం ఎన్నటికీ మరిచిపోలేనివి. సావిత్రి పోషించిన తెరపాత్రలన్నీ తెలుగుతనం ఎలా ఉండాలో మనకు చూపించే పాఠాలే. ఆమె కట్టు, తిలకం, మాట, నవ్వు తెలుగు సంస్కృతీ స్వరూపం.

■ మండలి బుద్ధప్రసాద్
శాసనసభ్యులు, అవనిగడ్డ

(నేడు సావిత్రి 90వ జయంతి)

రాజ్యాధికారమే అంబేద్కర్కు అసలైన నివాళి

ఆధునిక భారతదేశ చరిత్రలో అంబేద్కర్కు అత్యంత ప్రాముఖ్యం ఉంది. దేశ జనాభాలో పదిశాతం ఉన్న అగ్రవర్ణాలవారు, తొంభైశాతం ఉన్న అణగారిన వర్గాల ప్రజల మెడల్లకు బానిస సంకెళ్లు వేసి తరతరాలుగా వారితో వెట్టిచాకిరీ చేయించుకున్నారు. స్వాతంత్ర్యానంతరం ఇలాంటి పరిస్థితులను రూపుమాపి, దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను సరిసమానం చేసేందుకు కృషి చేసిన వ్యక్తి డా. బీఆర్ అంబేద్కర్. 'దళిత కుటుంబంలో జన్మించి, ఎన్నో కష్టాలు పడి, పోరాటాలు, త్యాగాలు చేసి భారత రాజ్యాంగం అనే గ్రంథాన్ని రచించిన ఒక విశిష్ట సంఘ సంస్కర్త'గా మాత్రమే నేటి పాలకులు అంబేద్కర్ను పరిమితం చేశారు. కానీ, అణగారిన వర్గాలకు ఏ లక్ష్యాలను సాధించుకోవాలని చెప్పాడో వాటిని నేటి పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం దేశ అగ్రవర్ణ పాలకుల స్వార్థబుద్ధికి నిదర్శనం. వారు అంబేద్కర్ స్థాయిని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి రాశారు. ఆ చరిత్రే నిజమని నేడు ఎందరో విద్యావంతులు, మేధావులూ నమ్ముతుండడం విచారకరం.



అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత, గొప్ప సంఘసంస్కర్త మాత్రమే కాదు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఉచిత స్కాలర్షిప్లు, రిజర్వేషన్లు అంతకంటే కాదు. అంబేద్కర్ సమానత్వాన్ని కాంక్షించారు. జనాభాలో పదిశాతం ఉన్న అగ్రవర్ణాలకు, తొంభైశాతం ఉన్న అణగారిన వర్గాలకు మధ్య ఒక స్పష్టమైన సైద్ధాంతిక గీత గీశారు. అసమానతలను పెంచి పోషించాలనుకునే అగ్రవర్ణ సమాజానికి– సమసమాజం, ప్రజాస్వామ్య, గణతంత్ర విలువలు కావాలనుకునే అణగారిన సమాజానికి మధ్య 'సామాజిక రాజకీయ సాంస్కృతిక' భావజాల పోరాటం చేశారు. భారత ప్రజలందరి మధ్యా 'స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, ప్రజాస్వామ్య, గణతంత్ర' భావాలు విరజిల్లాలని కలలు గని, ఆయా అంశాలను రాజ్యాంగంలో పొందుపరిచాడు. ఒకపక్క బ్రిటిష్ పాలకులపై రాజీపడని స్వాతంత్ర్య పోరాటం సాగిస్తూనే, మరోపక్క నాటి అగ్రవర్ణ నాయకులతోనూ అంతే స్థాయిలో తీవ్ర పోరాటం చేశాడు. స్వాతంత్ర్యానంతరం అగ్రవర్ణాల వారే పాలకులై, అణగారిన వర్గాలను బానిసలుగా మార్చకూడదని భావించాడు. అంబేద్కర్ అంతటి విశాల భావాలు ఉన్నవాడు కాబట్టే ఆయన జయంతిని జ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

ఓటు అనే వజ్రాయుధాన్ని రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ ప్రజలకందించాడు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు అధికారంలోకి రావాలని ఆకాంక్షించాడు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి రోజుల్లో ఏదో హడావిడి చేయడం కాదు 'రాజ్యాధికారంతో సమాజాన్ని మార్చడం, సమాజంతో రాజ్యాధికారానికి రావడం– దీన్ని పునరావృతమయ్యేలా సామాజిక పరివర్తన చేయడమే అంబేద్కర్కు మనం ఇచ్చే ఘనమైన నివాళి.

– పుల్లెంల గణేశ్

(నేడు అంబేద్కర్ వర్ధంతి)






గిరిజన ప్రపంచం ఉద్భవం

- ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చిన్నారుల ప్రదర్శనలతో ఆవిష్కృతం
- ముగిసిన ఉద్భవ్- 2025 వేడుకలు

6

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 6 డిసెంబరు 2025

అవినీతి చేస్తే చర్యలు తప్పవు

- మార్కెటింగ్ సిబ్బందికి డైరెక్టర్ విజయ సునీత వార్నింగ్
- కాన్ఫరెన్స్‌లో 'ఆంధ్రజ్యోతి' కథనం పై చర్చ

6

నాటి నాసిరకం వైన్‌ం మారింది!

- ప్రస్తుతం క్వాలిటీ, బ్రాండ్ల విషయంలో మెరుగ్గా మద్యం దుకాణాలు
- ప్రైవేట్ దుకాణాల్లో పెరిగిన విక్రయాలు, అధునాతన సౌకర్యాలు
- వైసీపీ జమానాలో నాసిరకం మద్యం అమ్మకాలు
- క్యాష్ ఇస్తేనే మద్యం.. డిజిటల్ పేమెంట్లకు నో..
- కావాల్సిన బ్రాండ్లకు బార్లకు వెళ్లాల్సిందే..



6



శ్రీకాంత్‌రెడ్డి యశ్వంత్ సాయి, వాసు మహేష్

బీటెక్ విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు

- రోడ్డు ప్రమాదంతో నాలుగు కుటుంబాల్లో విషాదం
- పోస్టుమార్టం అనంతరం స్వగ్రామాలకు మృతదేహాలు

వినుకొండ టౌన్, నూజెండ్ల, పిడుగురాళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదువుకుంటున్నారు.. కుటుంబానికి ప్రయోజనం చేకూరుస్తారని ఆశించిన తల్లిదండ్రులను విషాదానికి గురిచేస్తూ అశువులు బాశారు. శనివారం ఇరుముడితో శబరిమల యాత్రకు వెళ్లే క్రమంలో మిత్రులందరూ వినుకొండకు బయల్దేరగా ఊహించని రీతిలో వీరు ప్రయాణిస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొట్టింది. చిలకలూరిపేట బైపాస్‌లో నాదెండ్ల మండలం గణపవరం వద్ద గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విజ్ఞాన్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు మృతి చెందగా వారిలో నలుగురు పల్నాడు జిల్లాకు చెందిన వారున్నారు. అయ్యప్పమాల ధరించిన విద్యార్థులు గుంటూరు నుంచి వినుకొండలోని ఆలయానికి కారులో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో వినుకొండ మండలం శివాపురానికి చెందిన మేరుగు శ్రీకాంత్‌రెడ్డి(21), నూజెండ్ల మండలం మూలకలూరు కు చెందిన యశ్వంత్ సాయి(19), వంగవల్లు వాసు(19), పిడుగురాళ్లకు చెందిన శివరాత్రి మహేష్‌బాబుతో పాటు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం విఠలాపురానికి చెందిన మెడిగం రామిరెడ్డిలు మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన వినుకొండ మండలం దొండపాడు గ్రామానికి చెందిన మద్దుకూరి కార్తీక్ గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. కాగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అప్పగించడంతో వారివారి గ్రామాల్లో విద్యార్థులకు కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థులకు స్నేహి తులు, బంధువులు, ఆయా గ్రామాలకు చెందిన వారు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ ప్రమాదంలో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాంత్‌రెడ్డికి తండ్రి సుబ్బారెడ్డి, తల్లి కృష్ణకుమారి, నాయ నమ్మ వెంకాయమ్మ, సోదరుడు గౌతమ్‌రెడ్డి ఉన్నారు. వ్యవసాయంలో ఇంతకాలం తండ్రి పడిన కష్టం ఇక పడనివ్వనంటూ శ్రీకాంత్‌రెడ్డి చెప్పిన మాటలు తలుచుకుంటూ కుటుంబసభ్యులు కన్నీటి పర్యంత మయ్యారు. యశ్వంత్ సాయి తల్లి కుమారి ఏఎన్ఎంగా సేవలు అంది స్తున్నారు. వంగవల్లు వెంకటరావు, (మిగతా 8వ పేజీలో)

విద్యార్థుల్లో శక్తిని గుర్తించాలి



- పిల్లల ఆలోచనలు, ప్రవర్తనలోనే భవిష్యత్
- అబ్దుల్‌కలాం స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలి
- మెగా పీటీఎంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలిస్తూ..



విద్యార్థులతో పవన్ కల్యాణ్, పుల్లారావు, కలెక్టర్ తదితరులు

పాఠశాలకు పవన్ వరాలు

శారదా పాఠశాలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వరాలు ప్రకటించారు. తన సొంత నిధులతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. పూర్తి స్థాయిలో పుస్తకాలు అందిస్తానని, బీరువాలు ఇస్తానన్నారు. పాఠశాలకు 25 కంప్యూటర్లను విరాళంగా అందజేస్తానని చెప్పారు. ఆట స్థలం కావాలని విద్యార్థిని జాస్మిన్ కోరగా స్పందించిన పవన్ ఆట స్థలం ఏర్పాటు చేయాలని అధికారులను వేదికపైనే ఆదేశించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చొరవ తీసుకోవాలని చెప్పారు. కూటమి, జనసేన నేతలు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మొబైల్ లైబ్రరీల ఏర్పాటుపై ఆలోచన చేయాలన్నారు.

చిలకలూరిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అద్భుతమైన శక్తి ఉంటుంది.. దానిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలి పారు. చిలకలూరిపేటలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పవన్ విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠశాలలో గదులు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యా యు లతో మాట్లాడారు. అనంతరం జరిగిన (మిగతా 8వ పేజీలో)



తల్లి.. టీచర్ పాత్ర కీలకం

చిన్నప్పుడు మా అమ్మ లైట్ వేయగానే దణ్ణం పెట్టుకునేది. చాలా సార్లు చూశాక ఎందుకమ్మా దణ్ణం పెట్టుకుంటున్నావు అని అడిగాను. ఎడిసన్ కనిపెట్టిన లైట్‌తో మనకు ఈ వెలుగులు.. అందు కని ఆయనకు దణ్ణం పెడుతున్నానని చెప్పింది. శాస్త్రజ్ఞులకు, మనకు మంచి భవిష్యత్ ఇచ్చిన వారికి కృతజ్ఞతగా ఉండాలని చిన్నప్పుడే తల్లి ద్వారా తెలుసుకున్నాను. నాకు చిన్నతనంలో సోషల్ టీచర్ సమాజం, దేశభక్తి గురించి చెప్పారు. ఈ రోజున ఇంత చేయగలుగుతున్నామంటే ఆ టీచర్ చెప్పిన చిన్న పాఠమే కారణం.

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పీటీఎంతో పిల్లల చదువుపై సమీక్ష

- అంగలకుదురు ఉన్నత పాఠశాలలో మంత్రి మనోహర్, కలెక్టర్ అన్సారియా

తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులు స్వయంగా సమీక్షించేందుకే రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం) ఏర్పాటు చేసిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రూరల్ మండలం అంగలకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పీటీఎంలో మంత్రి పాల్గొన్నారు. పీఎంశ్రీ నిధులతో పాఠశాలలో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్, లైబ్రరీలను ప్రారంభించారు. పుస్తక, సైన్స్ మోడల్స్ ప్రదర్శనలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ మెరుగైన సమాజం రూపొందించాలని కూటమి ప్రభుత్వం తపన పడుతుందని, ఇందుకు పాఠశాల నుంచి శ్రీకారం చుట్టామన్నారు. విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు ఉందని, అందుకు తగిన ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలు పాఠశాలకు వెళ్లి ఎలా చదువుతున్నారనేది పర్యవేక్షించకపోతే వారిని నష్టపరిచిన వారవుతారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలన్నారు.

నాణ్యమైన బియ్యంతో మధ్యాహ్న భోజనం

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బియ్యం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మధ్యాహ్న భోజనానికి మూడు లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరిస్తున్నామన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, సబ్ కలెక్టర్ సంజన సింహ, డీఈవో రేణుక, డీడీవో కుసుమ శ్రీదేవి, పద్మావతి, హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకతాయిల వేధింపులపై ఫిర్యాదు

మెగా పీటీఎంలో భాగంగా విద్యార్థులతో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. భోజనం చేసే క్రమంలో తమను ఆకతాయిలు వేధిస్తున్నారని ఓ బాలిక మంత్రికి ఫిర్యాదు చేసింది. స్కూల్‌కి వచ్చిపోయే సమయంలో గ్రామంలోని సెంటర్‌లో కొందరు తమను టీజింగ్ చేస్తున్నారని చెప్పింది. స్పందించిన మంత్రి ఆ ప్రాంతంలో నిఘా వేసి ఆకతాయిల ఆట కట్టించాలని పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, సబ్ కలెక్టర్ సంజనసింహ, డీఈవో రేణుక, డీడీవో శ్రీదేవి, సమగ్ర శిక్ష అధికారి పద్మావతి, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, బీజేపీ నాయకులు వాసుదేవ నాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న మంత్రి మనోహర్, కలెక్టర్

ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం

- ములుకుదురు, చేబ్రోలు పర్యటనలో జేసీ శ్రీవాస్తవ

పొన్నూరుటౌన్, చేబ్రోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. పొన్నూరు మండలం ములుకుదురు, చేబ్రోలులో శుక్రవారం ధాన్యం కొనుగోళ్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు 17 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించాలని సూచించారు. తొందరపడి దళారుల మాటలు నమ్మి వారికి ధాన్యం విక్రయించి నష్టపోవద్దని రైతులకు తెలిపారు. గోతాలు, కూలీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తుందన్నారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోపే రైతు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. తుఫాన్ ముప్పు లేని నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అధికారులు అవగాహన కల్పించి సకాలంలో విక్రయించుకునేలా సూచించాలని తెలిపారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని, ప్రభుత్వ నియమాల ప్రకారం ప్రతి గింజను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సీతారామాంజనేయ, కుమార్ రైస్ మిల్లులను పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు చేరుతుందా లేదా అని రికార్డులు పరిశీలించారు. తేమ శాతం పరీక్షించే యంత్రాల పనితీరును సమీక్షించారు.



ధాన్యం కొనుగోళ్ల వివరాలను పరిశీలిస్తున్న జేసీ శ్రీవాస్తవ

బీపీఎస్‌కు వెనకడుగు

బీపీఎస్ పీనల్ చార్జీలతో పాటు 14 శాతం ఓఎస్‌సీ ఫీజు చెల్లించాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లు చెబుతుండటంతో భవన యజమానులు వెనకడుగు వేస్తున్నారు. 150 చదరపు గజాల భవనం ఉదాహరణగా తీసుకొంటే పీనల్ చార్జీలు వచ్చి రూ.1.60 లక్షలకు పైగానే లెక్కిస్తున్నారు. ఇక ఓఎస్‌సీ కింద అక్కడ భూమి విలువ రూ.20 లక్షలు ఉందనుకొంటే దానికి రూ. 2.80 లక్షలు ఒక అంతస్తుకు చెల్లించాల్సి ఉంటుంది. రెండు అంతస్తులు అయితే రెట్టింపు అవుతుంది. ఈ విధంగా చిన్న భవనాన్ని బీపీఎస్ కింద రెగ్యులరైజేషన్ చేసుకోవాలంటేనే దాదాపుగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఎవరూ ముందుకు రావడం లేదు.



ప్రతిబంధకంగా ఓఎస్‌సీ ఫీజు

- భూమి విలువలో 14 శాతం అంటున్న నగరపాలక సంస్థ
- భారమవుతున్న పీనల్ ఫీజులు
- చిన్న భవనాలకే రూ.లక్షల్లో చెల్లింపు..

గుంటూరు డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బీపీఎస్)కి గుంటూరు నగరపాలక సంస్థలో స్పందన కరువైంది. ఈ పథకం అమలులోకి వచ్చి దాదాపుగా 20 రోజులు గడిచినప్పటికీ భవన యజమానులు అంతగా ఆసక్తి ప్రదర్శించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్(ఓఎస్‌సీ) ఫీజు కారణమన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల తర్వాత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం బీపీఎస్‌ని గత నెల 12 నుంచి అమలులోకి తీసుకొచ్చింది. బేసిక్ పీనలైజేషన్ చార్జీల కింద 100 చదరపు మీటర్ల వరకు చదరపు మీటర్‌కు రూ.40, 101 నుంచి 300 చదరపు మీటర్ల వరకు రూ.60 పీనల్ చార్జీలను నిర్ణయించింది. 301 నుంచి 500 చదరపు మీటర్ల వరకు బిల్డింగ్ ప్లాన్ డీవియేషన్ 30 శాతం లోపు ఉంటే చదరపు మీటర్‌కు రూ.80, 30 శాతం కంటే ఎక్కువ/ప్లాన్ లేకుండా నిర్మించి ఉంటే రూ. 100 చొప్పున చెల్లించాలి. 501 నుంచి 1000 చదరపు మీటర్ల వరకు భవనాలకు 30 శాతం లోపు డీవియేషన్ ఉంటే చదరపు మీటర్‌కు రూ.100, అంతకంటే ఎక్కువ/ప్లాన్ లేకపోతే రూ.120 చెల్లించాలి. వెయ్యి చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భవనాలకు 30 శాతం డీవియేషన్ లోపు ఉంటే రూ.150 చొప్పున, అంతకంటే ఎక్కువ/పూర్తిగా అనధికార నిర్మాణం అయితే రూ. 200 చొప్పున చెల్లించాలి. హాస్టల్స్, సర్వీసు అపార్టుమెంట్‌లు, డార్మిటరీలు, కమర్షియల్, ఇండస్ట్రియల్, (మిగతా 8వ పేజీలో)

వచ్చే నెల 30న సైన్స్ ఎగ్జిబిషన్

- 30 ఏళ్ల అనంతరం గుంటూరు వైద్య కళాశాలలో ఏర్పాటు
- సీఎం చంద్రబాబుచే ప్రారంభం.. రెండు వారాలు నిర్వహణ

గుంటూరు మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంపై విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా గుంటూరు వైద్య కళాశాలలో జనవరి 30న సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని ప్రారంభిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి శుక్రవారం తెలిపారు. చివరి సారిగా 1996లో గుంటూరు మెడికల్ కాలేజీలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. తిరిగి ముప్పై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వచ్చే జనవరిలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలని జీఎంసీ వర్గాలు నిర్ణయించాయి. రెండు వారాల పాటు పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో పాటు సాధారణ ప్రజలు ఈ విజ్ఞాన ప్రదర్శనను తిలకించవచ్చు. అనాటమీ, ఫిజియాలజీ, పెథాలజీ, మైక్రోబయాలజీ వంటి నాన్‌క్లినికల్ విభాగాలతో పాటు మానవ శరీర అవయ వాల ప్రదర్శన వంటి అంశాలను ప్రదర్శనలో ఉంచుతారు. పలు రకాల శస్త్రచికిత్సల వీడియో ప్రదర్శనలు ఉంటాయి. వర్చువల్ రియాలిటీతో మరికొన్ని విజ్ఞాన ప్రదర్శనలు ఉంటాయి.

అవినీతి చేస్తే.. చర్యలు తప్పవు

● మార్కెటింగ్ సిబ్బందికి డైరెక్టర్ విజయ సునీత హెచ్చరిక

● కాన్ఫరెన్స్ లో 'ఆంధ్రజ్యోతి' కథనం పై చర్చ

గుంటూరు సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'పత్తి రైతులు అసలే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో వారికి అండగా ఉండాల్సింది పోయి.. ఏదో ఒక రూపేణా పీడించడం ఏంటీ? అవినీతి చేస్తే ఉపేక్షించేది లేదు.. చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదు.' అంటూ మార్కెటింగ్ సిబ్బందికి రాష్ట్ర డైరెక్టర్ విజయ సునీత వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. 'రూ.20 ఇస్తే.. పాస్ 'అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రంలోని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, యార్డ్ సెక్రటరీలు, సూపర్ వైజర్లతో డైరెక్టర్ విజయ సునీత టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డబ్బులు కోసం రైతులను వేధిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. 'ఆంధ్రజ్యోతి 'కథనం పై విచారణ జరిపేందుకు ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లను నియమించినట్లు సమాచారం.

ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాదిలో నిర్వహించిన ఫార్మసీ మొదటి సెమిస్టర్ రీవాల్యుయేషన్, ఫార్మసీ రెండోవ సంవత్సర రెగ్యులర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్‌రావు విడుదల చేశారు. ఫలితాలు ఏఎన్‌యూ వెబ్ సైట్ లో పొంది పరిచారు. సెకండ్ ఇయర్ రీవాల్యుయేషన్‌కు ఈ నెల 16 తేదీలోగా రూ.2,190 చెల్లించాలన్నారు. బీఏ ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం రివ్యాల్యుషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు.

ప్రమాద ఘటన పై సమగ్ర విచారణ చేయిస్తాం

నాదెండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి పైన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు మృతి చెందటం అత్యంత బాధాకరమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థులు తమ విద్యా సంస్థలకు చెందిన వారు కావడం మరింత బాధిస్తుందన్నారు. ఈ ఘటన కారణాలపై సమగ్ర విచారణ చేయిస్తామని, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు.

ఆధునిక కిమ్స్ ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభం

● సంతాన సాఫల్యత రంగంలో సేవలు



కిమ్స్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకటరమణ

గుంటూరు మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంతాన సాఫల్యత రంగంలో అత్యున్నత ప్రమాణాలతో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిమ్స్ ఐవీఎఫ్ సెంటర్ అందుబాటులోకి రావడం అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ తెలిపారు. శుక్రవారం కొత్తపేట యడవల్లివారి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కిమ్స్ ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్‌ను ఏపీ ఫైర్ సర్వీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ పి.వెంకట రమణ, డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ ప్రారంభించారు. కిమ్స్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్, అడ్వాన్స్‌డ్ రిప్రొడక్టివ్, ల్యాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఐ.నాగ ప్రత్యూష మాట్లాడుతూ అత్యాధునిక సంతాన సాఫల్యత వైద్య సేవలు కిమ్స్ ఫెర్టిలిటీ సెంటర్‌లో అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. ఇన్‌హౌస్ ఎంబ్రియాలజిస్టులు, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ప్రమాణాలతో ఐవీఎఫ్ ల్యాబ్ ఉన్నాయని, ఐయూఐ, ఐవీఎఫ్, ఇక్సీ, డోనర్ ఎగ్ ఐవీఎఫ్ చికిత్సలు లభిస్తాయని తెలిపారు. ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శిరీష గురిజాల మాట్లాడుతూ హైరిస్క్ ఇన్‌ఫెర్టిలిటీ కేసులకు చక్కటి పరిష్కారం కిమ్స్‌లో లభిస్తుందన్నారు. ఐవీఎఫ్ చికిత్సలతో పాటు భార్యభర్తల భావోద్వేగాలకు అనుగుణంగా తగిన కౌన్సెలింగ్ సేవలు కూడా అందిస్తామన్నారు. పలుమార్లు ఐవీఎఫ్ విఫలమైన కేసులకు, అధిక వయస్సు ఉన్న జంటలకు, పురుషుల్లో తీవ్రమైన లోపాలు ఉన్న కేసులకు కిమ్స్‌లో చక్కటి వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకర్ జాదవ్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఐదు కిమ్స్ ఐవీఎఫ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల హైదరాబాద్ జూబ్లీ హిల్స్ సెంటర్‌ను ప్రారంభించగా, గుంటూరు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ శిఖర హాస్పిటల్ యూనిట్ హెడ్ హరికుమార్, ఎంబ్రియాలజిస్టులు ఎంఎల్ ఉదయ్, నసీమ్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

ఆలయాల పవిత్రతను.. దెబ్బతీస్తున్న జగన్ వ్యాఖ్యలు

పొన్నూరుటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు దేవాలయాల పవిత్రతను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగే దొంగ దొంగ అన్న సామెత జగన్మోహన్‌రెడ్డికి సరిగ్గా సరిపోతుందన్నారు. పరకామణి కేసులో దొంగతనం జరిగిందని నిర్ధారణ జరిగితే.. చిన్న కేసు అంటున్న జగన్ వైఖరిని రాష్ట్ర ప్రజలు గుర్తించాలన్నారు. ప్రభుత్వ అధినేతలుగా పని చేసిన వారు.. తప్పు చేసిన వారిని శిక్షించమని చెప్పాలని.. కానీ, దొంగతనం చేసి తిరిగి ఇచ్చేస్తే కేసు ఎందుకు అని చెప్పడంతోనే జగన్ వైఖరి బహిర్గతమవుతుందన్నారు.

ఫ్యూచర్ లెర్నింగ్ విత్ ఏఐ-2 పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న చైర్మన్ విజయ భాస్కర్

ఏఎన్‌యూ డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిశోధకుడు డాక్టర్ రమేష్ భవిశెట్టి రాసిన ఫ్యూచర్ లెర్నింగ్ విత్ ఏఐ-2 పుస్తకాన్ని శుక్రవారం ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ విజయ భాస్కర్ ఆవిష్కరించారు. దేశ విదేశాల్లో ఉన్న పలువురు పరిశోధకులు, విద్యావేత్తలు రాసిన పరిశోధన వ్యాసాలను పుస్తకం రూపంలోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆచార్య విజయభాస్కర రావు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఎంతగానో ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎడిటర్లను అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం. వసంతరావు, ఏసీ లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అమృత, పబ్లిషర్ క్రాంతి కుమార్, కృష్ణాజిల్లా సైకాలజీ కౌన్సెలర్ డాక్టర్ ప్రసాద్, దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ రమేష్, బెంగళూరులోని సీనియర్ కన్సల్టెంట్ కోనేరు హర్షిత చౌదరి ఎడిటర్లుగా వ్యవహరించారు.

మానసిక, శారీరక వికాసానికి క్రీడల్లో పాల్గొనాలి

● ఉత్సాహంగా మహిళా వాలీబాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వర్సిటీ పరిశీలకుడు ప్రకాశ్

తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో మానసిక, శారీరక వికాసానికి క్రీడల్లో పాల్గొనాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిశీలకులు డాక్టర్ ప్రీతమ్ ప్రకాశ్ పేర్కొన్నారు. జేఎంజే కళాశాలలో యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. 9 కళాశాలల నుంచి వాలీబాల్ జట్లు టోర్నమెంట్‌కు హాజరయ్యాయి. తొలి రోజు యూనివర్సిటీ జట్టుపై బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు, ఆర్‌వీఆర్ జట్టుపై ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు, ఎ.సి. కళాశాల జట్టుపై బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టు, సెయింట్ అన్స్ కళాశాల జట్టుపై జేఎంజే కళాశాల జట్టు విజయం సాధించాయి. లీగ్ మ్యాచ్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై 25-5, 25-10 స్కోరుతో జేఎంజే జట్టు విజయం సాధించింది. శనివారం ఫైనల్స్ జరగనుంది. సెలక్షన్ కమిటీ సభ్యుడు గౌరీశంకర్, కృష్ణ, ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్‌లీన్, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణసుజాత, రవీందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గుంటూరు(విద్య), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు ఎంపీ సుబ్బారావును సస్పెండ్ చేస్తూ డీఈఓ సీవీ రేణుక శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో మెగా పేరెంట్స్ మీట్ సందర్భంగా అల్లరి చేస్తున్నారనే కారణంతో 6వ తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుడు చేయి చేసుకోవడం, గిచ్చడం, బూటుకాలుతో విద్యార్థుల కాళ్లను తొక్కిన వీడియో సమాజిక మాధ్యామాల్లో వైరలైంది. విద్యాహక్కు చట్టం నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ వెల్లడించారు.

అడ్వెంచర్ క్యాంపునకు.. వర్సిటీ వలంటీర్లు ఎంపిక

ఏఎన్‌యూ, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లు ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారి వాజ్‌పాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్‌లో జరిగే అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికైనట్లు ఏఎన్యూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య వి.దివ్య తేజోమూర్తి శుక్రవారం తెలిపారు. ఈ క్యాంపులో ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలకు చెందిన కె.ప్రసన్నలక్ష్మి, సైన్స్ కళాశాల విద్యార్థి బి.వెంకటేష్ నాయుడు, ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థి బిందుభారవి, గుంటూరు టీజేపీఎస్ కళాశాలకు చెందిన ఎన్.నరేష్, మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల నుంచి చల్లా కార్తికేయ, శ్రీరామ్, నాగార్జున సాగర్ ఏపీఆర్డీ కళాశాల నుంచి ఎస్.రవీంద్రనాథ్, గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి బి.కీర్తి, కె.వేస్తురరాణి, చౌడవరం ఆర్వీఆర్‌జేసీ కళాశాల నుంచి జె.హేమ, ఎం.మహేంద్రచౌదరి వాలంటీర్లుగా పాల్గొంటారని చెప్పారు. ఈ క్యాంపునకు ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి.కొండలరావు సారథిగా ఉంటారని చెప్పారు. వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ ఆర్.శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో.. 19వ ఫ్లోర్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు



మాట్లాడుతున్న స్కూల్ చైర్మన్ డాక్టర్ ప్రకాష్‌రావు

నరసరావు పేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 19వ ఫ్లోర్ బాల్ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషులు, మహి ళల అంతర్ జిల్లాల పోటీలు ఈ నెల 6, 7వ తేదీల్లో జరుగుతాయని స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు, డైరెక్టర్ సబితా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వారికి భోజన, వసతులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, ప్రత్యేక అతిథిగా కలెక్టర్ కృతికాశుక్లా హాజరవుతారని తెలిపారు. ఇక్కడ జరిగే పోటీలలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర జట్టు క్రీడాకారులు జనవరి 4,5,6,7 తేదీల్లో న్యూ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ పూలేకర్, జిల్లా ఫ్లోర్ బాల్ సెక్రటరీ ఎం. కిషోర్ బాబు, ఏపీ జాయింట్ సెక్రెటరీ పి. సురేంద్ర, కోచ్‌లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రూ.140 కోట్ల దూది మాయం?!

● సీసీఐ మేనేజర్‌ను విచారించిన సీఐడీ

గుంటూరు సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాల్లో దూది మాయం వ్యవహారంపై విచారణ ఆరంభం అయ్యింది. శుక్రవారం సీసీఐ మేనేజర్‌ను సీఐడీ అధికారులు గుంటూరులోని కార్యాలయానికి పిలిపించారు. ఈ సందర్భంగా గత ఏడాది రాష్ట్రంలోని సీసీఐ కేంద్రాల్లో జరిగిన రూ. 140 కోట్ల దూది మాయానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని వివిధ పద్దతుల్లో కోత విధించడం, కొన్ని సందర్భాల్లో అదనపు దూది వచ్చినా దానిని ప్రభుత్వ ఖాతాలో జమ చేయక పోవడం వంటి కీలకమైన విషయాలపై విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆయా పద్ధతుల్లో అదనంగా వచ్చిన దూదిని బయ్యర్లు పక్కకు తీసి అమ్ముకొని సొమ్ము చేసుకోవడం అనే వ్యవహారం అసలు ఎన్ని రోజులుగా జరుగుతుంది.. అన్న దానిపై కూడా అధికార యంత్రాంగం దృష్టి సారించినట్లు సమాచారం. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 3.75 లక్షల దూది బేళ్లు రాగా, అందులో సుమారు 40 వేల దూది బేళ్లు అడ్డ దారిలో అమ్మకాలు జరిగాయన్న ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా అనేక కీలక ఆధారాలను సీఐడీ సేకరించినట్లు తెలుస్తోంది. సీసీఐ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజ్ కూడా విచారణ లో కీలకం కానున్నట్లు సమాచారం. మరి కొద్ది రోజుల్లోనే ఈ కేసులో కొన్ని సంచలనాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కొందరు బయ్యర్ల మెడకు ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తుంది.

నేడు తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం

తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం శనివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రారంభం కానుంది. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలను అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, సృజనాత్మకత సంస్కృతి సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వైష్ణవి కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే సభలో తొలిరోజు పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. తెలుగు భాష- సాహిత్యం - వ్యక్తిత్వ వికాసంపై కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం తెలుగు ఆచార్యులు నారిశెట్టి వెంకటకృష్ణారావు, షిమి ఎడ్యుకేషనల్ ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ సీఈవో దబ్బారి నాగేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ, చింతల శ్రీనివాసరావు ప్రసంగిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కవులతో కవితా గోష్టి నిర్వహిస్తారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు సైదారావు బృందం జుగల్‌బందితో శ్రోతలను అలరిస్తారు. సాయంత్రం సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగే సభలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రజా సాహితీ సంపాదకుడు కొత్లపల్లి రవిబాబుకు పురస్కారాలు ప్రదానం చేస్తారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ శ్రీకృష్ణదేవరాయలు పాత్ర పోషిస్తారని, భువన విజయం సాహితీ రూపకాన్ని ప్రదర్శిస్తారని ఫౌండేషన్ కన్వీనర్ చందు సుబ్బారావు తెలిపారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

● లోక్ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టెట్ విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను పునఃసమీక్ష చేసి.. ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. శుక్రవారం లోక్‌సభ జీరో అవర్ సందర్భంగా.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దేశంలోని సర్వీస్‌లో ఉన్న ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు రెండేళ్లలోగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిందేననే నిర్ణయం ఉపాధ్యాయ వర్గాలలో తీవ్ర ఆందోళనకు దారితీసిందన్నారు. 2010 ఆగస్టు 23కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు అప్పటి ఆర్‌టీఈ చట్టం ప్రకారం టెట్ నుంచి మినహాయింపు ఇచ్చిన విషయం గుర్తుచేశారు. ప్రస్తుతం 15 నుంచి 30 ఏళ్ల అనుభవం ఉన్న గ్రామీణ, ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలలో విద్యా వ్యవస్థను నిలబెట్టే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు మరోసారి టెట్ లాంటి ప్రవేశ పరీక్ష రాయాల్సిన పరిస్థితి కలగడం వారిని ఇబ్బందికి గురిచేసే అంశమన్నారు. ఆర్‌టీఈ చట్టం, ఎన్‌సీటీఈ చట్టం 1993లో సవరణలు చేసి 2010కు ముందు సర్వీసులలో నియమితులైన ఉపాధ్యాయులకు స్థిరమైన భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సాతులూరు గూడ్స్ షెడ్డులో సకల సదుపాయాలు

● డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సాతులూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన గూడ్స్‌షెడ్డులో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని రైల్వే అధికారులను డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ ఆదేశించారు. శుక్రవారం ఆమె రైల్వే ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సాతులూరు స్టేషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను సమీక్షించారు. లోడింగ్, అన్‌లోడింగ్, యాక్సెస్ రోడ్డుకు సంబంధించి పనులు పూర్తి అయ్యాయని అధికారులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వెండార్స్, వర్కర్స్, సేల్స్ ప్రమోటర్ తదితర గదుల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. సీసీ టీవీల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా అన్ని పనులు పూర్తి చేసి సాతులూరు గూడ్స్ షెడ్డుని వెండార్స్‌కి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. వెండార్స్ సరుకులు సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చుతామన్న భరోసా కల్పించాలని సూచించారు. ఏడీఆర్‌ఎం రమేష్ కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం డి.వినయ్‌కాంత్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

32,904 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 29,559 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 32,904 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,509 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	10000	17000	334	10500	16700
నెంబరు. 5	11500	15500	నెంబరు. 5	11000	15300
273	---	----	273	----	----
341	10500	16500	341	12000	16800
4884	---	---	4884	12000	14200
సూపర్ 10	----	----			
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15800	తేజ	11000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి 355	11000	17200
బ్యాడిగి	10500	17000	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	11000	16500	తాలుకాయలు	5000	7800
ఆర్మూరు	10500	13200			

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

సామాజిక స్పృహతోనే వెట్టిచాకిరి నిర్మూలన

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహతోనే వెట్టిచాకిరి వంటి వ్యవస్థలను నిర్మూలన చేయవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. వెట్టిచాకిరి నిరోధక చట్టం 1976 (బాండెడ్ లేబర్ సిస్టమ్ అబాలిషన్ యాక్ట్) నిఘా అమలు కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి ప్రియాంక వెట్టిచాకిరి నిరోధక చట్టం 1976 ను గురించి వివరించారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ ఏ.గాయత్రిదేవి, డీఈవో సీవీ రేణుక, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్, సభ్యులు పాల్గొన్నారు.

పరిశ్రమలు త్వరగా గ్రౌండింగ్ జరగాలి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరైన పరిశ్రమలు త్వరగా గ్రౌండింగ్ జరగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. కలెక్టర్ తమీమ్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టుకొన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ జయలక్ష్మి మాట్లాడుతూ గత నెలలో 1047 దరఖాస్తులు అంద గా 969 పరిశ్రమలను మంజూరు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎండీ నజీనబేగం, పర్యాటక శాఖ అధికారి రమ్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తురకా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తురకా రామారావు నియమితులయ్యారు. శుక్రవారం లాలుపురంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ పదవికి ఎంపిక చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మధుకర్, గోపి శ్రీనివాస్, చెరుకూరు తిరుపతిరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.రామకృష్ణ, నారాయణరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, కోవెలకారు రాకేష్ జీ, భాను కిషోర్ పాల్గొని రామారావుకి శుభాకాంక్షలు తెలిపారు.

మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు


మహిళతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో పిన్ పాయింట్‌గా మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలని, కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్మికులు, కార్యదర్శులు, అధికారుల పై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం జేకేసీ కాలేజీ రోడ్డు, ఇన్నర్‌రింగ్ రోడ్డు, ఆర్టీసీ కాలనీ, బాలా జీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కార్పొరేటర్ కే.రంగారెడ్డి, డీఈఈలు రమేష్‌బాబు, కళ్యాణ రావు, ఆర్వో సాదిక్‌బాషా, ఎస్ఎస్ ఆయూబ్‌ఖాన్, ఇంజనీరింగ్, ప్రజా రోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో నూతన వరవడికి ప్రభుత్వం శ్రీకారం

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల ద్వారా విద్యా రంగంలో నూతన ఒరవడికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం భారత్‌పేటలోని మున్సిపల్ హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.నాగమంజరి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఎం.దుర్గా భవాని పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాల అనధికార తరలింపుపై చర్యలు

కమిషనర్ క్యాంపు కార్యాలయంలో చికెన్ షాప్‌ల అసోసియేషన్ ప్రతినిధులు, నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చికెన్, మటన్, చేపల విక్రయదారులు తమ షాప్‌లలో వచ్చే వ్యర్థాలను అనధికార వ్యక్తులకు ఇవ్వడానికి వీల్లేదని, జీఎంసీ అధీకృత ఏజన్సీ ప్రతినిధులకే అందించాలన్నారు. సీఎంవోహెచ్ డాక్టర్ శాంతి కళ, వీఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, జిల్లా బాయిలర్ చికెన్ స్టాల్స్ ప్రెసిడెంట్ కిషోర్, పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ సురేష్, జాకీర్, వెంకయ్య పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో కిట్స్‌లో స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్ పోటీలు

● చైర్మన్ కోయ సుబ్బారావు


ఆహ్వాన పత్రాలు విడుదల చేస్తున్న డాక్టర్ కోయ సుబ్బారావు తదితరులు

గుంటూరు (విద్య), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో 8వ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు వెల్లడిం చారు. శుక్రవారం రాజేంద్రనగర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలు దేశవ్యాప్తంగా 60 నోడల్ కేంద్రాల్లో జరుగుతున్నాయని, ఇందులో మూడు నోడల్ కేంద్రాలు రాష్ట్రంలో ఉన్నాయని అందులో ఒకటి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఒకటి కావడం హర్షణీయమని తెలిపారు. కళాశాలలో జరిగే హ్యాకథాన్ పోటీ లకు దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాల నుంచి 25 టీములు పాల్గొంటాయని తెలిపారు. సాంకేతిక విద్యార్థులు 36గంటల పాటు హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. సమావేశంలో కళాశాల కార్యదర్శి కోయ శేఖర్, ప్రిన్సిపాల్ పి.బాబు, కోఆర్డినేటర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన గని.. కోగంటి సీతారామాచార్యులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తన ప్రవచనాలతో భార తీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరికి అవగతం చేసిన మహనీ యుడు శ్రీమాన్ కోగంటి సీతారామచార్యులు అని ఏఎన్‌యూ నృత్య విభా గాధిపతి పి.వరప్రసాద్‌మూర్తి, విశిష్ట ప్రవచనకర్త మల్లాది వెంకట రామనాథ శర్మ కొనియాడారు. బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వర స్వామి దేవ స్థానం, అన్నమయ్య కళావేదికపై జరుగుతున్న కోగంటి సీతా రామచార్యుల శత జయంతి ఉత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమాలను దేవస్థానం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య ప్రారంభించారు. భాగవతం భ్రమర గీతాల గురించి వెంకట రామనాథ శర్మ అనుగ్రహ భాషణం చేశారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరుసిటీ, వల్లూరి వారితోట 5వ లైను, బొమ్మరిల్లు అపార్ట్‌మెంటు, ఫ్లాట్ నెం.3ఎ కాపురస్తుడు కూళ్ళ నాగయ్య గారి కుమారుడు మాల్యాద్రి గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నా క్లయింటుకు చెందిన పార్టీషన్ దస్తావేజు నెం.3618/2010 ది.04-09-2010 యస్.ఆర్.ఓ. పెదకాకాని మరియు దఖలు దస్తావేజు నెం.2724/2005 ది.30-05-2005 యస్.ఆర్.ఓ. పెదకాకాని గల దస్తావేజులను జిరాక్స్ నిమిత్తం ది.02-12-2025న అరండల్‌పేట 9వ లైను నందు జిరాక్స్ తీయించుకొని మరళా ఇంటికి వెళ్ళు క్రమంలో చూసుకొనగా సదరు పై తెలిపిన రెండు ఒరిజినల్ దస్తావేజులు కనిపించలేదు. సదరు దస్తావేజులు కొరకు ఆ చుట్టుప్రక్కల ఎంత విచారించిననూ, వెతికిననూ నేటి వరకు దొరికియుండలేదు. కావున సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికినయెడల నాకు గాని, నాక్లయింటుకు గాని అందజేసినవారికి తగుపారితోషికం ఇవ్వబడును.

గుత్తా వి.ఆర్. లా అసోషియేట్స్,
జిల్లా కోర్టు ఎదురు, గుంటూరు, సెల్: 9177646766

ఐక్య క్రిస్మస్ వేడుకలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), డిసెం బరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీ కళాశాల ప్రాంగణంలో శనివారం సాయంత్రం నిర్వహిస్తున్న ఐక్య క్రిస్మస్‌ను జయప్రదం చేయాలని యునైటెడ్ క్రిస్టియన్ ఫోరమ్ చైర్మన్, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యానీ పిలుపునిచ్చారు. ఏసీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.మోజేష్, వైస్ ప్రిన్సిపాల్ జోసెఫ్, రాజశేకర్, జీవన్, మేడిద బాబురావు, బెంజిమన్ పాల్గొన్నారు.


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులు తెలుసుకోవాలి

● పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(విద్య), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేందుకు వారధిగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ దోహదం చేస్తోందని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కొత్త పేటలోని కాసు సాయమ్మ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల జూని యర్ కళాశాలలో జరిగిన వేరువేరు మెగా పేరెంట్స్ మీటింగుల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. నసీర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన మహోన్నత కార్యక్రమం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ అని కొని యాడారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొ రేషన్ డైరెక్టర్ తిరువలూరి పద్మావతి, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ సమత, కొనకళ్ళ సత్యం, పోతురాజు చంద్రశేఖర్, వెంకట్ కొత్తూరి, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, శనక్కాయల రాజకుమారి, డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ ఖుద్దూస్, మండవ శ్రీనివాస్, భార్గవ్, విజయ్ గుప్తా, ఎంఈవో ఖుద్దూస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే మార్గదర్శకులు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు(విద్య) డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయు లు తల్లిదండ్రులే మార్గదర్శకులు కావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు. శుక్ర వారం ఏటి అగ్రహారంలోని ఎస్‌కేబీఎం పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎం 3.0లో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి హెచ్ఎం ఖాజావలి అధ్యక్షత వహించారు ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ తల్లిదండ్రుల అభిప్రాయాలు అత్యంత విలువైనవని, పిల్లల పర్యవేక్షణ ఇంటి నుంచే ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అడకా పద్మావతి, తుమ్మల నాగేశ్వరరావు, అడక శ్రీను, గొర్ల మల్లేశ్వరి, దాసరి వెంకటేశ్వరావు, పఠాన్ అస్మా తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎంలో విద్యార్థులతో కలెక్టర్ అప్యాయంగా..


విద్యార్థినులతో అప్యాయంగా మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒక్కో విద్యార్థిని అక్కున చేర్చుకుని చిన్నారుల చదువు, భావోద్వేగాలు, ఇతర అంశాల్లో రాణింపు వంటి అంశాలతో కూడిన సం పూర్ణ ప్రగతి నివేదికను తెలియజేయాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. గుంటూరు స్టాల్ బాలికల పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1049 పాఠశాలలతో సహా జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు జరిగాయన్నారు. ఒక తల్లిగా నా బిడ్డల ప్రగతి తెలుసుకొనేందుకు వచ్చాను.. చిన్నారులతో కలవడం సంతోషంగా ఉందన్నారు. సాధికారిత సాధించే వరకు బాల్య వివాహాలు వద్దు అని కలెక్టర్ ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పీ ప్రసూన, డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో అధికారి ఎస్.ఎం.ఎం అబ్దుల్ ఖుద్దూస్, నాగేంద్రమ్మ, ప్రధాన ఉపాధ్యాయులు ఆనంద కుమారి, తహసీల్దార్ సుభాని పాల్గొన్నారు.

విద్యారంగంలో సంస్కరణలకు కూటమి కృషి : మన్నవ


ప్రతిజ్ఞ చేస్తున్న మన్నవ మోహన కృష్ణ, ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గదర్శకంగా నిలవాలని, విద్యారంగంలో సంస్కరణలకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక స్తంభాలగరువులోని చేబ్రోలు పుల్లయ్య, మహాలక్ష్మి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌కి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విస్తృతమైన సంస్క రణలను అమలు చేస్తూ భావితరాల భవిష్యత్తుకు కృషి చేస్తున్నారని అన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసమే మెగా పీటీఎం : డేగల


మాట్లాడుతున్న డేగల ప్రభాకర్

గుంటూరు(విద్య), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు కోసమే ప్రభు త్వం మెగా పీటీఎం నిర్వహిస్తుందని ఏపీ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. కొత్తపేటలోని జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పీటీఎంలో ఆయన పాల్గొన్నారు. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పరిచయాలు బాగుంటే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని అందుకే తల్లిదండ్రులకు ఎన్ని పనులు ఉన్నా పాఠశాలకు వెళ్లి పిల్లలు గురించి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

బృహత్తర కార్యక్రమం మెగా పీటీఎం

● ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ని ఉన్నత విద్యా ప్రమాణాలకు కేంద్ర బిందువుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమం మెగా పీటీఎం అని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. రూరల్ మండలం, జొన్నలగడ్డలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, మంత్రి నారా లోకేశ్‌కి దక్కుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో ఎమ్ఈవో ఖుద్దుస్, టీడీపీ మండల అధ్యక్షుడు ఇమ్మడి మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మాదిరిగా పేస్కేలు అమలు చేయాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాదిరిగానే ఏపీ లో పే స్కేలు అమలు చేయా లని గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ) సంఘం (సీఐ టీయూ) జిల్లా గౌరవ అధ్యక్షు డు బి.లక్ష్మణ రావు కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్వో ఖాజావలికి విన తిపత్రం అందజేశారు. అనం తరం లక్ష్మణ రావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా వీఆర్ఏల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంతగాని జైపాల్, బొక్క సాంబశివరావు, నామతోటి రామారావు, కారుసాల ప్రభుదాసు, సుభాని, పేరయ్య, వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

లౌకిక, ప్రజాస్వామిక శక్తుల ఐక్యతకు కృషి : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు లౌకిక, ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తుల మధ్య విశాల ఐక్యత నిర్మించేందుకు సీపీఐ పాటుపడుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా సమితి ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్థానిక మల్లయ్య లింగం భవన్లో జరుగుతున్న వర్క్‌షాప్ శుక్రవా రంతో ముగిసింది. రెండో రోజు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించగా, పార్టీ జాతీయ, రాష్ట్ర మహాసభల నిర్ణయాలు, పార్టీ కర్తవ్యాలపై ముప్పాళ్ల ప్రసంగించారు. ప్రొఫెసర్ రాజశేఖర్ భారతీయ సమాజం - మను వాదం - మార్క్సిజం అనే అంశంపై ప్రసంగించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి జిల్లా అభివృద్ధికి ఉన్న అవకాశాలు-సీపీఐ పాత్ర అనే అంశం పై మాట్లాడారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి అకిటి అరుణ్‌కుమార్ తదిత రులు పాల్గొన్నారు.

8 నుంచి శ్రీరామకోటి మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్, శ్రీ రామనామక్షేత్రంలో ఈ నెల 8 నుంచి 12వ తేదీవరకు శ్రీరామకోటి మహో త్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వాహకులు రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

వైద్య విద్యార్థుల ఆశలను వమ్ము చేసిన కూటమి ప్రభుత్వం

● మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన 5 వైద్య కళాశాలలకు నేషనల్ మెడికల్ కమిషన్ కేటాయించిన 60 పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లను ప్రతిభ ఆధారంగా కాకుండా ప్రభుత్వమే అమ్మకానికి పెట్టడం విద్యార్థుల ఆశలను వమ్ము చేయడమేనని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్లో జరిగిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు చేశారు. ఈ సందర్భంగా ఆలా వెంకటేశ్వర్లు ప్రసం గిస్తూ గత ప్రభుత్వం అమలు చేసిన 107, 108 జీ.వో.లను నాడు వ్యతిరేకించిన చంద్రబాబునాయుడు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌లు నేడు వాటిని రద్దు చేయక పోగా గతంలోనే ప్రారంభమైన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలకు కేటాయించిన పీజీ సీట్లను అమ్మకానికి పెట్టడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్లు కొరివి వినయ్‌కుమార్, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డిలు ప్రసంగిస్తూ పీపీపీ విధానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీలను, విద్యార్థి యువజన సంఘాలను, సామాజిక, పౌరసంఘాలను ఆహ్వా నించి ఈనెల 21వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడ నగరంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.


సీడీని ఆవిష్కరిస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాదు, బుర్రా సాయిమాధవ్ తదితరులు

తెలుగు నాటక వైభవాన్ని భావితరాలకు అందించాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలుగు నాటకం వైభవాన్ని భావి తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాదు అన్నారు. లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక కేంద్రంలో శుక్రవారం అజోవిభొ కందాళం ఫౌండేషన్ సహకారంతో కందిమళ్ల సాంబశివరావు రూపకల్పన చేసిన ఆలనాటి నాటక ప్రస్థానం సీడీ లోగో ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆలపాటి రాజేంద్రప్రసాదు మాట్లాడుతూ దాదాపు 85 మంది తెలుగు నాటక రంగ ప్రముఖులకు సంబంధించిన దృశ్య, శ్రవ్య అంశాలను సేకరించి పది గంటల నిడివితో ఈ కళారూపాన్ని సృష్టించిన కందిమళ్ల సాంబశివరావు అభినందనీయులన్నారు. అనంతరం సినీ రచయిత డాక్టర్ బుర్రా సాయి మాధవ్ ప్రసంగించారు. అప్పాజోస్యుల సత్యనారాయణ, తానా మాజీ అధ్యక్షుడు తోటకూరి ప్రసాదు, తూర్లపాటి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

● జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ పురస్కరించుకొని పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించిన అధికారులు, సిబ్బంది తమ సమస్యలు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మహిళ మెడలో గొలుసు తెంచుకెళ్లిన వ్యక్తికి ఏడాది జైలు

మహిళ మెడలో నాలుగు లక్షల ఖరీదైన బంగారపు చైను స్నాచింగ్ చేసిన కేసులో నిందితుడైన షేక్ అమీర్ బేగ్ అలియాస్ జోహార్ కి ఏడాది జైలు శిక్ష విధించారు.. 2024 అక్టోబరు 3న పాత గుంటూరు మెయిన్‌రోడ్డులో గుడివాడ ద్రౌపది అనే వృద్ధురాలు మెడలో చైన్ తెంచుకువెళ్లిన కేసులో షేక్ అమీర్ బేగ్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. కేసు విచారణ అనంతరం ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ నిందితునికి ఏడాది జైలు శిక్ష విధించారు.

మోటార్ బైక్ చోరీ కేసులో....

ఆర్టీసీ బస్టాండ్లో మోటార్ బైక్ అపహరించిన కేసులో నిందితుడైన షేక్ ఆసిర్‌కి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. మల్లంకి కిషోర్ తన ద్విచక్ర వాహనాన్ని జూలై 15న రాత్రి ఆర్టీసీ బస్టాండ్లో పార్క్ చేశారు. తెల్లవారుజామున చూడగా బైక్ కనిపించలేదు. పాతగుంటూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఐ వెంకటప్రసాద్ కేసు దర్యాప్తు చేయగా ఆరవకు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ నిందితుడు ఆసిర్‌కు ఏడాది జైలు శిక్ష విధించారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజక వర్గంలోని నేతాజీ నగర్, ఎస్‌వీఎన్ కాలనీ, విద్యానగర్, వికాస్‌నగర్, ముత్యాలరెడ్డి నగర్‌లలో రూ.3.50 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ డ్రెయిన్లు, సీసీరోడ్లు, కల్వర్టుల నిర్మాణ పను లకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ, మురుగు సమస్యలతో బాధపడుతున్న ప్రజల ఇబ్బందులను గమనించి కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శివరామ్ ప్రసాద్ విజ్ఞప్తి మేరకు అంచనాలు సిద్ధం చేసి అభివృద్ధి పనులకు ఆమోదం పొందినట్లు చెప్పారు. కార్యక్ర మంలో డివిజన్ నేతలు పాల్గొన్నారు.

చట్టసభల్లో ఓబీసీ రిజర్వేషన్లకు కట్టుబడిన టీడీపీ

చట్ట సభల్లో ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించటంపై టీడీపీ కట్టుబడి ఉందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వే షన్ కల్పించాలని, ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15, 16వ తేదీల్లో బీసీలు చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను ఎమ్మెల్యే తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓబీసీ యువ జన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొణిదే గోపీకృష్ణ, నాయకులు పరుచూరి సంజీవరావు, రాచకొండ లక్ష్మయ్య, కే.కిరణ్‌కుమార్, ఓబీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు అంకమ్మ, నగర కార్యదర్శి చల్ల శిరీష, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన ఔషధాల తయారీపై పరిశోధనలు చేయాలి

● జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి వెల్లడి

గుంటూరు(మెడికల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సల్లో ప్రభావవంతమైన నూతన ఔషధాల రూపకల్పనపై పరిశోధనలు చేయాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్‌వీ సుందరాచారి ఉద్బోధించారు. గుంటూరు వైద్య కళాశాల ఆడి టోరియంలో జాతీయ ఫార్మకాలజీ వైద్య సదస్సు 'నెక్స్ జెన్ ఫార్మా'ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు దేశంలో పలు ప్రాంతాలకు చెందిన ఫార్మకాలజీ వైద్యనిపుణులు హాజరయ్యారు. సదస్సుకు జీఎంసీ ఫార్మకాలజీ విభాగాధిపతి సాల్మన్‌రాజు అధ్యక్షత వహించారు. భవిష్యత్తులో జీనోమిక్స్ ప్రవేశంతో వ్యక్తిగత వైద్య చికిత్సల్లో పెనుమార్పులు సంభవిస్తాయని డాక్టర్ సుందరాచారి అభిప్రాయం వ్యక్తం చేశారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ సమస్య కట్టడిపై అందరూ దృష్టి సారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, ఫార్మకాలజీ విశ్రాంత విభాగాధిపతి డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు అన్నారు. స్థానిక లాడ్జి సెంటర్లో బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర వారి పుస్తక ప్రదర్శనను శుక్రవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, బుక్‌హౌస్ మేనే జర్ శ్రీనివాస్, పీఎల్ నరసింహారావు, పాలకాయల వెంకట్, న్యాయవాది సంజీవరెడ్డి, సముద్రాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

11న మండల పరిషత్‌లలో ఎన్నికల సందడి

గుంటూరు సిటీ, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండల పరిషత్‌లలో ఖాళీగా ఉన్న పదవులకు 11న ఎన్నికలు జరగనున్నాయి. పల్నాడు జిల్లా మాచవరం ఎంపీపీ, రాజుపాలెం మండల కో-ఆప్షన్ మెంబర్, బాపట్ల జిల్లా వేమూరు మండల పరిషత్ కో-ఆప్షన్ మెంబర్, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పదవి ఖాళీగా ఉన్నాయి. ఆయా పదవులకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులను నియమించారు.

ఎల్వీఆర్ క్లబ్బులో ఎన్నికల కోలాహలం

● 18 పదవులకు 108 నామినేషన్లు ● ఈ నెల 14న ఎన్నికలు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్లో ప్రతి రెండేళ్లకు ఒకసారి పాలకవర్గం నియామకానికి సంబంధించి జరిగే ఎన్నికలకు ఈ దఫా రసవత్తర పోరు తప్పదని భావిస్తున్నారు. క్లబ్ పాలకవర్గానికి 18 పదవులు ఉండగా 108 నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం సాయంత్రంతో నామినేషన్ల దాఖలుకు గడువు పూర్తయింది. ఈనెల 14న ఎన్నికలు జరుగుతున్నాయి. ఈనెల 7న ఉపసంహరణల అనంతరం తుది జాబితా ప్రకటించనున్నారు. ఈసారి ఏకగ్రీవానికి అవకాశం లేదని తెలుస్తోంది. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన ఇరువురు ప్రజాప్రతినిధులు తమ వర్గీయులను రంగంలోకి దించారు. ఇందుకోసం కసరత్తు చేస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేసింది. ఈ దఫా పోరు రసవత్తరంగా ఉంటుందని భావిస్తున్నారు. శనివారం క్లబ్‌లో పెద్దలు సమావేశమై రాజీకి ప్రయత్నం చేయనున్నట్లు సమాచారం.

అతడు... అయ్యాడు ఆమె

స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో ఉంటూ డిగ్రీ చదువుతున్న యువకుడు ఆమెగా మారిపోయాడు. కారంపూడికి చెందిన ఆ యువకుడు (19) చిన్నప్పటి నుంచి జీన్స్ ప్రభావం కారణంగా ట్రాన్స్ జెండర్ లక్షణాలతో ఉన్నాడు. అయితే సాంఘిక సంక్షేమ హాస్టల్ నుంచి ఇటీవల కారంపూడిలోని ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇదిలాఉంటే ఆమెగా మారిన ఆ యువకుడు చీర ధరించి మహిళ వేషంలో శుక్రవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. పోలీసులు ఆ యువకుడి తల్లిదండ్రులను పిలిపించారు. స్టేషన్‌కు వచ్చిన తల్లిదండ్రులు ఆమెగా మారిన తమ కుమారుడిని చూసి షాక్ కు గురయ్యారు. చీర ధరించి ఉండటంతో తలదించుకుని రోధిస్తూ వెళ్లిపోయారు. దీంతో పోలీసులు సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్‌ను పిలిపించి ఆ యువకుడిని వారికి అప్పగించారు. హాస్టల్ వార్డెన్ శనివారం ఆ యువకుడిని కారంపూడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లనున్నారు. అక్కడ పోలీసులు మిస్సింగ్ కేసు క్లోజ్ చేసిన అనంతరం యువకుడు మేజర్ కావడంతో అతను ఇష్ట ప్రకారం ఎక్కడికి వెళ్లాలనుకుంటే అక్కడకు పంపనున్నారు.

ఆమెరికాలో గుంటూరు అందం

● మిసెస్ తెలుగు యూఎస్ఏ-2026కు దొప్పలపూడి వినీల ఎంపిక



దొప్పలపూడి వినీల

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమెరికా తెలుగు అందాల పోటీల్లో గుంటూరు సౌందర్యం ప్రతిభ చాటింది. యూఎస్ఏ తెలుగు జాతీయ స్థాయి సౌందర్య పోటీల సంస్థ.. 2026 మిస్, మిసెస్ తెలుగు యూఎస్ఏ పోటీలకి సర్వ సన్నద్ధమైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు మహిళా మణులకు ఎంతో ఆసక్తి కలిగించే ఈ పోటీల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పాటుగా ఇతర దేశాల్లోని వారూ పాల్గొంటారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలకు అమెరికా అంతటా జరిగిన ఎంపిక ప్రక్రియలో 22 మంది ఫైనల్ లిస్ట్ అయ్యారు. వీరిలో గుంటూరు మహిళ దొప్పలపూడి వినీల స్థానం దక్కించుకున్నారు. వినీల స్వగ్రామం తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురం. ఆమె కుటుంబ సభ్యులు ప్రస్తుతం గుంటూరులో స్థిరపడ్డారు. దొప్పలపూడి వినీలకు మిసెస్ తెలుగు యుఎస్ఏ-2026లో స్థానం లభించడంతో.. మహిళా సౌందర్యంలోనూ 'గుంటూరు' పేరు చాటిన వినీలను ప్రవాసాంధ్రులు, పుర ప్రముఖులు అభినందిస్తున్నారు. దొప్పలపూడి వినీల అంజమ్మ, నరసింహారావు దంపతులకు జన్మించారు. గుంటూరులో పుట్టి పెరిగి, చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 2016లో అమెరికా వలస వెళ్లి, ప్రస్తుతం బీఐ డెవలపర్‌గా పనిచేస్తున్నారు. వినీల అమెరికాలో వివిధ స్థానిక సౌందర్య పోటీలలో పాల్గొని విజయాలు సాధించారు. ఆమె ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో ప్రతిభ కనబరిచారు. వినీల మరిన్ని విజయాలు సాధించాలని కుటుంబ సభ్యులు అభిలాషిస్తున్నారు.

గిరిజన ప్రపంచం ఉద్భవం

● ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చిన్నారుల ప్రదర్శనలతో ఆవిష్కృతం

● ఘనంగా ముగిసిన ఉద్భవ్- 2025 వేడుకలు

● బహుమతుల ప్రదానోత్సవంలో రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, దుర్గేష్, డీబీవీ స్వామి


బహుమతులు అందుకుంటున్న తెలంగాణ విద్యార్థులు


బహుమతులు అందుకుంటున్న ఒడిస్సా విద్యార్థులు


బహుమతులు అందుకుంటున్న త్రిపుర విద్యార్థులు

తాడేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మరో అద్భుతమైన వేడుక ఆంధ్రప్రదేశ్‌లో ముగిసింది. గిరిజన విద్యార్థుల ఆట పాటలు, వారి సంస్కృతి, సాంప్రదాయాలు ఒకే వేదికపై కనువిందు చేశాయి. అడవి బిడ్డల్లో దాగిన ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు కేఎల్ యూనివర్సిటీ వేదికగా గత బుధవారం కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరమ్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఉద్భవ్ 2025 వేడుకలు శుక్రవారం ముగిశాయి. జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఇఎంఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలు ఏపిలో తొలిసారిగా నిర్వహించారు. 22 రాష్ట్రాల నుంచి 1647 మంది విద్యార్థులు.. ఏపీలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఎంపికైన 110 మంది తమ ప్రతిభను చాటారు. ఆఖరి రోజు బహుమతి ప్రదానం కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, కందుల దుర్గేష్, బాల వీరాంజనేయస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి విచ్చేసిన గిరిజన విద్యార్థులు తమ రాష్ట్ర ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన ప్రదర్శలు అలరించాయి. కేరళ నుంచి వ్యవసాయ కార్యక్రమాల సమయంలో నిర్వహించే కళారూపం ఎన్నవనట్, బిహార్ నుంచి విద్యార్థినులు దీపావళి నృత్యం జుమ్మర్, గుజరాత్ గిరిజన నృత్యం మాల్డా, తెలంగాణ సాంప్రదాయ లంబాడి జానపద పాటలు, నృత్యాలు.. నేపాల్ తార్ గిరిజన పాటలు, త్రిపుర రియాంగ్ గిరిజన సమాజం నుంచి ఉద్భవించిన హోజాగిరి తదితర నృత్యాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ, ఒడిశా, త్రిపుర విద్యార్థులు అత్యధికంగా బహుమతులు సాధించారు. మొత్తం 49 విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా తెలంగాణ నిలిచింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున నాయక్, ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, రంపచోడవరం ఐటీడీఏ పీడీ స్మరణ్‌రాజ్, కేఎల్‌యూ ప్రోవీసీ వెంకటరామ్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ఆరంభమే ఉద్భవ్

● కందుల దుర్గేష్, మంత్రి, టూరిజం, సినిమాటోగ్రఫీ

గిరిజన చిన్నారుల నైపుణ్యాలను ప్రోత్సహించి, వారిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఉద్భవ్ 2025 వేదికైంది. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమానికి ఏపీ వేదిక కావడం గర్వించే విషయం. సరికొత్త ఆరంభమే ఉద్భవ్ అన్న మాటకు అర్థం. అడవిలో పుట్టి పెరిగిన వారు సైతం అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి. పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశంలో ఇలాంటి గొప్ప వేడుక జరుపుకోవడం గర్వించదగ్గ అంశం.

ఉద్భవ్ ఓ అద్భుత ఈవెంట్

● గుమ్మడి సంధ్యారాణి, మంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ

భిన్న సంస్కృతులు, విభిన్న సాంప్రదాయాలున్న మనమంతా ఒక్కటే. ఆదివాసీలు ఎవరికీ తక్కువ కాదని నిరూపించేలా జరిగిన ఉద్భవ్-2025 ఓ అద్భుత ఈవెంట్. స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా లాంటి వారు ఆదర్శం. యోగాలో 108 సార్లు సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించింది ఆదివాసీలే. అరకు కాఫీని లక్షల ఎకరాల్లో పండించి.. అంతర్జాతీయ ఖ్యాతి పొందింది గిరిజనుల కృషితోనే. గిరిజన విద్యార్థుల్లో కళా నైపుణ్యాలు వెలికి తీసి వారికి ఉన్నతస్థాయి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సమగ్రతకు, ఐక్యతకు నిదర్శనం

● డీబీవీ స్వామి, మంత్రి, సాంఘిక సంక్షేమం

ఉద్భవ్‌కు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇవ్వడం చాలా గర్వంగా ఉంది. 22 రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరుకావడం జాతీయ సమగ్రతకు, ఐక్యతకు నిద్శనం. ఈ వేడుకల ద్వారా లభించిన విశ్వాసాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. వేదికపై నిలబడినప్పుడే గిరిపుత్రులు విజేతలయ్యారు. యువభారతం మీ కోసం ఎప్పుడూ ఎదురు చూస్తుంది.


విద్యార్థులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నాటి నాసిరకం వైన్‌ం మారింది!

● ప్రస్తుతం క్వాలిటీ, బ్రాండ్ల విషయంలో మెరుగ్గా మద్యం దుకాణాలు

● ప్రైవేట్ దుకాణాల్లో పెరిగిన విక్రయాలు, అధునాతన సౌకర్యాలు

● వైసీపీ జమానాలో నాసిరకం మద్యం అమ్మకాలు

● క్యాష్ ఇస్తేనే..మద్యం డిజిటల్ పేమెంట్లకు నో..

● బార్ల యజమానులతో ప్రభుత్వ వైన్ షాపుల సిబ్బంది కుమ్మక్కు..

● కావాల్సిన బ్రాండ్లకు బార్లకు వెళ్లాల్సిందే..







నాడు వైసీపీ హయాంలో ప్రభుత్వ వైన్ షాపుల దుస్థితి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల్లో కాలానుగుణంగా అనేక మార్పులు వస్తున్నాయి. వైసీపీ హయాంలో మద్యం షాపులలో కోరిన బ్రాండ్ దొరికేది కాదు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ మద్యం దొరుకుతుంది. గతంలో కేవలం నగదుకు మాత్రమే అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు మద్యం షాపుల వద్ద అన్ని రకాల డిజిటల్ పేమెంట్లు ఉన్నాయి. 2023 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాల్లో అప్పటి ప్రభుత్వ దుకాణాల్లో జరిగిన అమ్మకాలకు.. కూటమి ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు త్రైమాసికానికి ప్రైవేటు మద్యం దుకాణాల అమ్మకాలను బేరీజు వేస్తే ఎంతో వ్యత్యాసం ఉంది. 2023లో గుంటూరు జిల్లాలో రూ.251.30 కోట్ల అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది అదే మూడు నెలల్లో రూ.325.98 కోట్ల అమ్మకాలు జరిగాయి. దీని ప్రకారం అప్పటి కంటే ఇప్పుడు సుమారు రూ.74 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. అదే విధంగా పల్నాడు జిల్లాలో 2023లో రూ. 214.90 కోట్ల అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాది రూ. 251.30 కోట్ల విక్రయాలు జరిగాయి. సుమారుగా రూ. 36 కోట్లకు పైగా అమ్మకాలు పెరిగాయి. దీనికి ప్రధాన కారణం గతంలో ప్రభుత్వ వైన్ షాపుల నిర్వాహకులతో అప్పటి బార్ యజమానులు కుమ్మక్కయ్యేవారు. ఆ బార్లు ఎక్కువ శాతం వైసీపీ నేతల ఆధ్వర్యంలో ఉండేవి. దీంతో ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాలు అంతగా జరిగేవి కాదు. సమయం ప్రకారం షాపులను తెరిచి మూసేసేవారు. అంతే కాకుండా కోరుకున్న మద్యం కూడా దొరికేది కాదు. దీంతో అప్పట్లో మద్యం బాబులంతా బార్ల వైపు చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైన్స్, బార్లు మొత్తం ప్రైవేట్ పరం చేయడంతో పోటీ పెరిగి మద్యం బాబులకు అన్ని రకాల బ్రాండ్లు విస్తారంగా దొరుకుతున్నాయి.

● నేడు అధునాతనంగా

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం ప్రైవేటు వైన్ షాపులు కొత్త హంగులతో మెరిసిపోతున్నాయి. వైసీపీ హయాంలో వైన్ షాపులు పాడుబడిన షాపుల్లో, ఇనుప గ్రిల్స్ మాటున అమ్మకాలు జరిగేవి. మధ్య తరగతి మద్యంబాబులు సైతం అక్కడికి వెళ్లి క్యూ లైన్‌లలో నిలబడి కొనుగోలు చేయాలంటే సిగ్గుపడే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం మద్యం టెండర్లు నిర్వహించి బార్లు, వైన్ షాపులు కేటాయించింది. వైన్ దుకాణాల మధ్య పోటీ తత్వంతో అధునాతన హంగులతో మాల్స్‌ను తలపించేలా వైన్ షాపులు గుంటూరులో వెలిశాయి. వైన్ షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లు కూడా అనుమతి ఇచ్చారు. బార్లలో కూడా అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. కొత్త మోడల్స్‌లో బార్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.. దీంతో మందు బాబులు బార్లకు వెళ్లి హాయిగా మద్యాన్ని పుచ్చుకుంటున్నారు.

● అప్పుడు ఓన్లీ క్యాష్


కూటమి ప్రభుత్వంలో అధునాతన హంగులతో వెలసిన వైన్ షాపులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైన్ షాపులు నిర్వహించి వాటిల్లో కేవలం నగదుకు మాత్రమే మద్యం అమ్మకాలు జరిపించారు. దీంతో మందు బాబులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. సకాలంలో షాపులు తీయకుండా, బ్రాండ్లు అందుబాటులో లేకుండా నాసి రకం (జే బ్రాండ్) మద్యం అమ్మకాలు జరిపించారు. పరోక్షంగా బార్ల నిర్వాహకులకు భారీగా లాభం చేకూరే విధంగా ప్రభుత్వ వైన్ షాపుల నిర్వాహకులు సహకరించారు. ఈ క్రమంలో భారీ మొత్తంలో అక్రమాలు జరగటం, అనేక చోట్ల వైన్ షాపుల్లో పనిచేసే వర్కర్స్ చోరీలకు పాల్పడటం జరిగింది. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన డబ్బు అంతా జగన్ ఇలాకాకు చేరింది. క్యాష్ అమ్మకాలలో కూడా భారీగా అవకతవకలు జరిగాయి. అప్పటి అధికార పార్టీ పెద్దలు, అధికారులు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. నేడు ఆ విధానానికి స్వస్తి పలికి కూటమి ప్రభుత్వం అన్ని రకాల డిజిటల్ పేమెంట్స్ ద్వారా మద్యం కొనుగోలుకు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకుంది. క్రెడిట్ కార్డులను కూడా అనుమతిస్తుండటంతో ఉద్యోగులకు మరింత సౌలభ్యంగా ఉంది. అప్పట్లో కోరుకున్న మద్యం తాగాలంటే బార్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది, నేడు ఆ పరిస్థితి లేదు అన్ని రకాల బ్రాండ్లన్నీ వైన్ షాపులలో దొరుకుతున్నాయి.

షిర్డికి మరో రెగ్యులర్ వీక్లీ రైలు



గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా వారంలో ఒక రోజు షిర్డికి రెగ్యులర్ రైలుని నడిపేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. తిరుపతి నుంచి ఈ రైలు ప్రతీ ఆదివారం షిర్డికి బయలుదేరుతుంది. అలానే షిర్డి నుంచి ప్రతీ సోమవారం తిరుపతికి ప్రయాణమవుతుంది. తిరుపతి - సాయినగర్ షిర్డి రైలుకు నంబరు. 17425ని కేటాయించగా సాయినగర్ షిర్డి - తిరుపతి రైలుకు నంబరు 17426గా నిర్ణయించింది. ఈ నెల 14వ తేదీ నుంచి ప్రతి ఆదివారం 17425 తిరుపతి - సాయినగర్ షిర్డి రైలు వేకువజామున 4.23కి బయలుదేరుతుంది. ఈ రైలు ఉదయం 8.48కి చీరాల, 9.53కి తెనాలి, 10.40కి గుంటూరు, 11.49కి సత్తెనపల్లి, 12.19కి పిడుగురాళ్ల, 12.39కి నడికుడి, మధ్యాహ్నం 3.50కి సికింద్రాబాద్, సాయంత్రం 4.48కి లింగంపల్లి, అర్ధరాత్రి దాటాక 12.30కి పర్లి వైజ్‌నాథ్, సోమవారం వేకువజామున 6.15కి ఛత్రపతి శంబాజీనగర్, 7.55కి నాగర్‌సోల్, 9.50కి మన్మాడ్, 10.45కి సాయినగర్ షిర్డి చేరుకొంటుంది.

17426 సాయినగర్ షిర్డి - తిరుపతి రైలు ఈ నెల 15 నుంచి ప్రతి సోమవారం రాత్రి 7.35కి బయలుదేరి మంగళవారం వేకువజామున 4 గంటలకు పర్లీ వైజ్‌నాథ్, ఉదయం 11.10కి సికింద్రాబాద్, మధ్యాహ్నం 2.29కి నడికుడి, 3.01కి పిడుగురాళ్ల, 3.39కి సత్తెనపల్లి, సాయంత్రం 5.10కి గుంటూరు, 6.28కి తెనాలి, రాత్రి 7.23కి చీరాల, అర్ధరాత్రి దాటాక 1.30(బుధవారం)కు తిరుపతి చేరుకొంటుంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా రైలు ప్రయాణికులకు ఆదివారం షిర్డికి, మంగళవారం తిరుపతికి రైలు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఈ రైళ్లలో ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ బోగీలుంటాయి.

9, 10 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

ఈ నెల 9న నంబరు 07425 తిరుపతి - సాయినగర్ షిర్డి ప్రత్యేక రైలు ఉదయం 11.10కి బయలుదేరి సాయంత్రం 5.50కి గుంటూరు, 6.58కి సత్తెనపల్లి, రాత్రి 7.58కి పిడుగురాళ్ల, 8.29కి నడికుడి, అర్ధరాత్రి దాటాక 12.30కి సికింద్రాబాద్, మరుసటి రోజు సాయంత్రం 6.35కి సాయినగర్ షిర్డి చేరుకొంటుంది. 07426 సాయినగర్ షిర్డి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 10న బుధవారం రాత్రి 10.20కి బయలుదేరి గురువారం సాయంత్రం 4.25కి సికింద్రాబాద్, రాత్రి 7.34కి నడికుడి, 7.59కి పిడుగురాళ్ల, 8.29కి సత్తెనపల్లి, 9.15కి గుంటూరు, శుక్రవారం ఉదయం 8.30కి తిరుపతి చేరుకొంటుంది. రెగ్యులర్, ప్రత్యేక రైళ్ల కారణంగా 07637 తిరుపతి - సాయినగర్ షిర్డి ప్రత్యేక రైలు ఈ నెల 14, 21, 28, 07638 సాయినగర్ షిర్డి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 15, 22, 29 తేదీల్లో రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు.

1 నుంచి కొండవీడు ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టిక మార్పు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వారంలో మూడు రోజుల పాటు గుంటూరు మీదగా ప్రయాణించే 17212 యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికని జనవరి ఒకటి నుంచి మార్పు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ రైలు ప్రస్తుతం యశ్వంత్‌పూర్‌లో మధ్యాహ్నం 1.15కి బయలుదేరుతుంది. జనవరి ఒకటో తేదీ నుంచి మధ్యాహ్నం 12.45కే బయలుదేరి నరసరావుపేటకు అర్ధరాత్రి దాటాక 12.24కి, గుంటూరుకు ఒంటిగంటకు వస్తుంది. అనంతరం విజయవాడ, గుడివాడ మీదుగా వేకువజామున 5.15 గంటలకే మచిలీపట్నం చేరుకుంటుంది. దాదాపుగా 1.45 గంటల ప్రయాణ సమయాన్ని రైల్వే శాఖ తగ్గించిందని సీపీఆర్‌వో తెలిపారు.

బీటెక్ విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు

(5వ పేజీ తరువాయి)

నాగరాజలకు ఒక్కగానొక్క కుమారుడైన వాసు మృతితో వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. మహేష్‌బాబు తండ్రి తాపీమేస్త్రీగా పనులు చేస్తూ కుమారుడు మహేష్‌బాబును ఇంజనీరింగ్ చదవిస్తున్నారు. కాగా తల్లి గృహిణి. మహేష్ మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

ఆ కారు ఎవరిది?

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలో కుప్పగంజి వాగు సమీపంలో జరిగిన రోడ్డు ఘోర ప్రమాదానికి ఓ కారు కారణమని తెలుస్తోంది. ఘటనకు సంబంధించి సీసీ పుటేజ్‌లు శుక్రవారం వెలుగుచూశాయి. ముందు వెళ్తున్న ఓ కారు ఆగగా ట్రాక్టర్లను తరలిస్తున్న కంటైనర్ స్లో అవుతున్న సమయంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదం తర్వాత కంటైనర్ ముందున్న కారు వెళ్లిపోయింది. కాగా ఆ కారు ఎవరిదనే విషయం తెలియాల్సి ఉంది.

బీపీఎస్‌కు వెనకడుగు

(5వ పేజీ తరువాయి)

ఇనిస్టిట్యూషనల్ బిల్డింగ్‌లకు వేర్వేరుగా పీనల్ చార్జీలను ప్రభుత్వం నిర్ణయించింది. అలానే అపార్టుమెంట్‌లు, కాంప్లెక్స్‌లకు కూడా వేర్వేగా చార్జీలు ఉన్నాయి.

160 దరఖాస్తులు

బేసిక్ పీనలైజేషన్ ఛార్జీలు ఆగస్టు 31వ తేదీ నాటికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విలువ ప్రకారం చదరపు గజం రూ.50 వేల కంటే ఎక్కువగా ఉంటే 100 శాతం, రూ. 25,001 నుంచి రూ. 50 వేల లోపు ఉంటే 90 శాతం, రూ. 10,001 నుంచి రూ. 25 వేల లోపు ఉంటే 80 శాతం, రూ.5001 నుంచి రూ.10 వేల మధ్యన ఉంటే 70 శాతం, రూ.1001 నుంచి రూ.5 వేల లోపు ఉంటే 60 శాతం, రూ. వెయ్యి లోపు ఉంటే 50 శాతం చెల్లించాలి. ఎవరికైతే భూమి విలువ డాక్యుమెంట్‌లో తక్కువగా ఉంటుందో వారికి కొంత ఉపశమనంగా ఈ చార్జీలు ఉన్నాయి. అయితే ఎటొచ్చి 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని దీనికి లింకు చేయడంతోనే స్పందన కరువైంది. ఇప్పటి వరకు కేవలం 160 దరఖాస్తులు మాత్రమే అందాయంటే స్పందన ఎంత తక్కువ స్థాయిలో ఉందో కళ్లకు కడుతున్నది. భవనాలు ఈ మధ్యన నిర్మించినవి కావు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించి అనుభవిస్తున్నవి. అన్నిరకాల పన్నులు కూడా చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని తొలగిస్తే స్పందన అనూహ్యంగా పెరిగే అవకాశం ఉన్నట్లుగా లైసెన్స్‌డ్ సర్వేయర్లు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

విద్యార్థుల్లో శక్తిని గుర్తించాలి


విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా

(5వ పేజీ తరువాయి)

సభలో ఆయన ప్రసంగించారు. స్వయం శక్తితో ఎదిగేలా విద్యార్థుల మనస్సు, ఆలోచనలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పాఠాలు చెప్పగలిగితే ఎంతోమంది అద్భుతమైన వ్యక్తులు వస్తారన్నారు. విద్యార్థుల ఆలోచనలు.. ప్రవర్తన.. వ్యక్తితం రేపటి దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. పీటీఎం విద్యారంగంలో కీలకమైన మార్పని దీని వల్ల విద్యార్థుల్లోని బలాలు.. బలహీనతలు ఏమిటినదే తల్లిదండ్రులు తెలుసుకోగలరన్నారు. అబ్దుల్‌కలాం లాంటి వారి స్ఫూర్తిగా ప్రతీ విద్యార్థి ఎదగాలన్నారు. సమాజాన్ని కదిలించే శక్తి చదువు ఇస్తుందన్నారు. మానసిక దారుఢ్యం రావాలంటే పుస్తకాలు బాగా చదవాలని విద్యార్థులకు తెలిపారు. అమెరికాలో ఉంటున్న గోరంట్ల వాసు పాఠశాలకు విరాళంగా ఇచ్చిన పరికరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సైన్స్ ప్రదర్శన జుబేదా, రిహానా, స్మృతి, రత్నకుమారి, గౌసియా అనే విద్యార్థినులను అభినందించారు.

పవన్‌తో సినిమా తీయాలనుకున్నా : పుల్లారావు

తాను రాజకీయాల్లోకి రాకముందు పవన్ కల్యాణ్‌తో సినిమా తీయాలనుకున్నానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పవన్ కోసం చిలకలూరిపేట ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూశారని ప్రస్తుతం వారి కోరిక నెరవేరిందన్నారు. సభలో పంచాయతీరాజ్ కమీషనర్ కృష్ణతేజ, ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్‌బాషా, జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, ప్రధానోపాధ్యాయురాలు రత్నభారతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణతేజ తాత పేరుతో చౌక్ అద్భుతం

పీటీఎంలో పాల్గొనేందుకు 10 నుంచి 12 ఊర్లు చెప్పారు. చిలకలూరిపేటను ఎంచుకున్నాను. అయితే మా సొంత ఊరు చిలకలూరిపేటకు వస్తున్నారని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ గురువారం రాత్రి తనకు చెప్పారని పవన్‌కల్యాణ్ చెప్పారు. కృష్ణతేజ తాత మైలవరపు గుండయ్య వందల కోట్ల విలువైన స్థలాలను నాడు ప్రజా అవసరాలకు ఇవ్వడం చాలా గొప్పగా ఉందన్నారు. ఆయన పేరుతో మైలవరపు గుండయ్య చౌక్ పేరు చూశానని, గడియార స్తంభం కనిపిస్తే అడిగితే వారు ఏవరో కాదు కృష్ణతేజ తాత అని తెలుసుకున్నానన్నారు. ఒకరి పేరుపై చౌక్ పెట్టారంటే వారెంతో సేవ చేసి ఉండాలన్నారు. తోట రాఘవయ్య తన కూతురు పేరుపై శారద స్కూల్ కోసం ఎకరం స్థలం ఇవ్వడం అభినందనయమన్నారు. గతంలో పెద్దలు విద్యాసంస్థలకు పెద్దఎత్తున స్థలాలు ఇచ్చే వారని, ఇప్పుడు ఉన్న స్థలాలను లాగేసుకుంటున్నారన్నారు.



ఆత్మీయ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా

విద్యార్థులతో మమేకం..

శారదా పాఠశాలలో జరిగిన మోగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో పాల్గొన్న పవన్‌కల్యాణ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో మమేకమయ్యారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ఎగ్జిబిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. క్రీడా సామగ్రి పరిశీలించి బేస్‌బాల్ బ్యాట్‌ను చేతపట్టి పరీక్షించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. డిజిటల్ బోర్డులను ఆసక్తిగా గమనించగా వాటి పనితీరును ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. లైబ్రరీలో బీరువాలను పరిశీలించి వాటికి సరిపడా పుస్తకాలు లేకపోవడాన్ని గుర్తించారు. పవన్ కల్యాణ్‌కు తొలుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు, కలెక్టర్ కృతికాశుక్లా, డీఈవో చంద్రకళ స్వాగతం పలికారు.

కలెక్టర్‌కు అభినందనలు

హర్యానాకు చెందిన కలెక్టర్ కృతికాశుక్లా తెలుగు మాట్లాడుతున్నారు. ఆమె మాటలు చూస్తే గుంటూరు.. విజయవాడ అనుకున్నాను. ఎక్కడో హర్యానా నుంచి వచ్చి మన మాతృభాష తెలుగు నేర్చుకుని మాట్లాడుతుంటే సంతోషంగా ఉందంటూ పవన్‌కల్యాణ్ కృతికా శుక్లాను వేదికపైనే ప్రత్యేకంగా అభినందించారు.




గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 6 డిసెంబరు 2025

మళ్లీ ధరిస్తే!

కొంతమంది విడిచిన దుస్తులను మళ్లీ మళ్లీ ధరిస్తూ ఉంటారు. ఇలా చేయడంవల్ల చర్మ వ్యాధులతోపాటు పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయిని నిపుణులు చెబుతున్నారు.

- వేసవిలోనే కాదు ఏ కాలంలోనైనా శరీరానికి కొద్దిపాటి చెమట పడుతూ ఉంటుంది. శరీరం మీద ధరించిన దుస్తులు ఈ చెమటను పీల్చుకుంటాయి. ఇలాంటి దుస్తులను మాటిమాటికీ ధరిస్తూ ఉంటే వాటి మీద ఫంగస్‌లు, బ్యాక్టీరియాలు వృద్ధి పొందుతాయి. ఈ హానికారక క్రిములు చర్మం మీద చేరి దద్దుర్లు, దురద, అలెర్జీలను కలిగిస్తాయి. కాబట్టి స్నానం చేసిన తరువాత..



శుభ్రంగా ఉతికి ఆరబెట్టిన దుస్తులను మాత్రమే ధరించాలి.
- కుటుంబ సభ్యులు కూడా.. ఒకరి దుస్తులను మరొకరు వేసుకోకపోవడమే మంచిది. దుస్తుల వల్లే అంటు వ్యాధులు, చర్మ సమస్యలు ఎక్కుగా ప్రబలుతుంటాయి.
- పట్టు బట్టలు, జీన్స్, మందపాటి ప్యాంట్లు తదితరాలను కొద్దిసేపు మాత్రమే ధరించి విడిచినట్లయితే... వాటిని గాలి తగిలేలా ఆరబెట్టి మరోసారి ధరించవచ్చు. వదులుగా ఉండే దుస్తులను కూడా మరోసారి ప్రయత్నించవచ్చు. అలాగని రెండు లేదా మూడు సార్లకు మించి వేసుకోకూడదు.
- బిగుతుగా ఉండే దుస్తులు, ఇన్నర్ వేర్‌లను మరోసారి ధరించకూడదు.
- రోజంతా ధరించి ఉన్న వాటిని, గంటసేపు మాత్రమే ధరించినప్పటికీ ఎక్కువగా చెమట పట్టిన దుస్తులను మరోసారి వేసుకోకూడదు.
- రోజువారీ ధరించే టీ షర్టులు, టాప్స్, సల్వార్స్ తదితరాలు శరీరాన్ని అంటిపెట్టుకుని ఉంటాయి. వీటిని ఒకసారి ధరించిన తరువాత ఉతకకుండా మరోసారి వేసుకోకూడదు.
- జిమ్‌కు వెళ్లేటప్పుడు, వ్యాయామం చేసేటప్పుడు ధరించిన దుస్తుల మీద అధికంగా చెమట, శరీరం నుంచి వెలువడే టాక్సిన్లు చేరి ఉంటాయి. ఈ దుస్తులను కూడా ఉతకకుండా మరోసారి ధరించకూడదు.

వంటిల్లు

పచ్చి బొప్పాయితో పసందుగా



పచ్చి బొప్పాయిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా శరీరాన్ని దృఢంగా మారుస్తాయి. దీనితో పచ్చడి, కూర, పులుసు, హల్వా, సలాడ్ లాంటివి చేసుకుని తింటూ ఉంటాం. ఇవి కాక పచ్చి బొప్పాయితో సులువుగా తయారుచేసే విభిన్న వంటకాలు మీ కోసం...

థాలీపీట్

కావాల్సిన పదార్థాలు

పచ్చి బొప్పాయి తురుం- ఒకటిన్నర కప్పులు, బియ్యప్పిండి- రెండు కప్పులు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- మూడు, జీలకర్ర- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, నూనె- తగినంత, కరివేపాకు- రెండు రెమ్మలు, నువ్వులు- అర చెంచా, ఉప్పు- ఒక చెంచా, అల్లం తురుం- ఒక చెంచా, పచ్చి కొబ్బరి తురుం- పావు కప్పు



తయారీ విధానం

వెడల్పాటి గిన్నెలో పచ్చి బొప్పాయి తురుం, బియ్యప్పిండి, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, నువ్వులు, జీలకర్ర, అల్లం తురుం, పచ్చి కొబ్బరి తురుం, కొత్తిమీర తరుగు, కరివేపాకు, ఉప్పు వేసి ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని అయిదు నిమిషాలపాటు నాననివ్వాలి. స్టవ్ మీద పాన్ పెట్టి అర చెంచా నూనె రాసి వేడిచేయాలి. బట్టర్ పేపర్ మీద కొద్దిగా నూనె రాసి దాని మీద చిన్న పిండి ముద్దను పలుచగా పరచాలి. దీన్ని వేడెక్కిన పాన్ మీద వేసి చిన్న మంట మీద రెండు వైపులా ఎర్రగా వేయించి పళ్లెంలోకి తీయాలి. దీన్ని టమాటా సాస్, గ్రీన్ చట్నీలతో సర్వ్ చేసుకోవచ్చు.

పేఠా

కావాల్సిన పదార్థాలు

పచ్చి బొప్పాయి కాయలు- రెండు, కిళ్లీలో వాడే సున్నం- ఒక చెంచా, చక్కెర- మూడు కప్పులు



తయారీ విధానం

పచ్చి బొప్పాయి కాయలను శుభ్రంగా కడిగి తొక్క తీసి మధ్యకు కోయాలి. లోపలి గింజలను తీసివేసి మరోసారి శుభ్రంగా కడగాలి. వీటి మీద రెండు వైపులా ఫోర్క్‌తో రంధ్రాలు చేసి ఆపైన చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. పెద్ద గిన్నెలో సగానికి పైగా నీటిని తీసుకుని అందులో సున్నం వేసి కలపాలి. ఈ నీళ్లలో బొప్పాయి ముక్కలు వేసి అయిదుగంటలసేపు నానబెట్టాలి. తరువాత ఈ ముక్కలను మంచినీళ్లలో వేసి అయిదారుసార్లు కడగాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో సగానికిపైగా నీళ్లు పోసి అరచెంచా ఉప్పు వేసి వేడిచేయాలి. అందులో బొప్పాయి ముక్కలు వేసి అవి మెత్తబడేవరకూ ఉడికించాలి. తరువాత స్టవ్ మీద నుంచి దించి నీళ్లు వంచేసి మరోసారి మంచినీళ్లు పోసి ముక్కలను కడగాలి. ఒక కడాయిని తీసుకుని అందులో ఉడికించిన బొప్పాయి ముక్కలు, రెండున్నర కప్పుల చక్కెర వేసి బాగా కలపాలి. దీనిమీద మూతపెట్టి గంటసేపు ఉంచాలి. తరువాత కడాయిని స్టవ్ మీద పెట్టి అందులో అర కప్పు చక్కెర వేసి కలపాలి. చక్కెర మొత్తం కరిగి పాకంలా మారి ముక్కలకు పట్టేవరకూ గరిటెతో కలుపుతూ చిన్న మంట మీద ఉడికించాలి. పావు గంట తరువాత నీరంతా ఇగిరి ముక్కలు పొడిపొడిగా మారతాయి. వెంటనే కడాయిని స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. ఇలా తయారు చేసిన పేఠా.. లోపల జ్యూసీగా పైన పొడిపొడిగా ఉంటుంది. దీన్ని పిల్లలు ఇష్టంగా తింటారు.




నిల్వ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

పచ్చి బొప్పాయి- ఒకటి(నాలుగు కప్పుల ముక్కలు), పచ్చళ్ల కారం- ఒకటిన్నర కప్పులు, ఆవపిండి- ఒకటిన్నర కప్పులు, పచ్చళ్ల ఉప్పు- ముప్పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- పావు కప్పు, నువ్వుల నూనె- రెండు కప్పులు, నిమ్మరసం- అర కప్పు, మెంతి పిండి- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, అల్లం తరుగు- ఒక చెంచా, నిమ్మ ఉప్పు- ఒక చెంచా

తయారీ విధానం

- బొప్పాయి కాయను శుభ్రంగా కడిగి తొక్క తీయాలి. తరువాత మధ్యకు కోసి గింజలు తీసివేసి చిన్న ముక్కలుగా తరగాలి. వీటిని రెండు గంటలసేపు ఎండలో ఆరబెట్టాలి.
- వెడల్పాటి గిన్నెలో పచ్చి బొప్పాయి ముక్కలు, కారం, ఆవ పిండి, ఉప్పు, వెల్లుల్లి రెబ్బలు, మెంతి పిండి, పసుపు, అల్లం తరుగు, నిమ్మ ఉప్పు వేసి చేత్తో బాగా కలపాలి. తరువాత నూనె పోసి కలపాలి. ఆపైన నిమ్మరసం వేసి కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఈ పచ్చడిని గాలి చొరబడని ప్లాస్టిక్ డబ్బాలో భద్రపరచుకోవాలి. మూడు రోజుల తరువాత ఈ పచ్చడిని వెడల్పాటి గిన్నెలోకి తీసి మరోసారి బాగా కలపాలి. తరువాత అదే డబ్బాలోకి సర్ది పెట్టాలి. ఇలా తయారుచేసిన బొప్పాయి పచ్చడి మూడు నెలల వరకూ నిల్వ ఉంటుంది. ఇది వేడి అన్నం, ఉప్మా, దోశల్లోకి రుచిగా ఉంటుంది.






భోజన కుతూహలం

వాతవ్యాధులకు ఔషధం పనస

'భోజనకుతూహలం' గ్రంథంలో పనసకాయ, పనసపండుల గురించి, వాటి ఆహార, ఔషధ ధర్మాల గురించి అనేక విశేషాలున్నాయి. ఈ గ్రంథం ప్రకారం పక్వం కాని పనస కాయ వగరు, తీపి రుచులు కలిగి ఉంటుంది. చాలా కష్టంగా అరుగుతుంది. బాగా వేడి చేస్తుంది. స్థూలకాయాన్ని పెంచుతుంది. దప్పికని కలిగిస్తుంది. వాతాన్ని అదుపు చేస్తుంది. అందుకనే పనసపొట్టు కూరని వండిన తర్వాత తేలికగా అరగటం కోసం చివరలో కొద్దిగా ఆవపిండి కలుపుతారు. ఇక బాగా మగ్గిన పనసపండు శీతల స్వభావం కలిగి ఉంటుంది. శరీరధాతువులను పెంచుతుంది. శారీరక, మానసిక ఉత్తేజాన్ని ఇస్తుంది. నడుము, మణికట్టు, నరాలకు బలం చేకూరుస్తుంది. వాత వ్యాధులు ఉన్న వారికి పనస తొనలు మేలు చేస్తాయి. అయితే జీర్ణశక్తి సమస్యలు ఉన్నవారు- పనసపండును దూరంగా ఉంచటమే మేలని భోజనకుతూహలం గ్రంథంలో పేర్కొన్నారు. పేవుల్లో వాపు, ఎసిడిటీ ఉన్నవారు పనసపండును తినకపోవటమే మంచిది. పనస గింజలు, తొనలు ఎక్కువగా తినకూడదు.

పనస తొనలు తిన్న తర్వాత పాలు, పాల పదార్థాలకు తీసుకోవద్దని భోజనకుతూహలం చెబుతోంది. ఇదే విధంగా చేపలు, మద్యం, అతి చల్లని పానీయాలు కూడా తినకూడదు.



పొట్టెంకలు

పనసాకుల దొన్నెలో ఇడ్లీపిండి వేసి ఉడికించినవాటిని కోనసీమలో పనస పొట్టెంకలు అంటారు. పనస, అరటి, పసుపు ఆకులు, తమలపాకులు, మర్రి ఆకులూ ఇలాంటి వాటితో ఇడ్లీలు, ఉండ్రాళ్లు, ఆవిరిమీద ఉడికించిన బూరెలు ఇలాంటివి చేసుకునే అలవాటు తెలుగువారిలో వివిధ ప్రాంతాల్లో ఉంది. ఆకులతో కలిపి ఆవిరిమీద ఉడికించినందు వలన ఆ ఆకుల్లోని ఔషధ గుణాలు అందటమే కాకుండా, అదనపు రుచి, పరిమళాలు కూడా అందుతాయి.

పనస తాండ్ర

మిగల ముగ్గిన పనస పండు గుజ్జుని పలుచగా ఒక తెల్లని వస్త్రం మీద పరచి ఎండలో వరుసగా కొన్నిరోజులు ఆరబెట్టితే దానిని పనసతాండ్ర అంటారు. దీనికి తేలికగా ఆరిగే స్వభావం కలిగి ఉంటుంది. అందుకే దీనికి పనస వర్ధని అనే పేరు కూడా ఉంది. ఈ తాండ్ర పనసపండు లాగా వేడి చెయ్యదు. రక్తస్రావాన్ని అరికడ్తుంది. శరీరధాతువుల క్షీణించేవారికి, ఎదిగే పిల్లలకు ఇది పోషకంగా ఉపకరిస్తుంది. మన దగ్గర పనస తాండ్రకు తక్కువగా చేస్తారు.

• గంగరాజు అరుణాదేవి

ఇంట్లో ప్రశాంతంగా

ఇంట్లో ఉన్నంతసేపు సంతోషకరమైన అనుభూతి కలగాలంటే ఇల్లు శుభ్రంగా అహ్లాదకరంగా ఉండాలి. దీంతోపాటు చిన్న చిట్కాలు పాటిస్తే మనసు ప్రశాంతంగా సేదదీరుతుంది.

- ఇంట్లో సామాన్లను పొందికగా సర్దుకోవాలి. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గాలి, వెలుతురు ఇంట్లోకి ప్రసరించేలా కిటికీలు, గుమ్మం తలుపులు తెరచి ఉంచుకోవాలి. దీనివల్ల తాజా అనుభూతి కల్గుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది.
- ఇంటి గోడలకు లేత రంగులను ఎంపిక చేసుకోవడం మంచిది. ప్రకృతిని గుర్తుకు తెచ్చే తేలికపాటి రంగులు మానసిక ప్రశాంతతను పెంపొందిస్తాయి.
- ఇంట్లో ప్రతి గదిలో ఇండోర్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి.



పచ్చని మొక్కలను చూసినప్పుడు సానుకూల దృక్పథం పెరుగుతుంది. ఆందోళన తగ్గి మనసు తేలికపడుతుంది.

- ఇంట్లో అవసరం లేని వాడని వస్తువులను దాచి ఉంచకూడదు. వాటివల్ల తెలియకుండానే చికాకు పెరుగుతుంది. వాటితోపాటు విరిగిన, పాడైన సామాన్లను ఎప్పటికప్పుడు తొలగించడం మంచిది.



న్యూజెర్సీలో నయా చరిత్ర

భారతీయులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తమ ప్రత్యేకతను చాటుకుంటూనే ఉంటారు. రంగం ఏదైనా తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంటూ ముందుకు సాగుతుంటారు. అలాంటి వారిలో ఒకరు అమెరికాలోని న్యూజెర్సీకి చెందిన మమతా సింగ్. జెర్సీ నగరంలో ప్రజా పదవికి ఎన్నికైన మొట్టమొదటి భారతీయ అమెరికన్ మహిళగా కౌన్సిల్ ఎట్ లార్జ్ స్థానాన్ని కైవసం చేసుకోవడం ఒక అరుదైన విజయంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాలోనే అత్యధిక భారతీయ సంతతి ప్రజలు నివసించే న్యూజెర్సీ రాష్ట్రంలోని ప్రసిద్ధ వాణిజ్య జిల్లా అయిన ఇండియా స్క్వేర్‌ను ముద్దుగా 'లిటిల్ ఇండియా' అని పిలుచుకుంటారంటే ఈ నగరంపై మన భారతీయ సంస్కృతిప్రభావం ఎంతుందో అర్థంచేసుకోవచ్చు. అయినప్పటికీ మమతా సింగ్ గెలిచే వరకు ఏ ఒక్క భారతీయ సంతతి వ్యక్తి కూడా ఈ నగరంలో ప్రజా పదవికి ఎన్నిక కాకపోవడం ఆశ్చర్యపరిచే విషయమే. జెర్సీ సిటీ లోనే పుట్టిపెరిగిన మమత తనను తాను ఒక వలసదారునని గర్వంగా ప్రకటించుకుంటారు. ప్రజాసేవలో తన అనుభవం సిటీ కౌన్సిలోని పౌరులందరికీ ఉపకరిస్తుందంటారు. మమతా సింగ్ జెర్సీ సిటీలో మహిళలు, పిల్లలు, ఉద్యోగాలు చేసే తల్లిదండ్రులకు అండగా నిలిచేందుకు 'జెర్సీ ఫ్యామిలీస్' అనే నెట్‌వర్క్‌ను స్థాపించారు. అలాగే అమెరికాలో భారతీయ కుటుంబాలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించేందుకు, ఉత్సవాలను జరుపుకొనేందుకు 'ఇండియన్స్ ఇన్ జెర్సీ సిటీ' అనే గ్రూప్‌ను కూడా స్థాపించారు.

లువానా లోప్స్ లారా.. ఇప్పుడీ పేరు వ్యాపార ప్రపంచంలో మార్మోగుతోంది. ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన లారా ప్రపంచంలో స్వయంకృషితో ఎదిగిన అతికొద్దిమంది బిలియనీర్ల సరసన చేరారు. 29 ఏళ్ల ఈ బ్రెజిల్ యువ పారిశ్రామికవేత్త ప్రపంచంలోనే అతిపిన్న మహిళా బిలియనీర్‌గా చరిత్ర సృష్టించారు. గతంలో ఈ స్థానంలో ఉన్న స్కేల్ ఏఐ సహ వ్యవస్థాపకురాలు లూసీ గువాను లారా వెనక్కి నెట్టేశారు. లారా స్థాపించిన ప్రిడక్షన్ మార్కెట్ స్టార్టప్ 'కల్షి' మార్కెట్ విలువ 11 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.90,200 కోట్లు)కు చేరుకోవడంతో ఆమె వ్యక్తిగత వాటా విలువ 1.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తద్వారా ఆమె ఈ ఘనత అందుకున్నారు.

అతి పిన్న బిలియనీర్

ట్రెండింగ్



లువానా లోప్స్ లారా.. ఇప్పుడీ పేరు వ్యాపార ప్రపంచంలో మార్మోగుతోంది. ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన లారా ప్రపంచంలో స్వయంకృషితో ఎదిగిన అతికొద్దిమంది బిలియనీర్ల సరసన చేరారు. 29 ఏళ్ల ఈ బ్రెజిల్ యువ పారిశ్రామికవేత్త ప్రపంచంలోనే అతిపిన్న మహిళా బిలియనీర్‌గా చరిత్ర సృష్టించారు. గతంలో ఈ స్థానంలో ఉన్న స్కేల్ ఏఐ సహ వ్యవస్థాపకురాలు లూసీ గువాను లారా వెనక్కి నెట్టేశారు. లారా స్థాపించిన ప్రిడక్షన్ మార్కెట్ స్టార్టప్ 'కల్షి' మార్కెట్ విలువ 11 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 90,200 కోట్లు) చేరుకోవడంతో లారా వ్యక్తిగత వాటా విలువ 1.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. తద్వారా ఆమె ఈ ఘనత అందుకున్నారు.

డ్యాన్సర్ నుంచి పారిశ్రామికవేత్తగా

బ్రెజిల్‌లో పుట్టిన లారా ప్రతిష్ఠాత్మక బోల్షోయ్ థియేటర్ స్కూల్‌లో ప్రొఫెషనల్ బ్యాలరీనా (డ్యాన్సర్)గా శిక్షణ తీసుకున్నారు. చదువులోనూ మెరికలా ఉండేవారు. బ్రెజిలియన్ ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లో బంగారు పతకం, శాంటా క్యాటరీనా మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో కాంస్య పతకం గెలుచుకున్నారు. హైస్కూల్ విద్య తర్వాత ఆస్ట్రియాలో కొంతకాలం పాటు నృత్య ప్రదర్శనలు ఇచ్చి ఎంతోమంది మన్ననలు అందుకున్నారు. ప్రతి రోజు న్యూస్ వినడాన్ని ఇష్టపడే లారాకు చిన్నప్పటి నుంచే వ్యాపార మెళకువలు అబ్బాయి. అవే ఆమెను ఆ తర్వాతి కాలంలో విజయవంతమైన పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాయి. అమెరికాలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పట్టా పుచ్చుకున్న లారా 2019లో తన సహ విద్యార్థి అయిన తారెక్ మన్సూర్‌తో కలిసి రియల్ వరల్డ్ సంఘటనలైన ఎన్నికలు, ద్రవ్యోల్బణం, క్రీడల నుంచి పాపప్ సంస్కృతి వంటి భవిష్యత్ ఈవెంట్లపై ప్రజలు నేరుగా ట్రేడింగ్ చేయడానికి వీలు కల్పించే వేదిక 'కల్షి'ని స్థాపించారు. ఈ వ్యవస్థను ఒక నియమిత కాంట్రాక్ట్ మార్కెట్‌గా ఆపరేట్ చేయడానికి ప్రభుత్వ ఆమోదం కోసం ఈ ఇద్దరు కలిసి అనేక న్యాయపోరాటాలు చేసి విజయం సాధించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు ఫలితాన్ని సరిగా అంచనా వేయడం ద్వారా రూ. 4,100 కోట్ల విలువైన వ్యాపారం చేశారు. ఈ ఏడాది జూన్‌లో 2 బిలియన్ డాలర్లుగా ఉన్న కల్షి మార్కెట్ విలువ డిసెంబర్ నాటికి 11 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దీంతో లారా, తారెక్ ఇద్దరూ బిలియనీర్లుగా మారగా, లారా ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలైన మహిళా బిలియనీర్‌గా రికార్డులకెక్కారు. లారాకు ప్రస్తుతం ఈ కంపెనీలో 12 శాతం వాటా ఉంది. దీని విలువ దాదాపు 1.3 బిలియన్ డాలర్లు.



మనలాగే నమ్మకాలు

బ్రెజిలియన్లకు మనలానే నమ్మకాలు ఎక్కువ. భారతీయుల్లానే వారు కూడా 'కుడి'కి అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. "నేను ఉదయం లేవగానే తొలుత కుడికాలినే నేలపై మోపుతాను. దేవుడిపైనా, పునర్జన్మలపైనా నమ్మకం ఉంది. చిన్నప్పుడు పరీక్షలంటే విపరీతంగా భయపడేదానిని. అందుకే స్కూలుకు వెళ్లడానికి అరగంట ముందు దేవుడిని ప్రార్థించేదానిని. కంప్యూటర్ సైంటిస్ట్, రచయిత పాల్ గ్రాహమ్‌ను 'ఎక్స్'లో ఫాలో అవుతుంటాను. రోజుకు దాదాపు మూడు గంటలపాటు మొబైల్ చూడటం అలవాటు. అలాగే, వారానికి ఒక డాక్యుమెంటరీ తప్పనిసరిగా చూడాల్సిందే. 'స్వాన్‌లేక్' నృత్యమంటే నాకు ఎంతో ఇష్టం" అని చెప్పే లారా సాంకేతిక ప్రపంచంలోనే కాకుండా ఆర్థిక మార్కెట్లోనూ ఒక యువశక్తిగా, స్ఫూర్తిదాయకమైన మహిళగా నిలిచారు.

పెదవులు పగులుతున్నాయా?

చలికి పెదవులు పగులుతూ రక్తం చిందుతూ ఉంటాయి. దీంతో తీవ్రమైన నొప్పి వేధించడంతోపాటు ఆహారం తీసుకోవడం కూడా ఇబ్బందిగా అనిపిస్తుంటుంది. అలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించి పెదవుల పగుళ్లను తగ్గించుకోవచ్చు.



- కొద్దిగా కలబంద గుజ్జును తీసుకుని రెండు సార్లు నీళ్లలో ముంచి ఆపైన పెదవులకు పట్టించాలి. అరగంట తరువాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ ఉంటే కలబందలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. పెదవుల పగుళ్లను నివారిస్తాయి.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల ఆలివ్ ఆయిల్, ఒక చెంచా కొబ్బరినూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో కొద్ది కొద్దిగా తీసుకుంటూ పెదవులకు రాయాలి. ఇలా రోజుకు నాలుగైదు సార్లు చేస్తూ ఉంటే పెదవులకు తగినంత తేమ అంది మృదువుగా మారతాయి. నొప్పి కూడా తగ్గుతుంది. అలాగే రెండు చెంచాల తేనెలో ఒక చెంచా ఆలివ్ ఆయిల్ కలిపి పెదవులకు రాసుకున్నా మంచి ఫలితం కనిపిస్తుంది.
- రాత్రి పడుకునేముందు కీర రసాన్ని లేదా చల్లని గ్రీన్ టీని పెదవులకు పట్టించాలి. ఉదయానికల్లా నొప్పి తగ్గుతుంది. ఇలా రోజూ చేస్తూ ఉంటే పెదవులు తేమతో నిండి క్రమంగా పగుళ్ల తగ్గుతాయి.
- తరచూ పెదవులకు పేరిన నెయ్యి రాసుకుంటూ ఉంటే పగుళ్లు రావు. పెదవులమీద పేరుకున్న మృతకణాలు తొలగిపోయి రక్తప్రసరణ మెరుగవుతుంది. తగినంత తేమ అంది పెదవులు మృదువుగా మెరుస్తుంటాయి.
- గిన్నెలో చెంచా కివీ పండు గుజ్జు తీసుకుని అందులో అర చెంచా పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు పట్టించి పావుగంట తరువాత మంచి నీటితో శుభ్రం చేసుకుంటే ఉపశమనం కలుగుతుంది. రెండు చెంచాల బొప్పాయి పండు గుజ్జులో చెంచా తేనె కలిపి పెదవులకు పట్టించినా ఫలితం కనిపిస్తుంది.
- గుప్పెడు గులాబీ రేకులను రోట్లో వేసి పాల చుక్కలు చిలకరిస్తూ మెత్తగా నూరాలి. ఈ పేస్టును రాత్రి పడుకునేముందు పెదవులకు పట్టించాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే పగుళ్ల తగ్గడమే కాకుండా పెదవులు ఎర్రగా మృదువుగా మారతాయి.

మీకు తెలుసా!

యాలకుల్లో బి, సి విటమిన్లు; కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం తదితర మినరల్స్; యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అర చెంచా యాలకుల పొడి కలుపుకుని వారానికి రెండుసార్లు తాగుతూ ఉంటే శరీరంలో పేరుకున్న వ్యర్థాలు తొలగిపోతాయి. చర్మం పొడిబారకుండా ఉంటుంది. చలికి పెదాలు పగలకుండా మృదువుగా మారతాయి. మాడు మీద చుండ్రు సమస్యలు రావు. చిన్న గిన్నెలో రెండు చెంచాల కొబ్బరి నూనె, ఒక చెంచా చక్కెర, ఒక చెంచా యాలకుల పొడి వేసి బాగా కలిపి ముఖానికి పట్టించి మర్దన చేస్తే మృతకణాలన్నీ తొలగిపోతాయి. ముఖం కాంతివంతంగా మారుతుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,29,930 ▼	1,19,100 ▼	1,96,000 ▼
విజయవాడ	1,30,300 ▼	1,22,000 ▼	1,83,000 ▲
విశాఖపట్నం	1,32,690 ▲	1,18,850 ▼	1,96,000 ▼
రాజమండ్రి	1,30,690 ▲	1,19,800 ▲	1,79,000 ▼
ప్రొద్దుటూరు	1,27,850 ▲	1,17,620 ▲	1,78,000 ▲
ముంబై	1,28,592 ▲	1,17,790 ▲	1,78,210 ▲

రుణాలు మరింత చవక

గృహ, వాహన రుణాలపై తగ్గనున్న ఈఎంఐల భారం ● రెపో రేటు 0.25% తగ్గింపు.. 5.25 శాతానికి తగ్గిన రెపో

- భవిష్యత్ రేట్లపై తటస్థ వైఖరి యథాతథంగా కొనసాగింపు
- జీడీపీ వృద్ధి అంచనా 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంపు
- ద్రవ్యోల్బణం అంచనా 2.6 శాతం నుంచి 2 శాతానికి తగ్గింపు
- దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత భారీగా పెంపు
- ఓఎంఓ ద్వారా రూ.లక్ష కోట్ల ప్రభుత్వ బాండ్ల కొనుగోలు
- రూ.45,000 కోట్ల డాలర్/రూపీ మార్పిడి వేలం నిర్వహణ
- ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ
- 2026 ఫిబ్రవరి 4-6 తేదీల్లో తదుపరి సమీక్ష



ముంబై: రుణగ్రహీతలకు శుభవార్త. రుణాలకు ప్రామాణికమైన రెపో రేటును ఆర్‌బీఐ మరో 0.25 శాతం తగ్గించింది. దీంతో రెపో రేటు 5.50 శాతం నుంచి 5.25 శాతానికి దిగివచ్చింది. తద్వారా రెపో అనుసంధానిత గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. ఇప్పటికే రుణం తీసుకున్న వారిపై ఈఎంఐ చెల్లింపుల భారం కూడా తగ్గనుంది. చవక వడ్డీ రేట్లు బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల వృద్ధితో పాటు అమెరికా అధిక సుంకాల నేపథ్యంలో దేశ ఆర్థిక వృద్ధికీ దోహదపడనున్నాయి.

వడ్డీ రేట్లపై ఏకగ్రీవ నిర్ణయం

ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో భాగంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల పాటు సమావేశమైంది. శుక్రవారంతో ముగిసిన ఈ సమీక్షలో కమిటీ సభ్యులు రెపో రేటును మరో పావు శాతం తగ్గించాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు, భవిష్యత్ రేట్లపైన తటస్థ వైఖరిని కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. తద్వారా ఆర్‌బీఐ రెపో రేటును మరింత తగ్గించేందుకు అవకాశాలున్నాయని సంకేతాలిచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రెపో రేటును తగ్గించడం ఇది నాలుగోసారి. ఈ నాలుగు విడతల్లో రెపోను 1.25 శాతం తగ్గించింది. అంచనాల కంటే వేగంగా తగ్గిన ద్రవ్యోల్బణం.. అనుకూల స్థాయిలోనే కదలాడినంత కాలం రెపో రేటు కూడా తక్కువ స్థాయిలోనే కొనసాగనుందని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు.

రూపాయి మారకం విలువకు లక్ష్యాన్నేమీ నిర్దేశించుకోలేదు..

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం విలువను ఫలానా స్థాయి లేదా శ్రేణికి కట్టడి చేయాలని లక్ష్యాన్నేమీ నిర్దేశించుకోలేదని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. రూపాయి విలువను మార్కెట్ పరిస్థితులే నిర్ణయిస్తాయని పరపతి సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మార్కెట్ హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉంటుందని, అధిక లేదా అసాధారణ స్థాయిలో హెచ్చుతగ్గులను తగ్గించడంపైనే ఆర్‌బీఐ దృష్టి సారిస్తుందన్నారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయి రూ.90కి చేరిన నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ధరలు.. కూల్!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం అంచనాను ఆర్‌బీఐ గతంలో ప్రకటించిన 2.6 శాతం నుంచి 2 శాతానికి తగ్గించింది. ఈ జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి 1.7 శాతంగా నమోదైన ద్రవ్యోల్బణం అక్టోబరులో రికార్డు కనిష్ఠ స్థాయి 0.25 శాతానికి తగ్గింది. ధరలు అంచనాల కంటే వేగంగా తగ్గుతూ వచ్చిన నేపథ్యంలో ఆర్‌బీఐ పూర్తి ఆర్థిక సంవత్సరం అంచనాను కూడా తగ్గించింది.

వృద్ధి హైజంప్!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 7.3 శాతానికి ఎగబాకవచ్చని ఆర్‌బీఐ తాజాగా అంచనా వేసింది. గతంలో ప్రకటించిన 6.8 శాతంతో పోలిస్తే వృద్ధి అంచనాను ఏకంగా 0.5 శాతం పెంచింది. ఈ సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల్లో (క్యూ2)లో జీడీపీ వృద్ధి రేటు 6 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి చేరుకోవడంతోపాటు ఈనెలతో ముగియనున్న మూడో త్రైమాసికం (క్యూ3)లోనూ మెరుగైన వృద్ధి నమోదుకు అవకాశాలున్నాయని ఆర్‌బీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరం అంచనాను గణనీయంగా పెంచింది.

బ్యాంకింగ్‌లోకి రూ.1.45 లక్షల కోట్లు

రుణాలకు గిరాకీ మరింత పెరగనున్న నేపథ్యంలో బ్యాంకింగ్ రంగంలో ద్రవ్య లభ్యతను పెంచేందుకు ఆర్‌బీఐ రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. బహిరంగ మార్కెట్ కార్యకలాపాల (ఓఎంఓ) ద్వారా రూ. లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 11న, 18న రూ.50,000 కోట్ల చొప్పున రెండు విడతల్లో బాండ్ల కొనుగోలును చేపట్టనుంది. అలాగే, మూడేళ్ల కాలపరిమితితో 500 కోట్ల డాలర్ల (సుమారు రూ.45,000 కోట్లు) విలువైన డాలర్/రూపీ క్రయ-విక్రయ మార్పిడి వేలాన్ని ఈనెల 16న నిర్వహించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ రెండు చర్యల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలోకి అదనంగా రూ.1.45 లక్షల కోట్లు వచ్చి చేరనున్నాయి.

డాలర్/రూపీ మార్పిడి ఎలా..?

మూడేళ్ల డాలర్/రూపీ క్రయ-విక్రయ మార్పిడిలో భాగంగా ఆర్‌బీఐ తొలుత బ్యాంకుల నుంచి డాలర్లను కొనుగోలు చేస్తుంది. తద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో దేశీయ కరెన్సీ లభ్యత పెరుగుతుంది. మలివిడతలో భాగంగా ఆర్‌బీఐ మూడేళ్ల తర్వాత ఆ డాలర్లను తిరిగి బ్యాంకులకు ముందస్తుగానే నిర్ణయించిన ధరకు విక్రయిస్తుంది. రూపాయల్లో ద్రవ్య లభ్యత నిర్వహణతో పాటు కరెన్సీ స్థిరత్వం, విదేశీ మారకం నిల్వలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది దోహదపడుతుంది.

గృహ రుణం ఎంత తగ్గుతుందంటే..

వడ్డీ రేట్లు తగ్గించిన బీఓబీ, బీఓఐ

ఆర్‌బీఐ కీలక రెపో రేటును మరో పావు శాతం తగ్గించింది. ఈ ప్రభావం రెపో రేటు ఆధారిత గృహ రుణాలపై ముఖ్యంగా ఫ్లోటింగ్ రేట్ హోమ్ లోన్ల ఈఎంఐలపైనా పడనుంది. ఆర్‌బీఐ ఎంపీసీ నిర్ణయం వెలువడిన కొద్దిసేపటికే తన రెపో ఆధారిత రుణాల వడ్డీ రేటును తగ్గిస్తున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) ప్రకటించాయి. బీఓఐ తన వడ్డీ రేటును 8.35 శాతం నుంచి 8.10 శాతానికి తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. శుక్రవారం నుంచే ఈ తగ్గింపు అమల్లోకి వస్తుందని తెలిపింది కాగా బీఓబీ.. శనివారం నుంచి వడ్డీ రేటును 8.15 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే మిగతా బ్యాంకులూ ఇదే బాటలో నడిచే అవకాశం ఉంది.

రూ.25 లక్షల గృహ రుణంపై..
- రుణ చెల్లింపు కాలపరిమితి 15 ఏళ్లు
- 8.5% వడ్డీ రేటుతో చెల్లిస్తున్న ఈఎంఐ రూ.24,618
- 8.25% వడ్డీ రేటుతో చెల్లించే ఈఎంఐ రూ.24,254
- నెలనెలా తగ్గే ఈఎంఐ రూ.364
- 8.5% వడ్డీ రేటుతో 15 ఏళ్లలో చెల్లించే మొత్తం వడ్డీ రూ.19,31,328
- 8.25% వడ్డీతో చెల్లించే మొత్తం వడ్డీ రూ.18,65,632
- ఆదా అయ్యే వడ్డీ రూ.65,696

రూ.50 లక్షల గృహ రుణంపై..
- కాలపరిమితి 20 ఏళ్లు
- 8.5% వడ్డీ రేటుతో చెల్లిస్తున్న ఈఎంఐ రూ.43,391
- కొత్త వడ్డీ రేటు 8.25%తో చెల్లించే ఈఎంఐ రూ.42,603
- నెలనెలా ఆదా అయ్యే ఈఎంఐ రూ.788.
- పాత వడ్డీ రేటుతో 20 ఏళ్లలో చెల్లించాల్సిన మొత్తం వడ్డీ రూ.54,13,879
- కొత్త వడ్డీ రేటుతో చెల్లించాల్సిన మొత్తం వడ్డీ రూ.52,24,788
- ఆదా అయ్యే వడ్డీ రూ.1,89,091

రూ.75 లక్షల గృహ రుణంపై..
- కాలపరిమితి 20 ఏళ్లు
- 8.5% వడ్డీతో ప్రస్తుత ఈఎంఐ రూ.60,392
- కొత్త వడ్డీ రేటు 8.25%తో చెల్లించే ఈఎంఐ రూ.59,134
- నెలనెలా తగ్గే ఈఎంఐ రూ.1,258
- పాత వడ్డీ రేటుతో 20 ఏళ్లలో చెల్లించాల్సిన మొత్తం వడ్డీ రూ.1,06,17,609
- కొత్త వడ్డీ రేటుతో 20 ఏళ్లలో చెల్లించే మొత్తం వడ్డీ రూ.1,02,40,128
- ఆదా అయ్యే వడ్డీ రూ.3,77,481

నెట్‌ఫ్లిక్స్ గూటికి వార్నర్ బ్రదర్స్ స్టూడియో, స్ట్రీమింగ్ వ్యాపారాలు

- డీల్ విలువ రూ.6.48 లక్షల కోట్లు

న్యూయార్క్: ప్రపంచ మీడియా, వినోద రంగంలో మరో మెగా ఒప్పందం కుదిరింది. హాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ స్టూడియో, స్ట్రీమింగ్ వ్యాపారాలతో పాటు హెచ్‌బీఓ మ్యాక్స్ చానెల్‌ను అంతర్జాతీయ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ 7,200 కోట్ల డాలర్లకు (సుమారు రూ.6.48 లక్షల కోట్లు) కొనుగోలు చేసింది. నగదు, స్టాక్స్ రూపంలో ఈ డీల్ జరగనుంది. ఇందులో భాగంగా వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ (డబ్ల్యూబీడీ) ఒక్కో షేరు ధరను 27.75 డాలర్లుగా లెక్కగట్టారు. ఈ డీల్ నేపథ్యంలో వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ గతంలోనే రూపొందించుకున్న ప్రణాళిక ప్రకారంగా డిస్కవరీ గ్లోబల్‌ను (టీఎన్‌టీ, సీఎన్ఎన్ టీవీ చానెళ్ల నెట్‌వర్క్) విభజించి 2026 మూడో త్రైమాసికంలో ప్రత్యేక లిస్టెడ్ కంపెనీగా ఏర్పాటు చేయనుంది. అనంతరం నెట్‌ఫ్లిక్స్‌తో డీల్ పూర్తి కానుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 6వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	127	విజయవాడ	130
వరంగల్	127	గుంటూరు	135
కరీంనగర్	127	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	120
కర్నూలు	127	నెల్లూరు	125
విశాఖపట్నం	120	అనంతపురం	125
గోదావరి	130		

మార్కెట్‌కు 'రెపో' బూస్ట్

447 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: పలు వర్గాల ఊహలకు భిన్నంగా ఆర్‌బీఐ రెపో రేటును 0.25% తగ్గించడం మార్కెట్లో ఉత్తేజం నింపింది. సెన్సెక్స్ శుక్రవారం 447.05 పాయింట్ల లాభంతో 85,712.37 వద్ద ముగిసింది. అంతకు ముందు ఇంట్రాడేలో 531.40 పాయింట్ల లాభంతో 85,796.72 స్థాయిని తాకింది. నిఫ్టీ కూడా 152.70 పాయింట్లు లాభపడి 26,186.45 వద్ద ముగిసింది. మార్కెట్ లాభపడడం వరుసగా ఇది రెండో రోజు.

బ్యాంక్, ఆటో షేర్ల జోరు: వడ్డీరేట్ల ప్రభావం అధికంగా ఉండే బ్యాంక్, ఆటో, రియల్టీ షేర్లు మాత్రం ఆర్‌బీఐ నిర్ణయంతో కొత్త ఉత్తేజం పొందాయి. బ్యాంకింగ్ షేర్లలో ఎస్‌బీఐ 2.46%, బీఓబీ 1.56% మేర లాభపడ్డాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, ఫెడరల్ బ్యాంక్ లాభపడిన షేర్లలో ఉన్నాయి. కాగా బ్యాంకెక్స్ 0.86% లాభపడింది.

- ఆటో షేర్లలో మారుతి సుజుకీ (1.75%), ఐషర్ మోటార్స్ (1.54%) అగ్రస్థానంలో నిలిచాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఫోర్జ్, టీవీఎస్ మోటార్ కంపెనీ, అశోక్ లేలాండ్, బజాజ్ ఆటో కూడా లాభపడ్డాయి. ఆటో ఇండెక్స్ 0.57% లాభపడి 62,112.92 వద్ద ముగిసింది.
- రియల్టీ షేర్లలో ప్రెస్టీజ్ 1.99%, డీఎల్ఎఫ్ 1.50% మేర లాభపడగా సిగ్నేచర్ గ్లోబల్, లోధా డెవలపర్స్, గోద్రెజ్ ప్రాపర్టీస్, శోభ లిమిటెడ్ కూడా లాభాల్లో ముగిసాయి. ఉన్నాయి. కాగా రియల్టీ సూచీ 0.34% మేర లాభపడింది.

ఇండిగో షేరు డౌన్: ప్రస్తుతం సంక్షోభం ఎదుర్కొంటున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు గత నాలుగు రోజుల్లో 7% మేరకు నష్టపోయాయి. శుక్రవారం బీఎస్ఈలో 1.22% నష్టపోయిన ఈ షేరు రూ.5,371.30 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 3.15% నష్టంతో రూ.5,266 వరకు దిగజారింది. ఎన్ఎస్ఈలో 1.27% నష్టంతో రూ.5,367.50 వద్ద ముగిసింది. నాలుగు రోజుల్లో కంపెనీ మార్కెట్ విలువ రూ.16,190.64 కోట్లు నష్టపోయి రూ.2,07,649.14 కోట్లకు దిగజారింది.

ఫారెక్స్ నిల్వల క్షీణత: నవంబర్ 28వ తేదీతో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 187.7 కోట్ల డాలర్ల మేరకు క్షీణించి 68,622.7 కోట్ల డాలర్లకు దిగజారాయి. బంగారం నిల్వల విలువ 161.3 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 10,579.5 కోట్ల డాలర్ల వద్ద నిలదొక్కుకుంది.

- ఫారెక్స్ మార్కెట్లో అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి విలువ 6 పైసలు పడిపోయి 89.95 వద్ద నిలిచింది.

స్పోర్ట్స్

సిరీస్ నీదా.. నాదా?

విశాఖలో ఆఖరి వన్డే నేడు

టీమిండియాపైనే ఒత్తిడి
ఆత్మవిశ్వాసంతో దక్షిణాఫ్రికా

మ.1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో...



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఆసక్తికర మూడు వన్డేల సిరీస్‌కు విశాఖ సాగర తీరం ముగింపు ఇవ్వబోతోంది. తొలి రెండు మ్యాచ్‌లు భారీ స్కోర్లతో అభిమానులను ఉర్రూతలూగించగా, ఇరు జట్లు చెరొక విజయంతో 1-1తో సమంగా ఉన్నాయి. ఈనేపథ్యంలో శనివారం జరిగే సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌కు స్థానిక ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియం వేదిక కానుంది. ఇప్పటికే టెస్టు సిరీస్‌ను 0-2తో వైట్‌వాష్ అయిన భారత్‌పైనే మరోసారి ఒత్తిడి నెలకొంది. ఎలాగైనా ఈ మ్యాచ్‌ను గెలిచి వన్డే సిరీస్‌తో అభిమానులకు కాస్త ఉపశమనం ఇవ్వాలనుకుంటోంది. అటు దక్షిణాఫ్రికా రాయ్‌పూర్‌లో 359 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి జోష్‌లో ఉంది. అందుకే మరొక్క విజయంతో పరిమిత ఓవర్ల సిరీస్‌ను కూడా ఖాతాలో వేసుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. అయితే 1986-87 తర్వాత స్వదేశంలో భారత్ టెస్టు, వన్డే సిరీస్‌లను కలిపి ఒక్కసారి కూడా కోల్పోలేదు. దీంతో ఆఖరి పోరులో ఎవరిది పైచేయో తేల్చుకునేందుకు ఇరు జట్లూ హోరాహోరీగా తలపడే అవకాశం ఉంది.

రోహిత్, విరాట్‌పై భారం: సిరీస్‌ను వశం చేసుకునేందుకు భారత జట్టు మరోసారి వెటరన్లు రోహిత్, విరాట్‌లపైనే ఆధారపడింది. ముఖ్యంగా విరాట్ తన చివరి మూడు వన్డేల్లో ఓ ఫిఫ్టీ, రెండు సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. దీంతో పాటు విశాఖలో సైతం తనకు అదిరే రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన ఏడు వన్డేల్లో మూడు శతకాలు సాధించగా.. సగటు 97.83గా ఉండడం విశేషం. దీంతో తనకు అచ్చొచ్చిన గ్రౌండ్‌లో మరో సెంచరీతో హ్యాట్రిక్‌ను పూర్తి చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అటు రోహిత్ తన చివరి నాలుగు వన్డేల్లో ఓ సెంచరీ, రెండు ఫిఫ్టీలతో ఆకట్టుకున్నాడు. అయితే ఓపెనర్ జైస్వాల్ అటు బ్యాటింగ్, ఇటు ఫీల్డింగ్‌లో నిరాశపరుస్తున్నాడు. లెఫ్టామ్ పేసర్లను సరిగ్గా ఎదుర్కోలేకపోతున్నాడు. రుతురాజ్ శతకంతో ఫామ్‌ను చాటుకోవడం సానుకూలాంశం. మిడిలార్డర్‌లో వాషింగ్టన్ సుందర్ ఫామ్‌లేమిపై జట్టు ఆందోళనగా ఉంది. అతడి స్థానంలో తిలక్ వర్మను ఆడిస్తే బ్యాటింగ్ బలోపేతం కావడంతో పాటు అదనపు స్పిన్నర్‌గా, అద్భుత ఫీల్డర్‌గానూ ఉపయోగపడగలని కోచ్ గంభీర్ భావిస్తున్నాడు. పంత్ కూడా పోటీలో ఉన్నాడు. ఇక పేస్‌లో అర్ష్‌దీప్ మినహా ప్రసిద్ధ్, హర్షిత్ ధారాళంగా పరుగులిచ్చుకుంటున్నారు. నేటి మ్యాచ్‌లో పేసర్లు విశేషంగా రాణిస్తేనే ఫలితం ఉంటుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: యశస్వీ జైస్వాల్, రోహిత్, కోహ్లీ, రుతురాజ్, రాహుల్ (కెప్టెన్), సుందర్/తిలక్, జడేజా, హర్షిత్, కుల్దీప్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్.
దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, డికాక్, బవుమా (కెప్టెన్), బ్రీట్స్కీ, రికెల్టన్, బ్రెవిస్, యాన్సెన్, బాష్, కేశవ్, ఎన్‌గిడి, బార్ట్‌మన్.

పిచ్, వాతావరణం

మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో ఇక్కడ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ చేజింగ్ టీమ్ గెలిచింది. పిచ్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటిదాకా జరిగిన రెండు వన్డేల మాదిరే ఇక్కడ కూడా మంచు కీలక ప్రభావం చూపనుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ వైపు మొగ్గు చూపవచ్చు. మ్యాచ్‌కు వర్షం సూచన లేదు.

సుందర్‌ను బౌలర్‌గానే పరిగణించాలి: అశ్విన్

చెన్నై: భారత జట్టులో స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ప్రధాన బౌలర్‌గానే చూడాలని మాజీ స్పిన్నర్ అశ్విన్ సూచించాడు. ఈ సిరీస్‌లో ఏడు ఓవర్లు మాత్రమే వేసిన వాషింగ్టన్.. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అయితే ప్రస్తుతం జట్టులో అతడిని బ్యాటర్‌గా పరిగణిస్తూ, కొద్ది ఓవర్లు మాత్రమే వేయిస్తున్నారని అశ్విన్ చెప్పాడు. దీంతో జట్టులో తన పాత్రేమిటో సుందర్‌కు అర్థం కాకుండా పోతున్నదన్నాడు.



గాయాల బెడద

తొలి వన్డేలో విజయం దరిదాపుల్లోకి వచ్చి, రెండో వన్డేలో భారీ ఛేదనను విజయవంతంగా ముగించిన పర్యాటక దక్షిణాఫ్రికా పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. అయితే పేసర్ బర్గర్, బ్యాటర్ డి జోర్జి తొడ కండరాలు పట్టేయడంతో రెండో వన్డేలో మైదానం వీడారు. వారి ఫిట్‌నెస్‌పై స్పష్టత లేకపోయినా.. ఈ కీలక మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. జోర్జి స్థానంలో రికెల్టన్ ఆడే చాన్సుంది. మార్‌క్రమ్ అదరగొడుతున్నా, మరో ఓపెనర్ డికాక్ సిరీస్‌లో ఏమాత్రం రాణించలేకపోయాడు. చివరి మ్యాచ్‌లోనైనా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాలనుకుంటున్నాడు. బ్రీట్స్కే, బ్రెవిస్ మిడిలార్డర్‌లో కీలకంగా మారారు. పేసర్ యాన్సెన్ ఆల్‌రౌండ్‌షో చూపుతున్నాడు. పేసర్ బర్గర్ స్థానంలో బార్ట్‌మన్‌కు అవకాశం దక్కవచ్చు.

సెమీస్‌కు భారత్

'షూటౌట్'లో బెల్జియం చిత్తు
జూనియర్ హాకీ ప్రపంచ కప్



చెన్నై: పూల్ మ్యాచ్‌ల్లో చిన్నజట్లపై విజయాలు సాధించిన భారత్..క్వార్టర్‌ఫైనల్ కఠిన పరీక్షలో నెగ్గింది. అత్యంత బలమైన బెల్జియం జట్టును..పెనాల్టీ షూటౌట్‌లో కంగుతినిపించింది. దాంతో జూనియర్ పురుషుల వరల్డ్ కప్ హాకీ సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. శుక్రవారం హోరాహోరీగా సాగిన పోరులో యువ భారత్ షూటౌట్‌లో 4-3తో బెల్జియం జట్టును చిత్తు చేసింది. నిర్ణీత సమయానికి మ్యాచ్ 2-2తో సమమైంది. భారత్ తరపున రోహిత్ (45 ని.), శారదానంద తివారీ (48 ని.) గోల్స్ చేశారు. కోరెంజ్ (13 ని.), నాథన్ (59 ని.) బెల్జియానికి గోల్స్ అందించారు. ఆదివారం జరిగే సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జర్మనీతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్‌ఫైనల్లో జర్మనీ పెనాల్టీ షూటౌట్‌లో 3-1తో ఫ్రాన్స్‌పై నెగ్గింది. ఇతర క్వార్టర్‌ఫైనల్స్‌లో స్పెయిన్ 4-3తో న్యూజిలాండ్‌ని, అర్జెంటీనా 1-0తో నెదర్లాండ్స్‌ని ఓడించాయి. రెండో సెమీఫైనల్లో అర్జెంటీనా-స్పెయిన్ ఢీకొంటాయి.

ఐర్లాండ్‌పై భారత మహిళల గెలుపు

శాంటియాగో (చిలీ): జూనియర్ వరల్డ్ కప్ హాకీ ఆఖరి పూల్ మ్యాచ్‌ను భారత్ అమ్మాయిలు విజయంతో ముగించారు. శుక్రవారం జరిగిన పూల్ 'సి' పోరులో భారత్ 4-0తో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది.

పెళ్లి వాయిదా తర్వాత.. మంధాన తొలి పోస్టు



న్యూఢిల్లీ: బాలీవుడ్ సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌తో తన పెళ్లిని వాయిదా వేసుకున్న తర్వాత టీమిండియా క్రికెటర్ స్మృతీ మంధాన తొలిసారి సోషల్ మీడియాలో కనిపించింది. ఓ వాణిజ్య ప్రకటనకు సంబంధించి తాను చేసిన ప్రమోషన్ వీడియోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో శుక్రవారం పోస్ట్ చేసింది. కాగా, ఆ వీడియోలో ఆమె చేతివేలికి నిశ్చితార్థపు ఉంగరం లేకపోవడంతో నెటిజన్లు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. పలాష్‌తో పెళ్లిని రద్దు చేసుకుందనేందుకు ఇదే నిదర్శనం అంటూ కొందరు పోస్టులు పెడితే.. ఆ వీడియోను మంధాన తన నిశ్చితార్థానికి ముందు చేసి ఉండొచ్చుగా! అని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఏదేమైనా.. ఈ పెళ్లి త్వరలోనే జరుగుతుందని ఓవైపు పలాష్ కుటుంబం చెబుతుండగా, మంధాన తరపు నుంచి మాత్రం ఎలాంటి ప్రకటనా రాకపోవడం గమనార్హం.

కోహ్లీ, రోహిత్ కాదు.. వైభవ్

గూగుల్ సెర్చ్‌లో సూర్యవంశీ టాప్



న్యూఢిల్లీ: వైభవ్ సూర్యవంశీ..ఈ పేరు దేశ క్రికెట్‌లోనే కాదు అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రస్తుతం మార్మోగుతోంది. 14 ఏళ్ల ఈ చిచ్చర పిడుగు క్రికెట్‌లో స్వల్పకాలంలోనే నెలకొల్పిన రికార్డులు ఎన్నో. ఈనేపథ్యంలో అతడి గురించి తెలుసుకొనేందుకు గూగుల్‌లో విపరీతంగా శోధించారు. దాంతో 2025లో అత్యధికమంది శోధించిన వారిలో భారత్ నుంచి వైభవ్ టాప్‌లో నిలిచాడు. ఈక్రమంలో స్టార్లు కోహ్లీ, రోహిత్‌లను సూర్యవంశీ వెనక్కు నెట్టాడు.

పాక్‌లో అభిషేక్ కోసం..: ఇక టీ20 క్రికెట్‌లో సంచలన బ్యాటర్ అభిషేక్ శర్మకు పాకిస్థాన్‌లో ఆదరణ లభించడం విశేషం. పొట్టి ఫార్మాట్‌లో అతడి ఆట తీరుకు ఫిదా అయిన పాకిస్థానీయులు.. అభిషేక్ గురించి మరిన్ని వివరాలు తెలుసుకొనేందుకు భారీసంఖ్యలో ప్రయత్నించారు.

హోప్ అజేయ శతకం

విండీస్ రెండో ఇన్నింగ్స్ 212/4

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో విండీస్ పోరాడుతోంది. 530 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన ఈ జట్టు హోప్ (116 బ్యాటింగ్) అజేయ శతక సహాయంతో రెండో ఇన్నింగ్స్‌లో 212/4 స్కోరు చేసింది. అయితే 74 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయిన వేళ.. గ్రీవ్స్ (55 బ్యాటింగ్)తో కలిసి హోప్ ఐదో వికెట్‌కు 140 పరుగులు జోడించాడు. విండీస్ విజయానికి మరో 319 పరుగులు చేయాల్సి ఉంది. కివీస్ రెండో ఇన్నింగ్స్‌ను 466/8 వద్ద డిక్లేర్ చేసింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 231, విండీస్ 167 పరుగులు చేశాయి.

డేవిస్ కప్ వేదిక బెంగళూరు

- నెదర్లాండ్స్‌తో భారత్ పోరు

న్యూఢిల్లీ: వచ్చే ఫిబ్రవరి 7, 8 తేదీల్లో నెదర్లాండ్స్‌తో భారత్ ఆడే డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌కు బెంగళూరు ఆతిథ్యమివ్వనుంది. బిడ్డింగ్‌లో ఢిల్లీని అధిగమించి బెంగళూరు ఆతిథ్య హక్కులు దక్కించుకుంది. బెంగళూరులో చివరిసారిగా 2017లో డేవిస్ కప్ జరిగింది.

సీమా పూనియాపై 16 నెలల నిషేధం



న్యూఢిల్లీ: మహిళల డిస్కస్ త్రోయర్, ఆసియా క్రీడల మాజీ చాంపియన్ సీమా పూనియా డోప్ పరీక్షలో విఫలమైంది. దీంతో ఆమెపై 16 నెలల నిషేధం విధిస్తున్నట్టు డోపింగ్ నిరోధక క్రమశిక్షణ ప్యానెల్ శుక్రవారం ప్రకటించింది. పూనియా డోప్ పరీక్షలో పాజిటివ్‌గా తేలడం ఇది మూడోసారి. కాగా, 42ఏళ్ల సీమ చివరిసారిగా 2023 ఆసియా క్రీడల్లో పోటీపడింది. ఆ టోర్నీలో కాంస్యం నెగ్గింది. అయితే, ఆమె ఏ టోర్నీ సందర్భంగా డోప్ పరీక్షలో విఫలమైంది, ఎలాంటి నిషేధిత ఉత్ప్రేరకం తీసుకుందన్న వివరాలు వెల్లడికాలేదు.

ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 378/6

జేక్, లబుషేన్, స్మిత్ అర్ధ శతకాలు | **ఇంగ్లండ్‌తో యాషెస్ రెండో టెస్ట్**



బ్రిస్బేన్: టాపార్డర్ బ్యాటర్లు జేక్ వెదరాల్డ్ (72), లబుషేన్ (65), తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్ (61) అర్ధ శతకాలతో సత్తా చాటడంతో యాషెస్ రెండో టెస్ట్ (డే/నైట్)లో ఆస్ట్రేలియా ఆధిక్యంలో నిలిచింది. రెండోరోజు ఆట ముగిసే సరికి ఆతిథ్య జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లకు 378 పరుగులు చేసింది. కంగారూలు 44 పరుగుల ఆధిక్యంలో నిలవగా..ఇంకా నాలుగు వికెట్లు చేతిలో ఉన్నాయి. శుక్రవారం ఆఖరికి కేరీ (46 బ్యాటింగ్), మైకేల్ నేసర్ (15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ 325/9 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ మరో 9 పరుగులు చేసి 334 రన్స్‌కు ఆలౌటైంది. ఆస్ట్రేలియాకు ఓపెనర్లు హెడ్ (33), జేక్ (77) శుభారంభం అందించారు. అయితే హెడ్‌ను అవుట్ చేసిన కార్స్ మొదటి వికెట్ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లంతా బాధ్యతాయుతంగా ఆడడంతో ఆసీస్ 400 పరుగుల సమీపంలోకి వచ్చింది. ఇంగ్లండ్ ఫీల్డర్లు ఏకంగా ఐదు క్యాచ్‌లు వదిలేయడం ఆస్ట్రేలియాకు లాభించింది.

సంక్షిప్తస్కోర్లు: ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 334 (రూట్ నాటౌట్ 138, క్రాలే 76, ఆర్చర్ 38, బ్రూక్ 31, స్టార్క్ 6/75); **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 378/6 (జేక్ వెదరాల్డ్ 72, లబుషేన్ 65, స్మిత్ 61, కేరీ 46 బ్యాటింగ్, గ్రీన్ 45, కార్స్ 3/113, స్టోక్స్ 2/93).

కావాలనే సంక్షోభం?

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసుల రద్దు, జాప్యం వంటి చర్యలతో ప్రయాణికులకు ఇబ్బందులు సృష్టించడం ద్వారా నిబంధనల సడలింపు కోసం యాజమాన్యం ప్రయత్నించిందా? అంటే తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, గ్రౌండ్ స్టాఫ్ సహా ఇండిగో సిబ్బంది సంతకాలు చేసి, రాసినట్లుగా పేర్కొంటున్న ఓ బహిరంగ లేఖ ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది. శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ లేఖ వైరల్‌గా మారింది. ఈ సంక్షోభానికి కారణం కేవలం నిర్వహణలో వైఫల్యం కాదని.. ప్రణాళికలు, ఫ్రంట్‌లైన్ ఉద్యోగుల రక్షణలో వైఫల్యమని ఇండిగో సిబ్బంది లేఖలో పేర్కొన్నారు. సంక్షోభానికి కారణమైన నిర్ణయాలు తీసుకున్న వారంతా తాజా పరిణామాలకు దూరంగా ఉన్నారని.. ఇందుకు సంబంధంలేని ఉద్యోగులు మాత్రం ప్రయాణికుల ఆగ్రహాన్ని చవిచూస్తున్నారని వాపోయారు. డీజీసీఏ నిబంధనలు అమల్లోకి వచ్చిన సమయంలోనే భారీగా విమాన సర్వీసులు రద్దవడం యాదృచ్ఛికం కాదని.. దీని వెనకున్న కారణాలను విస్మరించరాదన్నారు. సంక్షోభాన్ని సృష్టించి, డీజీసీఏ నిబంధనల సడలింపు కోసమే నిర్వహణా వైఫల్యం జరిగినట్లుగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో ఫ్రంట్‌లైన్ సిబ్బందిని వాడుకొని, వారి సమస్యలను పరిష్కరించుకున్నట్లుగా కనిపిస్తోందని పేర్కొన్నారు. డీజీసీఏ మీద ఒత్తిడి తెచ్చే వ్యూహంలో భాగంగానే ఇదంతా చేస్తున్నట్లుగా ఉందని.. ఈ విషయంలో యాజమాన్యం పారదర్శకంగా వ్యవహరించాలని, ఫ్రంట్‌లైన్ సిబ్బంది తప్పేంలేదని ప్రయాణికులకు తెలియజేయాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతంకాకుండా చూడాలన్నారు.

డీజీసీఏ కీలక నిర్ణయం

ఇండిగో విమాన సర్వీసుల సంక్షోభంతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) పైలట్ల విధులకు సంబంధించి ఇండిగోకు ఊరట కల్పించేలా పైలట్ల వారాంతపు విశ్రాంతి (వీక్లీ రెస్ట్) నిబంధనలో మార్పులు చేస్తూ శుక్రవారం ఓ ప్రకటన చేసింది. వందలాది సర్వీసుల రద్దుతో సతమతమవుతున్న ఇండిగో.. నిబంధనలు సడలించాలంటూ డీజీసీఏను ఆశ్రయించిం ది. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీ టీఎల్) నుంచి ఉపశమనం కల్పించాలని కోరిం ది. దీంతో పైలట్ల విధులకు సంబంధించి తాజా మార్పు లు చేపట్టింది. ఇవి తాత్కాలికం మాత్రమేనని పేర్కొంది. గతంలో పైలట్లకు వారంలో విశ్రాంతి సమయాన్ని 36గంటల నుంచి 48గంటలకు పెంచగా ఇప్పుడు ఈ వీక్లీ రెస్ట్‌ను సెలవుగా పరిగణించనున్నట్లు డీజీసీఏ ప్రకటించింది. అంతకుముందు, డీజీసీఏ కొత్త నిబంధనల ప్రకారం..వీక్లీ రెస్ట్‌ను సెలవుగా పరిగణించే అవకాశం లేదు. వీక్లీ రెస్ట్ పీరియడ్, సెలవులను వేర్వేరుగా చూసేవారు. పైలట్ల అలసట సమస్య పరిష్కారానికి ఈ కఠిన నిబంధనలు తెచ్చారు. కానీ, ఇండిగో విమానాల రద్దు నేపథ్యంలో ఈ నిబంధనను కాస్త సడలించారు. ఇక, పైలట్ల రాత్రి విధులపై ఉన్న నిబంధనల విషయంలో డీజీసీఏ.. ఇండిగోకు భారీ ఉపశమనం కల్పించింది. పైలట్లు వరసగా రెండు కంటే ఎక్కువ రాత్రి షిఫ్ట్‌లు చేయకూడదనే నిబంధనను తాత్కాలికంగా ఉపసంహరించుకున్నట్లు తెలిపింది. ఇండిగో పైలట్లు వారంలో ఆరు నైట్ డ్యూటీలు నిర్వహించే అవకాశాన్ని కల్పించింది. ప్రస్తుత గందరగోళాన్ని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మినహాయింపులు వచ్చే ఫిబ్రవరి 10వరకు అమల్లో ఉంటాయని, ప్రతి 15 రోజులకోసారి వీటిపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొంది. ఇండిగో వ్యవహారంపై కేంద్ర పౌరవిమానయాన శాఖ ఉన్నతస్థాయి దర్యాప్తుకు ఆదేశించింది. పరిస్థితులను సమీక్షించేందుకు నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ విమానాల రాకపోకల్లో అంతరాయాలకు కారణాలను గుర్తించడం, ఎఫ్‌డీటీఎల్ నిబంధనలనుగుణంగా మానవ వనరుల సర్దుబాటు, రోస్టర్‌ను తయారు చేస్తున్నారా? లేదా? అన్నది పరిశీలించడం వంటి పనులు చేయాలి. 15 రోజుల్లోగా డీజీసీఏకు నివేదికను సమర్పించాలి. కేంద్ర పౌర విమానయాన శాఖ ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది.

ఇండిగోపై చర్యలు తీసుకుంటాం: రామ్మోహన్

ఇండిగో సంక్షోభం అతి త్వరలోనే సమసిపోతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ప్రభుత్వ చర్యల కారణంగా వచ్చే మూడు రోజుల్లో ఇండిగో విమాన సర్వీసులన్నింటినీ పునరుద్ధరించే అవకాశం ఉందన్నారు. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను దేశంలోని విమానయాన సంస్థలన్నీ అమలు చేస్తున్నాయని, వాటికెలాంటి ఇబ్బందులూ లేవని.. ఒక్క ఇండిగోలోనే సమస్యలు తలెత్తాయని గుర్తుచేశారు. తప్పంతా ఇండిగో యాజమాన్యానిదేనన్నారు. "సంస్థపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు మెరుగైన సేవలందేలా చూడడం మా విధి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యతా మాదే. దర్యాప్తు అనంతరం కచ్చితంగా చర్యలు తీసుకుంటాం"అని రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. కాగా ఇండిగోకు ఊరట కల్పించేందుకు డీజీసీఏ నిబంధనలను సడలించడంపై పైలట్ల సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇది ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తుందని పేర్కొన్నాయి. కాగా ఇండిగో సంక్షోభం కారణంగా నాలుగో రోజూ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. శుక్రవారం ఇండిగో వెయ్యికి పైగా విమాన సర్వీసులను రద్దు చేసింది. ఢిల్లీ నుంచి బయల్దేరాల్సిన అన్ని విమానాలూ (దాదాపు 235) రద్దయ్యాయి. శంషాబాద్ విమానాశ్రయంతోపాటు దేశం లోని ప్రధాన నగరాల్లో ఇండిగో ప్రయాణికుల పరిస్థితి దారుణంగా మారింది. శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించాల్సిన 155 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ముంబై నుంచి 104, బెంగళూరు నుంచి 102 విమానాలు రద్దయ్యాయి. కాగా ఈ నెల 10-15 నాటికి విమాన సర్వీసులు సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉందని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు. శనివారం 1000కన్నా తక్కువ విమానాలే రద్దవుతాయని భావిస్తున్నామన్నారు.



బెంగళూరు ఎయిర్‌పోర్టులో విమానాల రద్దు కారణంగా లగేజీతో ప్రయాణికుల ఇబ్బందులు

భారీగా పైలట్ల కొరత..

దేశంలో విమాన పైలట్ల కొరత భారీగా ఉంది. డీజీసీఏ ప్రకారం 26,500 మంది లైసెన్స్‌డ్ పైలట్లు ఉన్నారు. కానీ, వీరిలో భారత్‌లో విమానయాన సంస్థల్లో పనిచేస్తున్నవారు 11,700 మందే. వేతనాలు ఎక్కువగా వస్తుండడంతో కొందరు విదేశాలకు వెళ్లారు.

విమాన ప్రయాణం.. ప్రయాస!

- ఇండిగో విమాన సర్వీసుల సంక్షోభంతో విశాఖ, రాజమండ్రిల్లో పలు సర్వీసులు రద్దు

రాజమహేంద్రవరం, గోపాలపట్నం (విశాఖపట్నం), చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పరమైన లోపాల కారణంగా వందలాది ఇండిగో విమాన సర్వీసులు రద్దవడం రాష్ట్రంలో తీవ్ర ప్రభావమే చూపింది. కొన్ని విమానాలు రద్దు కావడం, మరికొన్ని ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు నుంచి ప్రతీ రోజూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై, న్యూఢిల్లీకి 11 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తిరుపతికి రోజువిడిచి రోజు ఒక విమానం వెళ్తోస్తుంది. కానీ గురువారం నుంచి ఆకస్మికంగా విమానాలు రద్దవడం, ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజమహేంద్రవరం నుంచి ముంబై వెళ్లాల్సిన ఇండిగో విమానం గురువారం రాత్రి 8.30 గంటలకు రావాల్సి ఉండగా.. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు వచ్చింది. దీంతో 160 మంది ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలోనే జాగారం చేయాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టు, విమానయాన సంస్థ అధికారులు కొందరికి రాజమండ్రిలో హోటల్ రూమ్‌లు బుక్‌చేయగా.. కొందరు ఇళ్లకు వెళ్లి ఫ్లైట్ సమయానికి వచ్చారు. చాలా మంది ఎయిర్ పోర్టులోనే ఉండిపోయారు. శుక్రవారం.. న్యూఢిల్లీ, ముంబై వెళ్లాల్సిన విమానాల సర్వీసులు రదయ్యాయి. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నుంచి రావాల్సిన విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. బెంగళూరు నుంచి శుక్రవారం ఉదయం రావాల్సిన విమానం అర్ధరాత్రి 12 గంటలకు రావొచ్చని అధికారులు చెబుతున్నారు. దీంతో సుమారు 70 మంది ప్రయాణికులు ఈ రాత్రి కూడా ఎయిర్‌పోర్టులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెన్నై విమానం శుక్రవారం రావాల్సి ఉండగా అది శనివారం రావొచ్చని సమాచారం.

విశాఖ నుంచి 15 విమానాలు రద్దు

విశాఖ విమానాశ్రయం నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన 14 ఇండిగో విమాన సర్వీస్‌లతోపాటు ఒక అంతర్జాతీయ విమానాన్ని శుక్రవారం రద్దు చేశారు. వీటిలో విశాఖ-హైదరాబాద్, విశాఖ-బెంగళూరు, విశాఖ-చెన్నై, విశాఖ-కోల్‌కత్తా, విశాఖ-ఢిల్లీ, విశాఖ-ముంబై, విశాఖ-తిరుపతి, విశాఖ-అబుదాబి, తదితర సర్వీసులు ఉన్నాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

చెన్నై నుంచి వివిధ మార్గాల్లో తిరగాల్సిన 66 ఇండిగో విమాన సర్వీసులు రద్దయినట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 12 నుంచి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరికొన్ని విమానాల రాకపోకల్లో తీవ్ర జాప్యం నెలకొంది. పలు విమానాల రద్దు, మరికొన్ని ఆలస్యం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంన్నారు.

విమానం రద్దు.. వర్చువల్‌గా రిసెప్షన్

కొత్తజంటకు అనూహ్య పరిస్థితి

బెంగళూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విమాన సర్వీసు రద్దుతో ఓ నవదంపతులకు అనూహ్య పరిస్థితి ఎదురైంది. కర్ణాటకలోని హుబ్బళ్లిలో వారి వివాహ రిసెప్షన్‌కు బంధువులు అందరూ హాజరైనా నవదంపతులు మాత్రం రాలేకపోయారు. చివరకు వర్చువల్‌గా హాజరై మమ అనిపించారు. ఇండిగో విమానం రద్దుతో వారు భువనేశ్వర్‌లో చిక్కుకుపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేసే సంగమ్ దాస్, మేఘా క్షీరసాగర్‌కు నవంబరు 23న భువనేశ్వర్‌లో వివాహమైంది. ఈనెల 3న వధువు స్వస్థలం హుబ్బళ్లిలోని గుజరాత్ భవన్‌లో భారీ ఖర్చుతో రిసెప్షన్‌కు ఏర్పాట్లు చేశారు. ఈ రిసెప్షన్‌కు రావడానికి ఈనెల 2న భువనేశ్వర్, బెంగళూరు, హుబ్బళ్లి రూట్‌లో వధూవరులు ఇండిగో విమాన టికెట్లు బుక్ చేసుకున్నారు. ఇదే సమయంలో ఇండిగోలో నిర్వహణ సంక్షోభం తలెత్తడంతో వారి విమా న సమయం పలుమార్లు వాయిదా పడి చివరికి రద్దయింది. వారు వచ్చేందుకు వేరే దారి లేకపోవడంతో రిసెప్షన్ హాల్‌లో పెద్ద స్ర్కీన్ ఏర్పాటు చేయడంతో వీడియో కాల్ ద్వారా వేడుకకు హాజరయ్యారు. స్ర్కీన్‌పై కనిపిస్తున్న నవజంటను బంధువులు ఆశీర్వదించారు.



'మ్యాచ్‌ఫిక్సింగ్' గుత్తాధిపత్యం వల్లే ఇండిగో సంక్షోభం



న్యూఢిల్లీ, డిసెంబరు 5: మోదీ ప్రభుత్వ గుత్తాధిపత్య విధానం వల్లే 'ఇండిగో' సంక్షోభం తలెత్తిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రతి రంగంలోనూ న్యాయబద్ధమైన పోటీ ఉండాలని.. మ్యాచ్‌ఫిక్సింగ్‌తో కూడిన గుత్తాధిపత్యాలు పనికిరావని శుక్రవారం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. ఇండిగో సంస్థ గురు, శుక్రవారాల్లో భారీగా విమాన సర్వీసు లను రద్దు చేయడంతో వేల మంది ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలగడం తెలిసిందే. దీనిపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. విమానాల ఆలస్యం, రద్దు, నిస్సహాయత కారణంగా సాధారణ భారతీయులు మూల్యం చెల్లించుకుంటున్నారని తెలిపారు. ఈస్టిండియా కంపెనీ 150ఏళ్ల కిందటే దేశం దాటి వెళ్లిపోయిందని.. ఇన్నేళ్లకు కొత్త జాతి ఏకస్వామ్యవాదులు దాని స్థానంలో వచ్చారంటూ గత ఏడాది ఓ పత్రికకు తాను రాసిన వ్యాసాన్ని ఈ సందర్భంగా ఆయ న షేర్ చేశారు. 'విమానాశ్రయాల్లో ప్రస్తుతం జరుగుతున్నది గుత్తాధిపత్యం లేదా ఏకాధిపత్యం ఫలితమే. స్లిప్పర్లు వేసుకునే వారు విమానాలు ఎక్కుతారని చెప్పారు. కానీ ఇప్పుడు ప్రయాణికులు, ఇండిగో సిబ్బంది పరస్పరం బూట్లు, చెప్పులు విసురుకుంటున్నారు' అని ఏఐసీసీ మీడియా విభాగం ఇన్‌చార్జి పవన్ ఖేరా ఎద్దేవాచేశారు. దేశంలో చాలా రంగాలు కొద్ది మంది చేతుల్లోనే ఉన్నాయని, ఈ ప్రభుత్వం వల్లే ఇలా జరుగుతోందని.. ఇది ఆర్థిక వ్యవస్థకు, ప్రజాసామ్యానికి, దేశానికీ ఆరోగ్యకరంకాదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ అన్నారు. విమానయాన పరిశ్రమలో ఒకప్పుడు పోటీ ఉండేదని.. మోదీ ప్రభుత్వం దాన్ని రెండు కంపెనీల చేతుల్లో పెట్టిందని.. ప్రయాణికుల ప్రయోజనాలకంటే కార్పొరేట్ పేరాశకే ప్రాధాన్యమిస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ధ్వజమెత్తారు.

చిత్రజ్యోతి

SINCE 1965



జపాన్‌లో ప్రభాస్ సందడి

ప్రభాస్ నటించిన 'బాహుబలి ది ఎపిక్' సినిమాను జపాన్‌లో ప్రదర్శిస్తున్నారు. దీంతో చిత్ర నిర్మాత శోభు యార్లగడ్డతో కలిసి ప్రభాస్ జపాన్ వెళ్లారు. అక్కడి అభిమానులతో కలిసి 'బాహుబలి ది ఎపిక్' చూశారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

ఆ ప్రశంసలు నమ్మకాన్ని పెంచాయి

'అఖండ' సమస్య పరిష్కారానికి నా వంతు ప్రయత్నం చేశా

- నిర్మాత సురేశ్‌బాబు

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో వ్యాపార కోణం మరీ ఎక్కువగా రచ్చకెక్కడం దురదృష్టకరం. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ 'సమస్య, డబ్బులు' అని చర్చిస్తున్నారు. అసలు ఇవన్నీ ఎందుకు? ప్రేక్షకులు సినిమాను ఆస్వాదించడమే మనకు ముఖ్యం' అని నిర్మాత డి. సురేశ్‌బాబు వ్యాఖ్యానించారు. ఆర్థిక లావాదేవీల కారణంగా 'అఖండ' చిత్రం విడుదల నిలిచిపోయిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా ఆయన పై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మాట్లాడుతూ 'ఆర్థికపరమైన విషయాలను బహిరంగంగా చర్చించకూడదు. అందుకే నేను ఆ వివాదం లోతుల్లోకి వెళ్లడం లేదు. అయితే సమస్య పరిష్కారం కోసం నా వంతు ప్రయత్నం మాత్రం చేశాను. ఈ రోజే ఆ వివాదం పూర్తిగా సమసిపోయి, సినిమా విడుదలవ్వాలని కోరుకుంటున్నాను. పరిశ్రమలో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎప్పుడూ ఉండేవే. గతంలో మా ల్యాబులు ఉన్నప్పుడూ ఉన్నాయి. కాబట్టి నిర్మాతలు వీటికి ముందే సిద్ధమవ్వాలి' అని తెలిపారు.



"'పెళ్లి చూపులు, కేరాఫ్ కంచరపాలెం' చిత్రాల తర్వాత ఆ స్థాయిలో ఎఫర్ట్ పెట్టి తీసిన చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. ఇలాంటి సినిమాకు తప్పకుండా సపోర్ట్ చేయాలనిపించింది. అందుకే మేము విడుదల చేస్తున్నాం' అని నిర్మాత డి. సురేశ్‌బాబు అన్నారు. శ్రీనందు హీరోగా వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రమిది. శ్యామ్ సుందర్‌రెడ్డి తుడుతో కలిసి శ్రీనందు నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీనందు మాట్లాడుతూ 'సురేశ్‌బాబు గారి సూచనల వల్ల సినిమా అద్భుతంగా వచ్చింది. ఆయన ఈ సినిమాను కొన్న రోజు నా ఆనందానికి హద్దులు లేవు. కే. రాఘవేంద్రరావు గారు మా సినిమా చూసి ప్రశంసించడం మా సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచింది' అని తెలిపారు. ప్రేక్షకులు ఆద్యంతం ఆస్వాదించేలా మా చిత్రం ఉంటుందని కథానాయిక యామిని భాస్కర్ చెప్పారు.





కన్మని కందస్వామి నేతృత్వంలో జపాన్ నుంచి వచ్చిన అభిమానులు హీరో రామ్‌చరణ్‌ని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ వారికి ఒక చిన్న బ్యాట్, టీషర్ట్‌ను బహూకరించారు. 'పెద్ది' సినిమా ప్రమోషన్ కోసం జపాన్ వచ్చినప్పుడు తప్పకుండా కలుస్తానని రామ్‌చరణ్ వారికి హామీ ఇచ్చారు.

సరికొత్త 'అమరకావ్యం'



ధనుష్, కృతి సనన్ జంటగా ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో భూషణ్ కుమార్ నిర్మించిన సరికొత్త ప్రేమ కథా చిత్రం 'తేరే ఇష్క్ మై'. 'అమరకావ్యం' పేరుతో తెలుగులో ఇటీవలె విడుదలైన ఈ చిత్రం థియేటర్లలో సందడి చేస్తోంది. ధనుష్, కృతి సనన్ నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం తెలుగు ట్రైలర్ ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ, ప్రేమను కోల్పోయిన బాధ నుంచి హీరో బయటకు రావడం వంటి సన్నివేశాలను ట్రైలర్‌లో చాలా చక్కగా చూపించారు. ఈ సినిమాకు ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం సమకూర్చారు.

భయంకరంగా ఉంది కానీ బావుంది అన్నారు



మన్నె శ్రీనివాస్

జెనీలియా ప్రధాన పాత్రలో రూపొందిన 'కథ' చిత్రంతో దర్శకుడిగా విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు శ్రీనివాస్ మన్నె. ఈ సారి తన పంథా మార్చి 'ఈషా' అనే హారర్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. అఖిల్ రాజ్, త్రిగుణ్, హెబ్బాపటేల్ ప్రధాన పాత్రలు పోషించగా, హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతున్న సందర్భంగా శ్రీనివాస్ మన్నె మీడియాతో మాట్లాడారు. 'నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ ప్రోత్సాహంతో ఆయన సమర్పణలో 'ఈషా' చేశాను. ఈ సినిమాలో హారర్‌తోపాటు మనిషి చావు పుట్టుకలు, దైవత్వం, సృష్టి పరిణామ క్రమం లాంటి అంశాలను అంతర్లీనంగా చర్చించాం. సాంకేతికంగా సినిమా చాలా ఉన్నతంగా ఉంటుంది. సినిమాలో భయపెట్టే అంశాలు చాలా ఉన్నాయి. గుండె ధైర్యం లేనివాళ్లు ఈ సినిమా చూడకూడదు. సెన్సార్ వాళ్లు సినిమా చూసి 'చాలా భయంకరంగా ఉంది కానీ బావుంది' అన్నారు. ఆత్మలు ఉన్నాయా? లేవా? అనేది సినిమా చూస్తే తెలుస్తుంది. కొన్ని సన్నివేశాల్లో ప్రేక్షకులు వణికిపోతారు. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాను అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువ చేస్తారు' అని చెప్పారు.

శంబాలా.. వింత ప్రపంచం!



ఆది సాయికుమార్ హీరోగా నటించిన థ్రిల్లర్ మూవీ 'శంబాలా' ఈ నెల 25న విడుదల కానుంది. యుగంధర్ ముని దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి 'ఏ మిస్టికల్ వరల్డ్' అనేది ట్యాగ్‌లైన్. ఈ సినిమాను తెలంగాణ ప్రాంతంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ విడుదల చేస్తోంది. 'మా ప్రయాణంలో మైత్రివారు కూడా జాయిన్ కావడం చాలా ఆనందంగా ఉంది. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో సినిమా ఉంటుంది' అని నిర్మాతలు రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి చెప్పారు. ఈ చిత్రంలో ఆది సాయికుమార్ సరసన అర్చన్ అయ్యర్ కథానాయికగా నటించారు. శ్వాసిక కీలక పాత్ర పోషించారు. రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ కీలక పాత్రల్లో నటించారు.



ప్రత్యేక గీతం మెరుపులు!

సందీప్‌కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ కామెడీ చిత్రం 'సిగ్మా'. జాసన్ సంజయ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ఇందులో కొన్ని ప్రత్యేక అతిధి పాత్రలు ఉన్నాయి. అలాగే హీరోయిన్ కేథరిన్ థ్రెస్సా ఓ స్పెషల్ సాంగ్ చేస్తున్నారు. ఇందుకోసం సంగీత దర్శకుడు తమన్ ఓ పవర్‌ఫుల్ ట్రాక్ రెడీ చేశారు. సందీప్‌కిషన్, కేథరిన్‌పై ఓ కలర్‌ఫుల్ సెట్‌లో చిత్రీకరించిన ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు. చెన్నై, తలకోన, థాయ్‌లాండ్‌లో తమిళ, తెలుగు భాషల్లో 'సిగ్మా' షూటింగ్ ఏక కాలంలో జరిగింది. వచ్చే ఏడాది వేసవిలో ఈ చిత్రం విడుదల కానుంది.

నేనేం నిధులు దుర్వినియోగం చేయలేదు

తమ్మారెడ్డి భరద్వాజ



'గతంలో నేను కొంతకాలం చిత్రపురి కాలనీ కమిటీలో సభ్యుడిగా ఉన్నాను. ప్రస్తుతం చిత్రపురి కాలనీ ప్రాజెక్టు మొత్తం విలువ రూ.500 కోట్లు. నేను సభ్యుడిగా చేరేనాటికి అది రూ.180 కోట్లు మాత్రమే. అయితే వందల కోట్లు తినేశారనే దుష్ప్రచారం జరుగుతోంది. ప్రాజెక్టు విలువే రూ.500 కోట్లయితే వందల కోట్ల అవినీతికి ఆస్కారం ఎక్కడుంటుంది. నేనేమీ డబ్బులు తినలేదు. నిధులు దుర్వినియోగం చేయలేదు. గతంలో చిత్రపురి కమిటీలో సభ్యుడిగా ఉన్నందునే నా పేరు నివేదికలో ఉంది. ఆ నివేదిక పూర్తిగా చదివితే అర్థమవుతుంది' అని అన్నారు దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. చిత్రపురి కాలనీ హౌజింగ్ సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపిన గోల్కొండ కో ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవలె ఓ నివేదికను అందజేసిన విషయం తెలిసిందే. ఈ నివేదికలో తన పేరు చేర్చడంపై తమ్మారెడ్డి భరద్వాజ 'చిత్రజ్యోతి'తో మాట్లాడారు. 'కమిటీలో ఉన్నవారందరినీ బాధ్యుల్ని చేస్తున్నారు. 2005 నుంచి 2010 వరకు ఎలాంటి అక్రమాలు జరగలేదని నివేదికలో పేర్కొన్నారు. ఆ సమయంలో కొంత కాలం నేను సెక్రటరీగా ఉన్నాను. 2010 నుంచి 2015 వరకు కొన్ని అవకతవకలు జరిగాయని చెప్పారు. 2015 తర్వాత నేను, మరో ముగ్గురు సభ్యులం కమిటీ నుంచి రిలీవ్ అయ్యాం. అప్పటి నుంచి జరిగిన వ్యవహారాలకు నాకు సంబంధం లేదు. అయితే నేను కమిటీలో ఉన్న సమయంలో సభ్యుడొకరు రూ. 30 లక్షలు వాటర్ వర్క్స్ కోసం చెల్లించారు. ఆ వివరాలను మినిట్స్‌లో రాయలేదు. దాన్ని గమనించకపోవడం నా బాధ్యతా రాహిత్యమే. అందుకే నాకు భారమైనప్పటికీ నివేదికలో పేర్కొన్న ప్రకారం డబ్బు కట్టేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇది నేను వ్యక్తిగతంగా తీసుకున్న నిర్ణయం. నివేదికలో పేర్లు ఉన్న వారంతా కడతారా లేదా అన్నది వారి ఇష్టం. అలాగే నివేదికపై నేను కోర్టుకు వెళ్లే అవకాశమున్నా వెళ్లడం లేదు' అని చెప్పారు.

మరో రెండు సెట్ల నివేదికలు సమర్పించండి

▸▸ 'పరకామణి' కేసులో సీఐడీ, ఏసీబీలకు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసును లోక్ అదాలత్ వద్ద రాజీచేసిన వ్యవహారంతోపాటు నిందితుడు రవికుమార్ ఆస్తులకు సంబంధించిన నివేదికలు మరో రెండు సెట్లను సీల్డ్ కవర్‌లో సోమవారంలోగా రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు సమర్పించాలని సీఐడీ, ఏసీబీ డీజీలను హైకోర్టు ఆదేశించింది. చోరీ కేసు రాజీకి సంబంధించి లోక్ అదాలత్ అవార్డ్ చట్టబద్ధతపై విచారణ జరుపుతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం పరిశీలన నిమిత్తం ఈ నివేదికలు వారి ముందు ఉంచాలని రిజిస్ట్రీకి స్పష్టం చేసింది. ఆ నివేదికలు తమకు కూడా ఇవ్వాలని నిందితుడు రవికుమార్ తరఫు సీనియర్ న్యాయవాది నాగేశ్వరరావు గత విచారణలో అభ్యర్థించారని గుర్తు చేసింది. ఈ దశలో వాటిని పొందేందుకు నిందితుడు అర్హుడు కాదని తేల్చిచెప్పింది. ప్రస్తుతం సీఐడీ, ఏసీబీ డీజీలు వేసిన నివేదికలు కేవలం కోర్టు పరిశీలన కోసమేనని స్పష్టం చేసింది. నివేదికలను అధ్యయనం చేసి తగిన ఉత్తర్వులు జారీ చేసేందుకు వీలుగా విచారణను ఈ నెల తొమ్మిదో తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ... ఈ కేసులో తాము ఇంప్లీడ్ పిటిషన్ వేశామన్నారు. కొత్త న్యాయవాది వకాలత్ వేశారని, కేసుల జాబితాలో ఆ న్యాయవాది పేరును ప్రచురించేలా చూడాలన్నారు. అందుకు అంగీకరిస్తూ, న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు.

పరకామణి దొంగలకు తాడేపల్లి దొంగల వత్తాసు

▸▸ జగన్ హిందువులకు క్షమాపణ చెప్పాలి: నీలాయపాలెం

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బెంగళూరు నుంచి వచ్చి 3 గంటలపాటు పెట్టిన ప్రెస్‌మీట్‌లో హిందూ భక్తులను, వారి మనోభావాలను కించపరిచేలా మాట్లాడారని ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పరకామణి దొంగలకు తాడేపల్లి దొంగలు వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు.

వేల కోట్ల గజదొంగకు పరకామణి చోరీ చిన్నదే కావచ్చు

▸▸ జగన్‌పై టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభి ఫైర్

తిరుపతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వేల కోట్లు దొంగిలించిన గజదొంగకు పరకామణి వ్యవహారం చిన్నదే కావచ్చని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మాట్లాడారు. 'తండ్రిని అడ్డుపెట్టుకుని వేలకోట్లు సంపాదించి, 18 ఈడీ కేసుల్లో ఏ1 ముద్దాయిగా ఉన్న జగన్ రెడ్డికి తిరుమల పరకామణ దొంగతనం చిన్నదే కావచ్చు. క్రిస్టియన్‌గా శ్రీవారి దర్శనానికి వెళ్లి ఒక్కసారి కూడా డిక్లరేషన్‌పై సంతకం పెట్టని వ్యక్తికి ఇది చిన్నదే కావచ్చు. అయితే కోట్లాదిమంది హిందువులు మాత్రం పెద్దవిషయంగా తీసుకున్నారు. వైవీ సుబ్బారెడ్డి పీఏ చినఅప్పన్న ఎవరో తెలియదని జగన్ బుకాయించడం చూస్తే నవ్వొస్తోంది. 2019 అక్టోబరు 10న జీవో 2234 మేరకు ఢిల్లీలోని ఏపీ భవన్‌కు స్పెషల్ లైజనింగ్ ఆఫీసర్‌గా చినఅప్పన్నను స్వయంగా అప్పటి సీఎం జగన్ నియమించారు. ఆ తర్వాత ఆయన సేవలను గుర్తించి మరో మెమో ద్వారా ప్రత్యేక వాహనం, వసతి, విమానం చార్జీలు వంటి సౌకర్యాలు కల్పించారు. స్పెషల్ సెక్రటరీ హోదాను కూడా కట్టబెట్టారు' అంటూ జీవో కాపీలు చూపించారు. దీనికి జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని పట్టాభి డిమాండ్ చేశారు.

అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా త్రివిక్రమరావు

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పి.త్రివిక్రమరావు(విక్రమ్)ను ప్రభుత్వం నియమించింది. పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

కూటమిపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు: సవిత

సోమందేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని మంత్రి సవిత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం మెగా పీటీఎం కార్యక్రమానికి హాజరైన ఆమె మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లపాటు ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలూ చేపట్టని జగన్.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయనీ, ఎక్కడ భోజనం చేస్తాడో, బాక్సు పట్టుకుని ఎక్కడికెళ్తాడో చెప్పాలని ఎద్దేశా చేశారు.

ఏఐ ఆధారిత వృద్ధిలో ఏపీ కీలకం: అశ్వనీ వైష్ణవ్

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఏఐ ఆధారిత వృద్ధిలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. శుక్రవారం, రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిస్తూ.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్న ఏఐ వరల్డ్ సమ్మిట్‌కు సంబంధించిన ఈవెంట్లను.. జీ20 సమావేశాల తరహాలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు. కృత్రిమ మేధ, సెమీ కండక్టర్ల తయారీ, డ్రోన్ టెక్నాలజీ రంగాల్లో భారత్ దూసుకుపోతోందని, కృత్రిమ మేధ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

మొబైల్ టవర్లు ఏర్పాటు చేయండి: ఎంపీ పుట్టా

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న బీఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్ల ఏర్పాటు అంశంపై అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం, కేంద్ర మంత్రితో భేటీ అయిన ఆయన, అనేక గ్రామీణ, సెమీ అర్బన్ మండలాల్లో కొత్త బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర స్థాయిలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

విశాఖ పోర్టు నుంచి 10,707 మంది ప్రయాణం

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చెన్నై పోర్టును ప్రధాన క్రూయిజ్ హబ్‌గా మారుస్తున్నామని, దీనికి అనుసంధానంగా విశాఖపట్నం కూడా కీలక కేంద్రంగా ఎదుగుతోందని కేంద్రం వెల్లడించింది. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నకు కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్వానంద సోనోవాల్ సమాధానమిచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నవంబరు 30 నాటికి విశాఖపట్నం పోర్టులోని క్రూయిజ్ టెర్మినల్ ద్వారా 10,707 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారని తెలిపారు.

వివేకా హత్య కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేయాలి

▸▸ సీబీఐ కోర్టుకు సీనియర్ న్యాయవాది లూథ్రా వినతి

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేయాలని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా నాంపల్లి సీబీఐ కోర్టును కోరారు. మరింత దర్యాప్తు జరపాలని పిటిషన్ దాఖలు చేసిన వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి తరఫున ఆయన శుక్రవారం లిఖితపూర్వక వాదనలు సమర్పించారు. గతంలో సరిగా దర్యాప్తు జరగనందునే ఇప్పుడు మరింత లోతుగా చేయాలని కోరుతున్నామని తెలిపారు. ఇందుకు అభ్యంతరం లేదని సీబీఐ ఇదివరకే కోర్టుకు తెలియజేసిందని గుర్తుచేశారు. లోతుగా దర్యాప్తు చేయడం వల్ల ఈ కేసు ట్రయల్‌కు వచ్చే ఇబ్బందేమీ లేదన్నారు. వేగంగా ట్రయల్ నిర్వహించడం కంటే న్యాయమైన విచారణ చేయడం ముఖ్యమని, ఇదే విషయాన్ని వివిధ కేసుల్లో సుప్రీంకోర్టు స్పష్టంగా తెలియజేసిందని ఉదహరించారు. నిందితులు సాక్షులను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటి ప్రయత్నాలు చేశారని.. నిష్పక్షపాత దర్యాప్తును కోరే హక్కు బాధితులకు ఉంటుందని పేర్కొన్నారు. గత విచారణలో పట్టించుకోని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మాత్రమే పిటిషనర్ కోరుతున్నారని వివరించారు. దీనిపై ఇప్పటికే ప్రధాన వాదనలు పూర్తయ్యాయి. ఈనెల 10వ తేదీన తీర్పును వెల్లడిస్తామని సీబీఐ కోర్టు పేర్కొంది.

జోగి-జనార్దన్ 'లిక్కర్' బంధం!

(మొదటి పేజీ తరువాయి)




జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో దాఖలు చేశారు. విచారణ నివేదికలు, ఇప్పటి వరకు జరిగిన అరెస్టులు, ఇంకా అరెస్టు కాని నిందితుల వివరాలు.. వంటి అంశాలను పొందుపర్చినట్లు తెలిసింది. ముఖ్యంగా ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు, మాజీ మంత్రి జోగి రమేశ్‌ల మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలు, వారి మధ్య జరిగిన బ్యాంకు లావాదేవీలు, కాల్ డేటా, యూపీఐ లావాదేవీలు తదితర వివరాలు పొందుపరిచినట్లు సమాచారం. ఈ కేసులో జోగి రమేశ్, ఆయన సోదరుడి పాత్రపైనా కీలక వివరాలు పొందుపర్చినట్లు తెలుస్తోంది. కేసులో ఉన్న 33 మంది నిందితుల ప్రమేయం, వాటి వివరాలు, ఆధారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం తయారీకి నగదు ఎవరు సమకూర్చారు, మూలాలు, నగదు లావాదేవాలకు సంబంధించి కూడా వివరాలు ఉన్నట్లు సమాచారం. ఎక్సైజ్ ఉన్నతాధికారులు, ఎక్సైజ్ పోలీసులు తయారు చేసిన ఈ ప్రాథమిక చార్జ్‌షీట్‌ను విజయవాడలోని సిట్ అధికారులు పరిశీలించి.. మార్పులు, చేర్పుల అనంతరం తంబళ్లపల్లె కోర్టులో దాఖలు చేశారు. ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీపై గత అక్టోబరు 3న ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. భారీ ఎత్తున నకిలీ మద్యం బాటిళ్లు, తయారీకి వినియోగించిన స్పిరిట్ క్యాన్లు, నకిలీ మద్యం, పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ మద్యం తయారీ కేంద్రం మేనేజర్ కట్టా రాజుకు చెందిన డైరీ, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకుని.. అక్కడే ఉన్న 10 మందిని అరెస్టు చేశారు. తరువాత విచారణలో మొత్తం 33 మందిపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారం అంతటికీ కీలక సూత్రధారిగా వ్యవహరించిన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన అద్దేపల్లి జనార్దన్‌రావుతో పాటు ఇందులో ప్రమేయమున్న మాజీ మంత్రి జోగి రమేశ్, అతని సోదరుడు జోగి రామును కలిపి 29 మందిని అరెస్టు చేశారు. ఇంకా నలుగురు నిందితులు అరెస్టు కావాల్సి ఉంది. తంబళ్లపల్లె నియోజకవర్గ అప్పటి టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి (తర్వాత సస్పెండ్ అయ్యారు), ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్‌తో పాటు మరో వ్యక్తి ఇంకా అరెస్టు కాలేదు. చట్ట ప్రకారం 60 రోజుల్లో కేసుకు సంబంధించి చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ పోలీసులు తొలుత ప్రాథమిక చార్జిషీట్‌ను దాఖలు చేశారు. కేసుకు సంబంధించి విచారణ పూర్తయి నిందితులందరిని అరెస్టు చేసిన తరువాత పూర్తిస్థాయి చార్జ్‌షీట్‌ను దాఖలు చేయనున్నారు.

త్వరలో నలుగురి కస్టడీకి పిటిషన్లు!

ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు, అతని తమ్ముడు జగన్‌మోహన్‌రావు, మాజీ మంత్రి జోగి రమేశ్, అతని సోదరుడు జోగి రాములను కస్టడీకి తీసుకుని విచారించేందుకు ఎక్సైజ్ పోలీసులు సిద్ధమయ్యారు. నలుగురినీ కస్టడీకి ఇవ్వాలని తంబళ్లపల్లె కోర్టులో పిటిషన్లు దాఖలు చేయనున్నారు. దీనికి సంబంధించి పత్రాలు ఇప్పటికే సిద్ధం అయినట్లు సమాచారం.

బీఎస్ఎన్ఎల్ పర్యవేక్షణలో 'ఫైబర్‌నెట్'

▸▸ ప్రైవేటీకరణ లేనట్లే!

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీఫైబర్‌నెట్ లిమిటెడ్ నిర్వహణ వ్యవహారం కొలిక్కివచ్చింది. బీఎస్ఎన్ఎల్ పర్యవేక్షణలోనే ఏపీ ఫైబర్‌నెట్‌ను కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో ఏపీ ఫైబర్‌నెట్‌ను ప్రైవేటీకరించే అవకాశం లేదనే విషయం స్పష్టమైంది. యాజమాన్య నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలన్న యోచనను ఏపీఫైబర్ నెట్ విరమించుకుంది. ఏపీఫైబర్ ఇకపై ఏపీ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఏపీబీఐఎల్)గా చలామణి అవుతుంది. గతంలో ఫైబర్‌నెట్ కార్యకలాపాలన్నింటినీ ప్రైవేటు సంస్థకు అప్పగించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్‌లను కోరుతూ టెండర్లను కూడా పిలిచారు. అయితే, ఇటీవల రాష్ట్రాలతో నిర్వహించిన సమావేశంలో భారత్‌నెట్-2 కింద రాష్ట్రాలన్నింటిలోనూ ఫైబర్‌నెట్ సేవలను బీఎస్ఎన్ఎల్ మాత్రమే అందిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. పదేళ్ల పాటు ఫైబర్ సేవల యాజమాన్య నిర్వహణ కోసం ఒక్కో రాష్ట్రానికి దాదాపు రూ. 200 కోట్ల మేర నిధులు మంజూరు చేయాలన్న యోచనలో ఉంది. ఈ సేవల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఐదుగురు చొప్పున డైరెక్టర్లను నియమిస్తూ మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మొవ్వ తిరుమల కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఎమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ (ఏబీపీ) కింద రాష్ట్రంలో రూ.2,428 కోట్లతో ఫైబర్‌నెట్ సేవలను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫైబర్‌నెట్ ద్వారా తొలిదశలో 26,000 కి.మీ. మేర లైన్లను వేశారు. రెండోదశలో మరో 50,000 కి.మీ.లైన్లను బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో వేస్తారు.

'లిక్కర్ గ్యాంగ్'కు రిమాండ్ పొడిగింపు

▸▸ ఈ నెల 19 వరకు పెంచిన ఏసీబీ కోర్టు

▸▸ చెవిరెడ్డి సహా పలువురు నిందితుల బెయిల్ పిటిషన్లు కొట్టేసిన న్యాయస్థానం

▸▸ ఇంటి భోజనానికి అనుమతి కోరిన రోణక్



కోర్టు ప్రాంగణం వద్ద నమస్కరిస్తున్న లిక్కర్ కేసు నిందితుడు చెవిరెడ్డి

విజయవాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో వివిధ జైళ్లలో ఉన్న రిమాండ్ ఖైదీలకు ఈ నెల 19 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. విజయవాడ జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, బూనేటి చాణక్య, చెరుకూరి వెంకటేశ్‌నాయుడు, అనిల్ చోక్రా, గుంటూరు జిల్లా జైల్లో ఉన్న నవీన్‌కృష్ణ, బాలాజీ కుమార్ యాదవ్, జెస్సీ ఫాల్గట్ కుమార్ అలియాస్ రోణిక్ కుమార్ రిమాండ్ గడువు ముగియడంతో శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వారికి ఈ నెల 19 వరకు రిమాండ్ పొడిగిస్తున్నట్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. బెయిల్‌పై బయట ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కె. ధనంజయ్‌రెడ్డి, పి. కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ కుమార్‌లు కూడా వాయిదాకు హాజరయ్యారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనడానికి కోర్టు అనుమతి ఇవ్వడంతో రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి హాజరు కాలేదు. మరో నిందితుడు పైలా దిలీప్ వాయిదాకు హాజరుకాలేనని పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా వుంటే.. ధనంజయ్‌రెడ్డి సిట్ అధికారులపై న్యాయాధికారికి ఫిర్యాదు చేశారు. తాము వాయిదాలకు వచ్చినప్పుడు విమానాశ్రయంలో కొందరిని యాదృచ్ఛికంగా కలుస్తున్నామన్నారు. ఈ సందర్భాల్లో సిట్ అధికారులు ఫొటోలు, వీడియోలు తీసి నిందితులంతా కలుస్తున్నారంటూ ప్రచారం చేస్తున్నారని వివరించారు.

కాగా, మద్యం కుంభకోణం కేసులో నిందితుడు రోణక్ కుమార్‌కు ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించాలని ఆయన తరఫున న్యాయవాది లక్ష్మీనారాయణ పిటిషన్ దాఖలు చేశారు. జైన మతానికి సంబంధించిన రోణక్... వారి సంప్రదాయం ప్రకారం మాంసాహారం వండిన, ఉల్లిపాయలు వేయించిన పాత్రల్లో చేసిన ఆహారం తీసుకోరని తెలిపారు. కాబట్టి ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించాలని కోర్టును అభ్యర్థించారు. రోణక్ కుమార్‌కు విజయవాడలో ఇల్లు లేదు కదా? అని న్యాయాధికారి ప్రశ్నించగా.. ఆయన భార్యకు ఇక్కడ బంధువులు ఉన్నారని, వాళ్ల ఇంటి నుంచి భోజనాన్ని తీసుకెళ్తారని తెలిపారు. దీనికి సంబంధించిన కాపీని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ అందుబాటులో లేకపోవడంతో సిట్ దర్యాప్తు అధికారి శ్రీహరిబాబుకు అందజేయాలని న్యాయాధికారి సూచించారు.

బెయిల్ పిటిషన్లు డిస్మిస్

మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహా చెరుకూరి వెంకటేశ్ నాయుడు, నవీన్ కృష్ణ, బాలాజీ కుమార్‌లు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను న్యాయాధికారి పి. భాస్కరరావు కొట్టివేశారు. ప్రస్తుత పరిస్థితిలో బెయిల్ ఇవ్వడం సాధ్యంకాదని తెలిపారు. కాగా, న్యాయస్థానంలో మద్యం కేసులో నిందితులంతా ఒక రూటులో వెళ్తుంటే, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాత్రం తాను సెపరేటు అంటున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవడానికి కోర్టు ఇచ్చిన సమయం ఆయనకు సరిపోవడం లేదని చెబుతున్నారు. న్యాయాధికారి ముందు హాజరుపరిచిన తర్వాత రిమాండ్ పొడిగింపు తేదీని వెల్లడిస్తారు. నిందితుల తరఫున న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవడానికి, భోజనాలు చేయడానికి న్యాయాధికారి ఒక గంట సమయం ఇస్తారు. అయితే చెవిరెడ్డి ముందుగా భార్య, కుమారులతో, ఆ తర్వాత న్యాయవాదులతో భేటీ అవుతున్నారు. తర్వాత నేతలు, కార్యకర్తలను కలుస్తున్నారు. ప్రతి రిమాండ్ పొడిగింపులోనూ ఇదే జరుగుతోంది. నిందితులంతా ఎస్కార్ట్ వాహనాలు ఎక్కినప్పటికీ భాస్కర్‌రెడ్డి మాత్రం ఎవరో ఒకరితో మాట్లాడుతూనే ఉంటారు. ఎస్కార్ట్ సిబ్బంది, సిట్ సిబ్బంది సమయం అయిపోయిందని చెప్పినా ఖాతరు చేయకపోగా... 'కాసేపు ఉండండి' అంటున్నారని సిట్, ఎస్కార్ట్ సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ మద్యం కేసులో.. ఇద్దరిపై పీటీ వారెంట్

విజయవాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మదనపల్లె జిల్లా జైలులో ఉన్న జినేశ్, శిబులను కోర్టులో హాజరుపరచడానికి అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. కేరళలోని త్రిశూర్‌కు చెందిన జినేశ్, శిబులు గోవా నుంచి రెక్టిఫైడ్ స్పిరిట్, ఇతర రసాయనాలను బాలాజీకి సమకూర్చారు. వారిని ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. అయితే, విజయవాడలోని భవానీపురం ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులో జినేశ్‌ను ఏ24, శిబును ఏ25గా చేర్చారు. వారిని ఇక్కడి కోర్టులో హాజరుపరిచేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు పీటీ వారెంట్ దాఖలు చేశారు.

గిరిజన బతుకుల్ని ప్రపంచానికి చాటారు

▸▸ ఉద్భవ్‌లో విద్యార్థుల ప్రదర్శనలు భేష్

▸▸ 22 రాష్ట్రాల విద్యార్థులు హాజరుకావడం జాతీయ సమగ్రతకు నిదర్శనం

▸▸ మంత్రులు సంధ్యారాణి, డోలా, దుర్గేశ్



గిరిజన విద్యార్థులకు మొమెంటో అందిస్తున్న మంత్రులు దుర్గేశ్, సంధ్యారాణి

తాడేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చిన్నారులు తమ సృజనతో గిరిజన పల్లె బతుకుల్ని ఉద్భవ్-2025 ద్వారా ప్రపంచానికి చాటారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మూడు రోజులు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్‌యూలో జరిగిన ఉద్భవ్-2025 శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ ఉత్సవంలో 22 రాష్ట్రాల్లోని 405 ఈఎంఆర్ఎస్ స్కూళ్లకు చెందిన 1800 మంది విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమన్నారు. భిన్న సంస్కృతులు, విభిన్న సంప్రదాయాలు ఉన్నా మనమంతా ఒక్కటేనని, ఆదివాసీలు ఎవరికీ తక్కువ కాదని విద్యార్థులు తమ ప్రదర్శనలతో నిరూపించారని ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలకు భవిష్యత్తులో పెద్దపీట వేస్తామన్నారు. యోగాలో 108 సార్లు సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ బుక్ వరల్డ్ సాధించింది ఆదివాసీలేనని అన్నారు. మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... ఈ వేడుకలు జాతీయ సమగ్రతకు, ఐక్యతకు నిదర్శనమన్నారు. మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ.. పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దిశానిర్దేశంతో ఇలాంటి గొప్ప వేడుక జరుపుకోవడం గర్వించదగ్గ అంశమన్నారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల సొసైటి కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల సంస్కృతులను, కళారూపాలతో విద్యార్థులు ఇండియా హెరిటేజ్‌ను ఆవిష్కరించారన్నారు.

కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జుననాయక్, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, కేఎల్‌యూ ప్రో-వీసీ వెంకటరామ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. కేరళ కళారూపం ఎన్నవనట్, బిహార్ నృత్యం జుమ్మర్ ఆకట్టుకున్నాయి. తెలంగాణ, ఒడిశా, త్రిపురలు అత్యధిక బహుమతులు సాధించాయి. 49 విభాగాలలో విజేతలకు బహుమతులు అందించారు.

హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా జస్టిస్ రవినాథ్ తిల్హరి



అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి నియమితులయ్యారు. దీనిపై ప్రభుత్వం గెజిట్ ప్రచురించింది. హైకోర్టు సీజే, ఏపీ న్యాయసేవాధికార సంస్థ పాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నిర్ణయం మేరకు ఈ నియామకం జరిగింది.

హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో మహిళలకు 1/3 రిజర్వేషన్!

▸▸ హైకోర్టు ఆదేశం.. వ్యాజ్యంపై విచారణ వాయిదా

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో మహిళలకు 1/3 వంతు రిజర్వేషన్లు కల్పించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. రిజర్వేషన్ కల్పనకు సంబంధించి ఓ విధానంతో తమ ముందుకు రావాలని అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికలలో మహిళా న్యాయవాదులకు మూడింట ఒక వంతు (1/3) రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పార్టీ ఇన్‌పర్సన్‌గా న్యాయవాది తోట సునీత పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం జరిగిన విచారణలో అడ్వొకేట్ అసోసియేషన్ తరఫున సీనియర్ న్యాయవాది చిదంబరం వాదనలు వినిపించారు.

దేవదేవుడ్నే దోచేశారు!

(మొదటి పేజీ తరువాయి)

నియామకాలు చేపట్టారు. ఇంకా ఎన్నో అవినీతి ఆరోపణలు ఉన్నాయి. చివరికి శ్రీవారి తులాభారంలోనూ అక్రమాలకు పాల్పడ్డారని బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. గత వైసీపీ పాలనలో టీటీడీలో జరిగిన అవినీతి, అక్రమాల చిట్టాను బయటికి తీసేందుకు ప్రస్తుత ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో చర్యలు మొదలయ్యాయి. ఇప్పటికే పరకామణి చోరీ కేసు రాజీ వ్యవహారంపై విచారణ పూర్తయింది. కల్తీ నెయ్యితో లడ్డూలు చేసిన ఘోరంలో కారకులైనవారు ఒక్కొక్కరూ విచారణకు హాజరవుతున్నారు. తిరుమలలో అక్రమాలు చోటు చేసుకోవడంపై హైకోర్టు, సుప్రీంకోర్టు ఘాటుగా స్పందించాయి. ఈ నేపథ్యంలో గత పాలక మండళ్ల కాలంలో టీటీడీలో జరిగిన అన్ని అక్రమాలపై దృష్టిసారించారు. లోతుగా వివరాలు సేకరిస్తున్నట్టు తెలుస్తోంది. అవినీతికి పాల్పడిన వారిపై గట్టి చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడవచ్చని భావిస్తున్నారు.

అవసరం లేకపోయినా వేలకోట్లు ఖర్చు

గత ప్రభుత్వంలో భవనాలు, రోడ్లు, వసతి సముదాయాల నిర్మాణాలకు దాదాపు రూ.3 వేల కోట్లు టీటీడీ కేటాయించింది. అవసరం లేకపోయినా టీటీడీ పరిధిలో ఎన్నికలకు ముందు ఏడాది ఆగమేఘాలమీద చేపట్టారు. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయల కమీషన్లు చేతులు మారినట్టు ఆరోపణలు వచ్చాయి. టీటీడీలో సలహాదారులను నియమించి రూ.లక్షలు ముట్టజెప్పారు. ముఖ్యమైన విభాగాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా తమవారిని నియమించి రూ.లక్షల్లో జీతాలు ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వీరిని తొలగించింది.

నాసిరకం సరుకులు

టీటీడీ మార్కెటింగ్ విభాగంలో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. కమీషన్ల కోసం నాసిరకం ముడిసరుకులను కొనుగోళ్లు చేసినట్లు విజిలెన్స్ విభాగం కూడా నిర్ధారించింది. ఇప్పటికే ఇద్దరు అధికారులను బదిలీ చేయడంతో పాటు వారిపై చర్యలు తీసుకోవాలని బోర్డు ఆదేశించింది. అలాగే శ్రీవాణి ట్రస్టు నిధులు దుర్వినియోగం జరిగాయని తీవ్ర ఆరోపణలు రావడంతో దుమారం రేగింది. దర్శనం, సేవా టికెట్ల కేటాయింపు వంటి వాటిల్లోనూ భారీగా అవినీతి జరిగిందనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వంలో శ్రీవారి తులాభారంలోనూ సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని, స్వామికి చెందాల్సిన సొమ్మును కొట్టేశారంటూ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు.

ఏళ్ల తరబడి ఒకేచోట విధులా!

▸▸ నాయకుల హోదాలో కొందరు, స్పౌజ్ కారణంతో మరికొందరు

▸▸ ప్రభుత్వ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్‌లపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భార్య లేదా భర్త సమీపంలో పని చేస్తున్నారనే కారణం చూపి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, హోదాను అడ్డంపెట్టుకొని ఉద్యోగ సంఘాల నాయకులు ఏళ్ల తరబడి ఒకేచోట పని చేస్తుండడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. వీరి తీరుతో ఆయా స్థానాలకు రావాలనుకుంటున్న ఇతర ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతీస్తున్నారని పేర్కొంది. "స్పౌజ్ కోటా కింద ఒకేచోట ఎన్నేళ్లు పనిచేయడానికి అవకాశం ఉంది?. ఉద్యోగ సంఘం నాయకులు ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేయవచ్చా?. చట్టనిబంధనలు ఏం చెబుతున్నాయి?. తదితర వివరాలను కోర్టు ముందు ఉంచండి." అని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారంపై లోతైన విచారణ జరుపుతామని పేర్కొంది. అనంతరం విచారణను జనవరి తొలి వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.

'తాత్కాలికం'గా పోస్టుల భర్తీనా?

▸▸ ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్ల పోస్టుల భర్తీపై స్టే

అకడమిక్ కన్సల్టెంట్ల నియామకం విషయంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ జారీచేసిన నోటిఫికేషన్ అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. ఒప్పంద, పొరుగు సేవల విధానంలో తాత్కాలిక పద్ధతిలో పోస్టులు భర్తీ చేయడాన్ని తప్పుపట్టింది. నామమాత్రపు గౌరవ వేతనం చెల్లిస్తూ యువతను దోచుకుంటున్నారని వ్యాఖ్యానించింది. చట్టంలో అకడమిక్ కన్సల్టెంట్ల పోస్టుల ప్రస్తావనే లేదని, ప్రత్యేకంగా సృష్టించి ఎలా భర్తీచేస్తారని ప్రశ్నించింది. విద్యాసంస్థలను అడ్డా కూలీ కేంద్రాలుగా మార్చారని ఘాటు వ్యాఖ్యలు చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎస్వీయూ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. పోస్టుల భర్తీ ప్రక్రియపై స్టే విధించవద్దని అడ్వొకేట్ జనరల్ చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది.

జగన్‌పై బీసీల భగ్గు



కర్నూలు నగరంలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ, యాదవ సంఘం నాయకులు

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులను అవహేళన చేస్తూ జగన్ చేసిన వ్యాఖ్యలపై బీసీ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. పీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య, సీనియర్ ఐపీఎస్ అధికారి గోపీనాథ్ జెట్టిని వాడు.. వీడు అంటూ తక్కువ చేసి మాట్లాడటంపై భగ్గుమన్నాయి. పలుజిల్లాల్లో ర్యాలీలు నిర్వహించడంతోపాటు జగన్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. కర్నూలు, ప్రకాశం, అనంతపురం, గోదావరి జిల్లాల్లో యాదవ సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. నెల్లూరు, విజయవాడలో బీసీలు నిరసన ర్యాలీలు చేశారు. గుంటూరులో శనివారం భారీ నిరసనకు యాదవ సంఘాలు పిలుపునిచ్చాయి. జగన్ వ్యాఖ్యలను బీసీ సంక్షేమ సంఘం జేఏసీ ఖండించింది. జగన్ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే పోరాటం తీవ్రం చేస్తామని బీసీ నేతలు హెచ్చరించారు.



విద్యార్థినితో సీఎం చంద్రబాబు సరదా సంభాషణ



'స్వర్ణాంధ్ర-2047' అని రాసి ఉన్న బ్యాడ్జీలను సీఎంకు కానుకగా ఇచ్చిన విద్యార్థులు

మీ కలలకు మా రెక్కలు

(మొదటి పేజీ తరువాయి)

మోడల్ స్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆయన, విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. పిల్లల విద్యా ప్రమాణాలను సీఎం పరిశీలించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు కష్టపడి చదివి.. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవడంతో పాటు వారి ఇష్టాలను గౌరవించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రమాణాల స్థాయి పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను లోకేశ్ సీఎంకు వివరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు ప్రసంగించారు. ఉన్నత విద్య కోసం, విదేశీ విద్య కోసం 'కలలకు రెక్కలు' పేరిట కొత్త పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. విదేశీ విద్యకు పావలా వడ్డీకే రుణాలు ఇప్పిస్తాం. ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్యార్థుల కలలు, కోరికలను చంపుకోవాల్సిన అవసరం లేదు. వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. పిల్లలకు అవసరమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నాం. ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలి. రాబోయే కాలంలో విద్యావ్యవస్థలో ఎవ్వరూ ఊహించని విధంగా ఫలితాలు వస్తాయి. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలి' అని పిలుపిచ్చారు. గిరిజన ప్రాంతానికి చెందిన అంధ విద్యార్థిని కరుణకుమారి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని అంధ మహిళా క్రికెట్ ప్రపంచకప్‌ను సాధించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆడబిడ్డలను వేధించిన వారికి అదే చివరి రోజవుతుందని హెచ్చరించారు. పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని చెప్పారు. ఆయన ఇంకా మాట్లాడారంటే..

● శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. నేను ఊహించిన దానికంటే విద్యావిధానం ఎంతో మెరుగ్గా ఉంది. పిల్లలు కూడా అంతే ఉత్సాహంగా చదువుల్లో రాణిస్తున్నారు. మట్టిలో మాణిక్యాలకు సరైన మార్గనిర్దేశం చేస్తే ఏదైనా సాధించగలరనే నమ్మకం ఉంది. - సీఎం చంద్రబాబు

ఇప్పుడు పిల్లలే ఆస్తి..

ఒకప్పుడు పిల్లలను తల్లిదండ్రులు భారంగా భావించేవారు. కానీ నేడు ఆ పిల్లలే ఆస్తి. పిల్లలే తల్లిదండ్రులకు శ్రీరామరక్షగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడతారు. గురువులు విద్యను బోధించడంతో పాటు పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి. విలువలతో కూడిన సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో.. సహకరించాలని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును కోరాం. ప్రపంచంలో లెర్నింగ్ విధానాలను అధ్యయనం చేసేందుకు ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి 18 మంది విద్యార్థులకో ఉపాధ్యాయుడు ఉన్నారు. అదే ప్రైవేటు పాఠశాలల్లో 28మంది విద్యార్థులకు ఒకరే టీచర్" అని తెలిపారు.

టీచర్లను గౌరవిస్తాం..

ఉపాధ్యాయులను గౌరవించే బాధ్యత మాది. పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులది. ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తాం. తద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం. ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష కూడా నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వం 45 యాప్‌లు పెట్టింది. టీచర్లకు 24 గంటలూ అదే పని. మేమిప్పుడు ఒకే యాప్ తెచ్చాం. ఎక్కడా ఇబ్బంది లేకుండా చేశాం.

లోకేశ్ కోసం ఎప్పుడూ స్కూలుకెళ్లలేదు..

లోకేశ్ కోసం నేనెప్పుడూ స్కూలుకు వెళ్లలేదు. నా భార్య వెళ్లేది. అన్నీ ఆవిడే చూసుకునేది. లోకేశ్‌ను రాజకీయాల్లోకి రమ్మని నేనెప్పుడూ బలవంతం చేయలేదు. మంత్రి పదవి ఇచ్చేటప్పుడు కూడా ఏశాఖ కావాలని అడిగితే ఎడ్యుకేషన్ అడిగారు. ఆ శాఖ చాలా కష్టంగా ఉంటుందన్నాను. అయితే తాను ఇష్టపడుతున్నానని, ఆ శాఖ తీసుకుని చరిత్ర సృష్టిస్తానని లోకేశ్ చెప్పారు.. ఆశీర్వదించాను. లోకేశ్‌కు ఒకటే చెబుతున్నా. నీ తల్లి నిన్ను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వరకు తీసుకెళ్లింది. ఇప్పుడీ పిల్లలను కూడా ఆ స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉంది. మూడేళ్లలో దేశంలోనే ఏపీ విద్యావ్యవస్థ నంబర్ వన్ స్థానంలో ఉంటుందని లోకేశ్ నాకు హామీ ఇచ్చారు. అన్ని దేశాల్లో జనాభా తగ్గిపోతోంది. భవిష్యత్‌లో భారత్ పిల్లలు, యువశక్తి ఎక్కువ ఉండే దేశం అవుతుంది. ఇప్పుడే వారి నాలెడ్జ్ చూశాను. వారి వద్ద నేనే నేర్చుకునే రోజు వస్తుందని అనుకుంటున్నా. పిల్లలను తీర్చిదిద్దితే ప్రపంచాన్నే సాధిస్తారు.





తండ్రి భోంచేశాక ప్లేటు తీసిన లోకేశ్

మధ్యాహ్నం పాఠశాల విద్యార్థులతో కలిసి చంద్రబాబు, లోకేశ్ భోజనం చేశారు. తండ్రి భోజనం చేసిన అనంతరం ఆ ప్లేటును లోకేశ్ స్వయంగా తీసుకెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది.



భామిని ఆదర్శ పాఠశాల ప్రాంగణంలోని సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థులతో చంద్రబాబు, లోకేశ్..

ప్రకాశం పంతులు కథ..

'చదువు విలువ గురించి తెలిసిన ఉదాహరణ చెబుతాను. ఒక పిల్లవాడు చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి పైసా పైసా జమచేసి అతడిని చదివించింది. ఒకసారి మూడు రూపాయలు ఫీజు కట్టాల్సి రాగా, తన పట్టు చీరను ఆమె తాకట్టు పెట్టింది. అది చూసి ఆ పిల్లవాడిలో బాగా చదవాలన్న కసి పెరిగింది. ఆ చీర అమ్మకు తిరిగి ఇచ్చేయాలని అనుకున్నాడు. బారిస్టర్ అయ్యారు. ఓ పేపర్‌కు ఎడిటర్ అయ్యాడు. స్వాతంత్ర్యం కోసం కూడా పోరాడారు. ఆ వ్యక్తే టంగుటూరి ప్రకాశం పంతులు' అని లోకేశ్ గుర్తుచేశారు. వేదికపై సీఎం, లోకేశ్‌తోపాటు విద్యార్థిని నిహారిక, ఆమె తల్లి అరుణజ్యోతి, విద్యార్థి వి.మురళీసాయి, తండ్రి శ్రీనివాసరావు కూర్చున్నారు.

బడిని బాగుచేద్దాం!

సామాజిక రుణం తీర్చుకుందాం

- ప్రభుత్వ స్కూళ్లంటే ఇంకా చిన్నచూపు
- ఈ మైండ్‌సెట్ మారాలి: మంత్రి లోకేశ్

పార్వతీపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, గురువుల రుణాన్ని ప్రతి ఒక్కరూ తీర్చుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ విద్యార్థులను కోరారు., అలాగే సామాజిక రుణం తీర్చుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సమాజానికి ఎంతో కొంత ప్రతి ఒక్కరూ తిరిగివ్వాలని.. ఇందులో భాగంగానే బడిని బాగుచేసి సామాజిక రుణం తీర్చుకుందామని పిలుపిచ్చారు. భామిని ఏపీ మోడల్ స్కూల్ పీటీఎంలో ఆయన కూడా మాట్లాడారు. మూడేళ్లలో రాష్ట్రంలో మోడల్ ఎడ్యుకేషన్ సాధించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని.. దానిని సాధిస్తామని హామీ ఇచ్చారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని, ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యా విలువలను పెంపొందించేందుకు చాగంటి కోటేశ్వరరావుతో ప్రవచనాలు ఇప్పిస్తున్నామని తెలిపారు. పిల్లలకు అర్థమయ్యేలా బాలల రాజ్యాంగాన్ని రూపొందించామని, పిల్లలతో మాక్ అసెంబ్లిని నిర్వహించామని, దీంట్లో పిల్లలు అద్భుతంగా సమస్యలపై చర్చించారని అన్నారు. క్లిక్కర్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తున్నామని, పైలట్ ప్రాజెక్టు కింద భామిని మోడల్ స్కూల్‌లో ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఇంగ్లాండ్ వంటి దేశాల్లో విద్యావిధానాన్ని పరిశీలించేందుకు ఉపాధ్యాయులను పంపిస్తున్నామని తెలిపారు. లీప్ యాప్ అందుబాటులోకి తెచ్చామని, దీని గురించి తల్లిదండ్రులు తెలుసుకోవాలని సూచించారు. విద్యావ్యవస్థను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి దేశంలోనే నంబర్ వన్‌గా నిలవాలనేది సీఎం అభిమతమని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తనకు పాలనపరమైన అంశాల్లో ఎన్నో సలహాలిస్తున్నారని.. విద్యావిధానంలో తీసుకురావలసిన సమూల మార్పులపై తాము ఎప్పటికప్పుడు చర్చించుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలంటే కొంతమందికి ఇంకా చిన్న చూపే. ఆ మైండ్‌సెట్ మారాలి. టెక్నాలజీని జోడించి పిల్లలకు మెరుగైన విద్య అందిస్తాం. - మంత్రి లోకేశ్



తరగతి గదిలో విద్యార్థులతో కలిసి కూర్చున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

అప్పుడు రాలేదు.. ఇప్పుడొచ్చారు..

'నేను చదువుకునేటప్పుడు పేరెంట్స్ మీటింగ్‌కు నాన్న ఎప్పుడూ రాలేదు. అలాంటిది మీ పీటీఎంకు వచ్చారు. ఎంత పని ఒత్తిడి ఉన్నా మా దేవాన్ష్ పీటీఎంకు నేను వెళ్తాను. అన్ని పనులూ మానుకుని మరీ వెళ్తాను. ఎందుకంటే పిల్లలను పైకి తీసుకురావలిన బాధ్యత ప్రభుత్వంపైనే కాదు.. తల్లిదండ్రులపై కూడా ఉంది. ఈ రోజు ఇక్కడ పిల్లలతో మాట్లాడాను. వారు ఎంతో ఆత్మస్థైర్యంతో మాట్లాడారు' అని లోకేశ్ తెలిపారు.

కారా మాస్టారు కథలు సజీవం..

కాళీపట్నం రామారావు(కారా మాస్టారు) మన మధ్య లేకపోయినా ఆయన రాసిన కథలు ఇంకా సజీవంగా మనతోనే ఉన్నాయని లోకేశ్ చెప్పారు. 'ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ కారా మాస్టారు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. దేశ భవిష్యత్ తరగతి గది నుంచే ప్రారంభమవుతుంది. దీనిని చంద్రబాబు బలంగా నమ్ముతారు. ప్రపంచానికి నైపుణ్యం కలిగిన యువతను ఇవ్వాలనేదే ఆయన కల. ఈ కల నెరవేరాలంటే విద్యావ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావాలి' అని పేర్కొన్నారు.

పండగలా పీటీఎం

- పార్వతీపురంలో చంద్రబాబు.. చిలకలూరిపేటలో పవన్

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెగా పీటీఎం సమావేశాలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో పండుగ వాతావరణంలో జరిగాయి. 45,047 పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో జరిగిన తల్లిదండ్రులు-టీచర్ల సమావేశాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు సహా మొత్తం సుమారు 74 లక్షల మంది పాల్గొన్నారని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల పురోగతిని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, విద్యార్థుల అసెస్‌మెంట్ పుస్తకాలు చూపించి వారి సామర్థ్యాలను తెలియజేశారు. అలాగే ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ప్రధాన లక్ష్యంగా మెగా పీటీఎం జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని మోడల్ స్కూల్‌లో సీఎం, లోకేశ్... పల్నాడు జిల్లా చిలకలూరిపేట శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ఇతర జిల్లాల్లో మంత్రులు పాల్గొన్నారు. బోధనలో కొత్తగా ప్రవేశపెట్టిన 'క్లిక్కర్'ను ముఖ్యమంత్రి భామిని స్కూలులో ప్రారంభించారు.

నేటి నుంచి లోకేశ్ విదేశీ టూర్

- అమెరికా, కెనడాల్లో 5 రోజులపాటు పర్యటన

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా విద్య, ఐటీశాఖ మంత్రి లోకేశ్ అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించనున్నారు. శనివారం నుంచి ఐదు రోజులపాటు ఆయన పర్యటన సాగనుంది. 6వ తేదీన డల్లాస్‌లో నిర్వహించే తెలుగు డయాస్పోరా సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. 8, 9 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కో వేదికగా పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 10న కెనడాలోని టొరంటోలో పర్యటిస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటించడం ఇది రెండో సారి. పెట్టుబడుల సాధన కోసం గత 18 నెలల్లో ఆయన అమెరికా, స్విట్జర్లాండ్ (దావోస్), సింగపూర్, ఆస్ట్రేలియా దేశాల్లో పర్యటించారు.

నేడు టీడీపీ కేంద్ర కార్యాలయానికి సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి రానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యాలయానికి రానున్న చంద్రబాబు.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు అందుబాటులోఉన్న ఇతర నేతలతోనూ సమావేశం అవుతారు.

'టెట్'పై ఇన్‌సర్వీస్ టీచర్లలో ఆందోళన

- లోక్‌సభలో టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ టీచర్లు కూడా రెండేళ్లలోపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో తప్పనిసరిగా ఉత్తీర్ణత పొందాలన్న సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పుతో దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు లక్ష మందికి పైగా టీచర్లలో ఆందోళన నెలకొందని టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శుక్రవారం లోక్‌సభలో జీరోఅవర్ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2010కి ముందు నియమితులైన టీచర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ చట్టాలను సవరించాలని విజ్ఞప్తి చేశారు.

భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ: మంత్రి సుభాష్



విశాఖపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులకు మెరుగైన ఉపాధి కోసం రూ.70 కోట్లతో శిక్షణ ఇవ్వనున్నట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. శుక్రవారం విశాఖపట్నం వచ్చిన ఆయన పలు భవనాలను పరిశీలించారు. అక్కడ కార్మికులకు కల్పించిన వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఆ తర్వాత కోనసీమ, ఉత్తరాంధ్ర భవన నిర్మాణ కార్మికుల అవగాహన సదస్సులో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వారికి నిలిపివేసిన పథకాలన్నింటినీ కొనసాగించాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని చెప్పారు.



స్కూల్‌లో క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



శారదా స్కూల్ తరగతి గదిలో విద్యార్థులతో కలసికూర్చున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

●నా చిన్నతనంలో సోషల్ టీచర్ సమాజం, దేశభక్తి, చంద్రశేఖర్ ఆజాద్ గురించి చెబితే ఆ పాఠం నా గుండెల్లో నాటుకుంది. సామాజిక బాధ్యతను తెలియజేసింది. ఈ రోజున ఇంత చేయగలుగుతున్నామంటే ఆ టీచర్ చెప్పిన చిన్న పాఠమే.

●భూకంపాలు వస్తే ఇళ్లు కూలిపోతాయి. సంపాదించుకున్న సొమ్ము కనుమరుగైపోవచ్చు. కానీ పోగొట్టుకోలేనిది మనం సంపాదించుకున్న జ్ఞానం మాత్రమే. - పవన్ కల్యాణ్

చదువు.. బలమైన ఆయుధం

లక్ష మంది మెదళ్లను కదిలించే శక్తినిస్తుంది: ఉపముఖ్యమంత్రి

- ఏ మీడియంలో చదువుకున్నా.. సృజనాత్మకత పెంపొందించుకోవాలి
- విద్యార్థులకు పవన్ కల్యాణ్ పిలుపు
- చిలకలూరిపేటలో మెగా పీటీఎంకు హాజరు

చిలకలూరిపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'చదువు మీ భవిష్యత్‌ను మార్చేస్తుంది. చదువు చాలా బలమైన ఆయుధం. లక్ష మంది మెదళ్లను కదిలించే శక్తిని చదువు ఇస్తుంది. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్ నిర్దేశకులు..' ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్స్ మీట్(పీటీఎం)లో ఆయన ప్రసంగించారు. పిల్లలను ఉదయించే సూర్యులుగా అభివర్ణించారు. ఏ మీడియంలో చదువుకున్నా సృజనాత్మకత పెంపొందించుకోవాలని.. ఇది సాధించాలంటే చాలా విభిన్నంగా విద్య నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా దేహ, మానసిక దారుఢ్యం ఉండాలన్నారు. మానసిక దారుఢ్యం సాధించేందుకు పుస్తకాలు ఎక్కువగా చదవాలని చెప్పారు. చదువైపోయాక ఏదో ఒక ఉద్యోగం చేద్దాం అనుకోవద్దని సూచించారు. విద్యార్థులపై ప్రతి రాజకీయ నాయకుడు, ప్రతి అధికారికీ బాధ్యత ఉండాలన్నారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..

దేశ భవిష్యత్ కోసం తీర్చిదిద్దాలి..

టీచర్.. విద్యార్థుల్లో ఒక్కొక్కరిపై ఒక్కో ప్రభావం చూపిస్తారు. విద్యార్థులను ఉద్యోగం కోసం కాకుండా దేశ భవిష్యత్ కోసం తీర్చిదిద్దాలి. ప్రతి బిడ్డలో అద్భుతమైన శక్తి ఉంటుంది. తల్లిదండ్రులూ.. మంచి మాటలు చెప్పండి. పొద్దున లేస్తే బూతులు తిట్టే వ్యక్తులకు దూరంగా ఉంచండి. పిల్లలూ టీవీలు చూడకండి. సినిమా వినోదమే.. దానినే జీవితంగా తీసుకోకండి. సినిమా నటుడిగానే చెబుతున్నాను. మన కోసం కష్టపడిన అబ్దుల్‌కలాం లాంటి వారి స్ఫూర్తిగా ప్రతి విద్యార్థీ ఎదగాలి. విద్యార్థుల ఆలోచనలు.. ప్రవర్తన.. వ్యక్తిత్వం రేపటి దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి.

లోకేశ్‌కు అభినందనలు..

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమల్లో పీటీఎం చాలా కీలకమైనది. దీనిని మంత్రి లోకేశ్ ముందుకు తీసుకుపోతున్నారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు. పిల్లలను స్కూలుకు పంపించాం.. వారే చదువుకుంటారని తల్లిదండ్రులు భావిస్తుంటారు. అయితే పిల్లలు స్కూల్లో ఏంచేస్తున్నారు. ఎలా చదువుతున్నారో తెలుసుకోవడం వారి బాధ్యత. అందుకే లోకేశ్ కలుగజేసుకుని.. పీటీఎం నిర్వహిస్తున్నారు. కేరళలో టీచర్, తల్లిదండుల సంఘం చాలా బలంగా ఉంటుంది. అలాంటి వ్యవస్థను అమలు చేయడానికి పీటీఎం దోహదపడుతుంది. ఫీజులు కట్టి స్కూలుకు పంపించడం కాకుండా.. వారెలా ఉంటున్నారో తెలుసుకోవడానికి ఇది దోహదపడుతుంది. దీనివల్ల పిల్లల బలాలు, బలహీనతలేమిటో తల్లిదండ్రులు తెలుసుకోగలుగుతారు. తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులను దైవంగా భావిస్తాం. ఇది అరుదైన సంస్కృతి. దీనిని గౌరవించుకోవడానికి పీటీఎం చాలా అద్భుతంగా పనిచేస్తుంది.

ఆటస్థలాలేవీ..?

అందరూ రియల్ ఎస్టేట్ పిచ్చిలో పడిపోయారు. ఎవరెవరివో స్థలాలు కాజేస్తూ వేల కోట్లు దోచేస్తున్నారు. పూర్వీకుల మాదిరిగా స్థలాలు విద్యా సంస్థల వంటి వాటికి దానం ఇవ్వడం మానేసి.. ఉన్న స్థలాలను లాగేసుకుంటున్నారు. అందువల్ల పిల్లలకు ఆడుకునేందుకు ఆట స్థలాలు ఉండడం లేదు. శారదా స్కూల్‌కు ఆట స్థలం కేటాయించి స్కూలు పిల్లల కోరికను నెరవేర్చాలని అధికారులను ఆదేశించారు. నారావారి పల్లె వెళ్లాను అక్కడ స్కూలుకు గ్రౌండ్ లేదు. నా సొంత ధనంతో స్థలం కొనిచ్చాను. ఇలా అన్ని చోట్లా కొనిచ్చే శక్తి లేదు. ప్రభుత్వంలో ఉన్నాను కాబట్టి ప్రభుత్వపరంగా స్థలం కేటాయించాలి. విద్యార్థులకు ఆట స్థలం ఉండేలా అధికారులు ప్రయత్నం చేయాలి. గంజాయి వంటి మాదకద్రవ్యాలపై పోలీసు శాఖ కఠినంగా ఉండాలి. నగరాల్లో అసలు గంజాయి అనేది విషయం కాదన్నట్టుగా మాట్లాడుతుంటే భయం వేస్తోంది. గత ప్రభుత్వంలో చాలా మంది మాదకద్రవ్యాలను పిల్లలకు అలవాటు చేయడానికి చాక్లెట్లు, ఐస్‌క్రీంల రూపంలో సరఫరా చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని టీచర్లు, తల్లిదండ్రులు పీటీఎంలో మాదక ద్రవ్యాలపై చర్చించాలి. దేశ సంపద ఖనిజాలు, నదులు, అడవులు కాదు.. కలల ఖనిజాలతో చేసిన యువతే. వారే మన దేశ భవిష్యత్‌కు నావికులని గుంటూరు శేషేంద్రశర్మ రాశారు. అందరూ సంపాదనపై పడుతున్నారు. రూ.కోటి ఉంటే వేల కోట్లు సంపాదించాలని అనుకుంటున్నారు. స్వయంశక్తి మీద నిలబడిగలిగేలా విద్యార్థులను ముందుకు తీసుకెళ్తేనే వారికి మంచి భవిష్యత్ ఉంటుంది. వ్యక్తిత్వ వికాస పాఠాలు చెప్పగలిగితే.. వారిలో నుంచి ఎంతో మంది అద్భుతమైన వ్యక్తులు వస్తారు.

25 కంప్యూటర్లు ఇస్తా..

శారదా స్కూలుకు సొంత నిధులతో లైబ్రరీ అభివృద్ధితో పాటు 25 కంప్యూటర్లు అందజేస్తానని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మమేకయ్యారు. తరగతి గదిలో కూర్చుని వారితో ముచ్చటించారు. ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, ఇంటర్ విద్య డైరెక్టర్ రంజిత్ బాషా, కలెక్టర్ కృతికా శుక్లా, గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, డీఈవో చంద్రకళ, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

చాన్స్ వస్తే చంద్రబాబు బయోపిక్‌లో నటిస్తా

- కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్



విజయవాడలో దుర్గగుడికి వచ్చిన శివరాజ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, అర్చకులు

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవకాశం వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు బయోపిక్‌లో నటిస్తానని కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ అన్నారు. మంచి దర్శకుడు ముందుకు వస్తే ఆ క్యారెక్టర్‌లో నటించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. శుక్రవారం ఆయన కుటుంబసభ్యులతో కలసి విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య బయోపిక్‌లో నటిస్తున్నానని, విలువలతో కూడిన రాజకీయ నేత జీవిత కథలో నటించడం గర్వంగా ఉందని అన్నారు. రాంచరణ్ నటిస్తున్న పెద్ది చిత్రంలో మంచి పాత్రలో నటిస్తున్నట్టు చెప్పారు.

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

- సీఎంకు టీ-మంత్రి కోమటిరెడ్డి ఆహ్వానం
- ప్రతిపక్ష నేత ప్రజా సమస్యలపై పోరాడాలి
- సభలో విపక్ష హోదా కోసం కాదు: కోమటిరెడ్డి

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025కు రావాలని సీఎం చంద్రబాబును ఆ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అమరావతి వచ్చిన కోమటిరెడ్డి సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. డిసెంబరు 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆహ్వానించారు. సీఎంను కలవడానికి ముందు, ఆ తర్వాత కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రాష్ట్రాల సీఎంలను ఆహ్వానిస్తున్నామని, అందులో భాగంగా చంద్రబాబును ఆహ్వానించేందుకు వచ్చానని తెలిపారు. చంద్రబాబు విజన్ ఉన్న ముఖ్యమంత్రి అని ఆయన కొనియాడారు. ఏపీలో ప్రతిపక్ష నాయకుడు ప్రతిపక్ష హోదా కోసం కాకుండా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాటం చేయాలని కోమటిరెడ్డి సూచించారు. తెలంగాణలోని ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరగనుందని, ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు బుల్లెట్ ట్రైన్ వేస్తామని కేంద్రం అంగీకరించిందని, హైదరాబాద్- విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారిని ఎనిమిది లైన్లుగా విస్తరించనున్నారని.. ఇవన్నీ పూర్తయితే రెండు రాష్ట్రాల మధ్య చాలా అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. పవన్ కల్యాణ్ గురించి ఇప్పుడేమీ మాట్లాడనన్నారు. ఆహ్వానం ఇవ్వడానికి వచ్చినప్పుడు విమర్శలు తగవని అన్నారు.



సీఎం చంద్రబాబును సత్కరించి మొమెంటోను అందిస్తున్న తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గం

మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు

- అక్రమార్కులకు గుణపాఠం చెప్పాలి
- 20 ఏళ్లుగా బ్యాంకును సర్వ నాశనం చేశారు
- వాటాదారులకు రక్షణ కల్పించడమే మా ధ్యేయం
- బ్యాంకుకు పూర్వవైభవం తెస్తాం
- ఫౌండర్ ప్యానెల్ చైర్మన్ అభ్యర్థి భంగాడియా కైలాశ్ నారాయణ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొంతమంది వ్యక్తుల స్వార్థ ప్రయోజనాలు, నిబంధనల ఉల్లంఘనలే ఏపీ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను ఆర్థిక సంక్షోభంలోకి, ఈడీ కేసుల్లోకి నెట్టాయని బ్యాంక్ ఫౌండర్ ప్యానెల్ చైర్మన్ అభ్యర్థి భంగాడియా కైలాశ్ నారాయణ్ ఆరోపించారు. అందినకాడికి దోచుకుని పెద్దఎత్తున 20ఏళ్లుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు ఈనెల 7న జరగబోయే పాలకవర్గ ఎన్నికల నేపథ్యంలో.. ఫౌండర్ ప్యానెల్ తరపు నుంచి పోటీచేస్తున్న డైరెక్టర్లు శుక్రవారం బేగంబజార్ మహేశ్వరి గార్డెన్‌లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. చైర్మన్ అభ్యర్థి కైలాశ్ నారాయణ్ మాట్లాడుతూ.. సంస్థకు పూర్వవైభవాన్ని నెలకొల్పి, ఆర్థిక స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి తమ ప్యానెల్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వస్తే పారదర్శకంగా పని చేసి ఖాతాదారులకు, వాటాదారులకు రక్షణ కల్పిస్తామని చెప్పారు.

20 ఏళ్లలో అంతులేని అక్రమాలు..

2005 నుంచి ఇప్పటివరకు అధికారంలో ఉన్న వారు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని భంగాడియా కైలాశ్ నారాయణ్ ఆరోపించారు. "పాత చైర్మన్ రమేశ్ కుమార్ బంగ్ సారథ్యంలో ఉన్న బోర్డులో ఆర్బీఐ తీవ్రమైన పరిపాలన లోపాలు గుర్తించింది. కేవైసీ నిబంధనలు పాటించనందుకు 2022లో ఆర్‌బీఐ రూ. 1.12 కోట్ల జరిమానా విధించింది. 1994 నుంచి డైరెక్టర్‌గా పనిచేస్తూ.. సంస్థాపక్ ప్యానెల్ తరపున పాలక వర్గంలో చైర్మన్‌గా వ్యవహరించిన వ్యక్తి , సీనియర్ వైస్ చైర్మన్‌గా 1997 నుంచి బోర్డులో ఉన్న మరో వ్యక్తి.. వీరిద్దరూ కీలక పదవుల్లో ఉంటూ దశాబ్దాలుగా బ్యాంకుపై నియంత్రణ సాధించి దోచుకుంటున్నారు" అని కైలాశ్ నారాయణ్ మండిపడ్డారు. వారి హయాంలో ప్రధాన కార్యాలయ నిర్మాణం వ్యయం 2019లో రూ.32.28 కోట్లుగా ఉండగా.. 2020నాటికి రూ.44.75 కోట్లతో పూర్తి చేశారని వివరించారు. కాగా, 2023 జూలైలో ఆబిడ్స్ శాఖలో జరిగిన సైబర్ మోసంలో రూ.కోటి నిధులు మాయమయ్యాయని, ఫిక్స్‌డ్ డిపాజిట్ మోసాలతో మరో రూ.11.80 కోట్లు నష్టం జరిగిందని ఆయన వివరించారు. నిబంధనలు పాటించని కారణంగా 2023లో ఆర్‌బీఐ.. సీనియర్ వైస్ చైర్మన్ పురుషోత్తం మాండవీయను తొలగించి ప్రత్యేక అధికారిని నియమించిందని, తద్వారా బ్యాంక్ నెట్ ఫండ్స్ రూ.336 కోట్ల నుంచి రూ.475 కోట్లకు పెరిగిందని కైలాశ్ నారాయణ్ చెప్పారు. కాగా, అవినీతి ఆరోపణలతో పాత చైర్మన్, సీనియర్ వైస్ చైర్మన్, ఎండీలపై ఇప్పటికీ ఈడీ విచారణ జరుగుతోందని తెలిపారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకు బోర్డు సమావేశాలు జరగడం లేదని.. బోర్డు అభ్యంతరాలను పక్కనబెట్టి పాత చైర్మన్ తన కూతురును ప్రొఫెషనల్ డైరెక్టర్‌గా నియమించారని ఆరోపించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా బ్యాంకు వాటాదారుల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో తమ ప్యానెల్‌ను భారీ మెజార్టీతో గెలిపించి వారికి తగిన గుణపాఠం చెప్పాలని కైలాశ్ నారాయణ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

నెల్లూరును ముంచిన 'దిత్వా'

- 6439 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు..19 మండలాలపై తీవ్ర ప్రభావం



మనుబోలులో చెరువుల్లా మారిన పొలాల్లో దెబ్బతిన్న వరినారును చూపుతున్న రైతులు

నెల్లూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో మూడు రోజులు కురిసిన అతి భారీ వర్షాలు నెల్లూరు జిల్లా రైతులను నిండా ముంచాయి. మొత్తం 19 మండలాలపై తీవ్ర ప్రభావం చూపింది. నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు 188 గ్రామాల్లో 12,315 మంది తుఫాన్ బాధితులుగా మిగిలారు. వ్యవసాయ సీజన్ ప్రారంభ దశ కావడంతో రైతులకు నష్టంతోపాటు శ్రమ వృథా అయ్యింది. 6439 హెక్టార్లలో (16,097 ఎకరాలు) పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. 85 చోట్ల చెరువులు, కాలువలకు డ్యామేజీ కాగా, తాత్కాలిక మరమ్మతులకు రూ.4.5 కోట్లు అవసరమవుతాయని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. 14 చోట్ల 33 కేవీ ఫీడర్స్, 45 చోట్ల 11 కేవీ ఫీడర్స్, 8 సబ్‌స్టేషన్లు, దెబ్బతిన్నాయి. 30 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికాగా, 33 కేవీ పోల్స్ రెండు, 11 కేవీ పోల్స్ 13, ఎల్‌టీ పోల్స్ 7 దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇక చాలా చోట్ల రోడ్లు దెబ్బతినడంతో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు భారీగానే నష్టం వాటిల్లింది. అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో తుఫాన్ నష్టాలను అంచనా వేస్తోంది. ఇందుకు ఆయా శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.

చింతూరులో ఉద్రిక్తత

- హిడ్మా మృతిపై నిజ నిర్ధారణకు టీ-విద్యార్థులు
- చింతూరు వద్ద వారిని అడ్డుకున్న గ్రామస్థులు



తెలంగాణ విద్యార్థులను అడ్డుకుని రహదారిపై ధర్నా చేస్తున్న చింతూరు గ్రామస్థులు

చింతూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నేత హిడ్మా ఎన్‌కౌంటర్ జరిగిన అల్లూరి జిల్లా మారేడుమిల్లి ప్రాంతానికి వెళ్లడానికి ప్రయత్నించిన తెలంగాణ విద్యార్థులను చింతూరు వద్ద గ్రామస్థులు అడ్డుకోవడంతో కొద్దిగంటలపాటు ఉద్రిక్తత నెలకొంది. హిడ్మా ఎన్‌కౌంటరుపై సోషల్ మీడియాలో భిన్న కథనాలు వినిపిస్తున్న నేపథ్యంలో.. ఈ ఘటనలోని నిజానిజాలు తెలుసుకునేందుకు ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు చెందిన 12మంది విద్యార్థులు నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి శుక్రవారం ఏపీకి వచ్చారు. ఘటన జరిగిన మారేడుమిల్లి ప్రాంతానికి చింతూరు మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చింతూరులో వారి వాహనాన్ని అడ్డుకున్నారు. రోడ్డుపైనే మావోయిస్టుల దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థుల వాహనం కదలకుండా అడ్డుగా నిలబడి, వారితో వాగ్వాదానికి దిగారు. "మావోయిస్టులు చనిపోతే నిర్ధారణ కమిటీ అంటూ వచ్చారు. మరి.. అదే మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ల పేరిట హత్యలుచేస్తే ఎందుకు స్పందించడం లేద'ంటూ విద్యార్థులను నిలదీశారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి మావోయిస్టులు అడ్డంకిగా మారారంటూ రోడ్డు మీదే ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న చింతూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, విద్యార్థులను, వారి వాహనాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు విద్యార్థులను తమ అదుపులో ఉంచుకుని, ఆ తర్వాత తెలంగాణలోని భద్రాచలంలో వదిలిపెట్టారు. కాగా, రోడ్డు మీద గ్రామస్థులు-విద్యార్థుల మధ్య వాగ్వివాదం కారణంగా చింతూరు-ఎర్రంపేట మధ్య ప్రధాన రహదారిపై కొన్ని గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. కాగా.. చింతూరు మీదుగా మారేడుమిల్లి చేరుకొనేందుకు ప్రయత్నించిన తమను అడ్డుకున్నది గ్రామస్థులు కాదు, వారు పోలీసులేనని తమ పట్ల నిరంకుశంగా వ్యవహరించారని తెలంగాణ విద్యార్థులు ఆరోపించారు.

లోయర్ సీలేరులో మరో 2 యూనిట్లు

- వచ్చే మే నాటికి 230 మెగావాట్లు అందుబాటులోకి

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో హైడల్ సామర్థ్యం మరో 230 మెగావాట్లు పెరగనుంది. ఏపీ-ఒడిశా సరిహద్దులోని లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టులో ఒక్కోటి 115 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు శరవేగంగా సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ 115 మెగావాట్ల సామర్థ్యంతో 4 యూనిట్లు ఉన్నాయి. అదనపు యూనిట్ల నిర్మాణానికి సంబంధించిన సివిల్ పనులు దాదాపు పూర్తయ్యాయని, టర్బయిన్లు, ఇతర పరికరాలను ఏర్పాటు చేసేందుకు బీహెచ్‌ఈఎల్ సిద్ధమవుతోందని జెన్కో అధికారులు తెలిపారు. వచ్చే మార్చి నాటికి 5వ, మే నాటికి 6వ యూనిట్ అందుబాటులోకి వస్తాయని చెప్పారు. దీంతో పవర్ ప్రాజెక్టు సామర్థ్యం 690 మెగావాట్లకు చేరుకుంటుంది. రోజుకు సగటున 5 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. శ్రీశైలం కుడికాల్వ పవర్ ప్రాజెక్టు సామర్థ్యం 770 మెగావాట్లు. రాష్ట్రంలో శ్రీశైలం తర్వాత లోయర్ సీలేరు రెండో అతిపెద్ద హైడల్ ప్రాజెక్టుగా నిలవనుంది.

4,154 రైలు ఇంజిన్లలో కవచ్ ఏర్పాటు పూర్తి: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాల నివారణకు ఉద్దేశించిన 'కవచ్' వ్యవస్థను మరింత విస్తృతం చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అత్యాధునిక 'కవచ్ 4.0' వెర్షన్‌ను అందుబాటులోకి తెచ్చామని శుక్రవారం లోక్‌సభలో తెలిపారు. 4,154 రైలు ఇంజన్లలో ఏర్పాటు పూర్తయిందని, మరో 9,069 ఇంజన్లలో ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించామన్నారు.

'తెలుగు' హైకోర్టుల్లో 4.82 లక్షల కేసులు పెండింగ్

తెలుగు రాష్ట్రాల హైకోర్టుల్లో 4.82 లక్షలకు పైగా, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో సివిల్, క్రిమినల్ కలిపి 19 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ వెల్లడించింది. రాజ్యసభలో మంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్ ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఈ నెల ఒకటో తేదీ వరకు ఏపీలో 2.49 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఏపీలో జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 9,27,899 సివిల్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు.

ఏపీకి 19 వేల కోట్ల పీఎం కిసాన్ నిధులు

పీఎం కిసాన్ కింద ఇప్పటివరకు ఏపీ రైతులకు రూ.19,121 కోట్లు చెల్లించినట్లు కేంద్ర వ్యవసాయ సంక్షేమ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ రాజ్యసభలో తెలిపారు. తెలంగాణ రైతులకు రూ.14,234 కోట్లు చెల్లించామని తెలిపారు. ఏపీలో 39 లక్షలకు పైగా రైతులు, తెలంగాణలో దాదాపు 30 లక్షల మంది రైతులు పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని చెప్పారు.

రూ.100తో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్

- మార్కెట్ విలువ 10 లక్షలు దాటితే ఫీజు రూ.1,000
- నామమాత్రంగా స్టాంప్ డ్యూటీ.. జీవో విడుదల

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం సులభతరం చేసింది. నామమాత్రపు స్టాంపు డ్యూటీ వసూలు చేసి, రిజిస్ట్రేషన్లను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జీవో జారీచేసింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం సదరు ఆస్తి విలువ రూ.10 లక్షల లోపు ఉంటే రూ.100, ఆ పైన ఉంటే రూ.1,000 ఫీజును స్టాంపు డ్యూటీ కింద తీసుకుంటారు. భూయజమానులు మరణించిన అనంతరం వారసులకు సంక్రమించే వాటికి మాత్రమే ఈ ఫీజులు వర్తిస్తాయని జీవోలో పేర్కొంది. ఇప్పటి వరకు వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లపై ఆ ఆస్తి మార్కెట్ విలువలో 1 శాతాన్ని స్టాంపు డ్యూటీగా వసూలు చేశారు. తల్లిదండ్రుల మరణానంతరం వారసత్వంగా వచ్చే ఆస్తులను వారసులు.. తహసీల్దారుకు దరఖాస్తు చేసి, కాగితాలపై రాసుకుంటున్నారు. వీటికి మ్యుటేషన్లు సకాలంలో జరగడం లేదని, తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది పదేపదే తిప్పుతున్నారని గతేడాదిలో 55 వేల ఫిర్యాదులు ప్రభుత్వానికి వచ్చాయి. వీలునామా రాయకుండా యజమాని మరణిస్తే.. వారసులు ఆ ఆస్తులను భాగాలు చేసుకొని, లిఖితపూర్వకంగా ఏకాభిప్రాయంతో వస్తే.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.100, రూ.1000కే రిజిస్ట్రేషన్ చేయనున్నారు.

తగ్గిన వర్షాలు.. పెరగనున్న చలి

- అల్లూరి జిల్లాలో 11.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

విశాఖపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'దిత్వా' తుఫాన్ బలహీనపడడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గాయి, దీంతో ఉత్తరాది నుంచి చలిగాలుల తీవ్రత పెరిగింది. ఏజెన్సీ, ఉత్తరాంధ్ర, తెలంగాణను ఆనుకుని ఉన్న కోస్తా ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. శుక్రవారం అల్లూరి జిల్లా దళపతిగూడలో 11.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, సీమల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, చలి తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

కొత్త వైద్య కాలేజీల్లో ఏ,బీ,సీ కేటగిరీల్లో పీజీ సీట్లు

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొత్త మెడికల్ కాలేజీల్లో ఎన్ఎంసీ కేటాయించిన పీజీ సీట్లకు సంబంధించి ప్రభుత్వం విభజన చేసింది. కాలేజీల వారిగా కేటాయించిన సీట్లలో 50 శాతం కన్వీనర్ కోటా, 35 శాతం సెల్ఫ్ ఫైనాన్స్, 15 శాతం ఎన్ఆర్ఐ కోటా కింద విభజించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. దీనికి అనుగుణంగానే ఆయా కాలేజీల్లో ఈ ఏడాది సీట్లు భర్తీ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ మేరకు.. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాలేజీల అడ్మిషన్స్ నిబంధనలు-1997కు ప్రభుత్వం సవరణలు చేసింది. ఈ సీట్లు మొత్తం ఏపీలోని విద్యార్థులతోనే భర్తీ చేయనున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ఐ కోటా సీట్లు కౌన్సెలింగ్ తర్వాత మిగిలిపోతే వాటిని ఎలా భర్తీ చేయాలన్న దానిపై డీఎంఈ ప్రత్యేక నిబంధనలు ఇవ్వనున్నారు. కన్వీనర్ కోటా సీట్లు మాత్రం రిజర్వేషన్లకు అనుగుణంగా భర్తీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.